
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం : fb.com/vaartha

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam

1-2-2025 శనివారం సంపుటి: 30 సంచిక: 364 పేజీలు: 8+16 వెల: 6.50


టెన్త్ స్పెషల్ క్లాసు విద్యార్థులకు ఇక స్నాక్స్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

5లో



## 6.8% ఆర్థిక వృద్ధి అంచనా

### లోక్‌సభలో ఆర్థిక సర్వే సమర్పించిన మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్ ఆర్థికవృద్ధి 6.3శాతంనుంచి 6.8శాతంగా ఉంటుందని, ద్రవ్యోల్బణం స్థిరంగానే నియంత్రణలో ఉంటుందని ఆర్థికసర్వేలో ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ఆధ్వర్యంలోరూపొందించిన కొత్తసంవత్సర ఆర్థికసర్వే నివేదికను మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దేశీయంగా ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని, నిరుద్యోగిత రేటు తగ్గుతోందని, ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంటూనే మరికొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాలని >>7



## ప్రపంచంలో 3వ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న భారత్ : రాష్ట్రపతి ముర్ము

**న్యూఢిల్లీ,జనవరి 31:** ఎన్డీయే ప్రభుత్వం గత ప్రభుత్వాల పాలనతో పోలిస్తే మూడురెట్లు వేగంగా పనిచేస్తోందని త్వరలో ప్రపంచంలోమూడో ఆర్థికవ్యవస్థగా భారత్ మారనున్నదని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ ఇన్నొవేషన్ పవర్‌హౌస్‌గా భారత్ మారిపోతోందని రాష్ట్రపతి అన్నారు. వక్స్‌చట్టాలకు సవరణలు, ఒకే దేశం ఒకే ఎన్నిక వంటి అంశాలపై ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించిందని అన్నారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. సంస్కరణలు, పనితీరు, పరివర్తనం అన్న మూడు అంశాల ఆధారంగా మరింత పురోగతివైపు భారత్ పయనిస్తోందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్ కొత్తపాలన నమూనాకు పర్యాయపదంగా మారాయని ఆమె అన్నారు. జి20, బ్రిక్స్ >>7



శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్‌లో కార్యకర్తలతో మాట్లాడుతున్న కెసిఆర్

# ఇక చూస్కో నా ప్రతాపం భారీ సభ పెడతా

## కాంగ్రెస్ మెడలు వంచుతా..

### ఈ నెలాఖరులో నివ్వెరపరిచే సభ..

### కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనం కొట్టేలా ఉన్నారు

### తులం బంగారానికి ఆశపడి ఆ పార్టీకి ఓటేశారు

### ఫాంహౌజ్‌లో పంటలు తప్ప ఏముంటాయి..

### రేవంత్ సర్కార్‌పై మాజీ సిఎం కెసిఆర్ ఘాటు విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి31:** రేవంత్‌రెడ్డి సర్కార్‌పై బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను కొడితే మామూలుగా కాదు, గట్టిగా కొట్టడం తన అలవాటన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం జరాసంగం మండలం మేదపల్లి గ్రామం నుండి వందలాది మంది ఉద్యమ కారులు, బి ఆర్ ఎస్ నాయకులు, అభిమానులు కేసీఆర్‌ను కలవడానికి గత ఐదు రోజులుగా 140 కిలోమీటర్లు పాదయాత్ర చేసి శుక్రవారం ఎర్రవెల్లి లోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఆత్మీయ సమావేశానికి కేసీఆర్ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా లేరన్నాని వ్యాఖ్యానించారు. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నానని, తాను ఎన్నో ప్రభుత్వాలను చూశానని.. ఇలాంటి ప్రభుత్వాన్ని మాత్రం చూడలేదన్నారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ వాళ్లు కనబడితే జనాలు కొట్టేలా ఉన్నారన్నారు. ఏ ప్రభుత్వం కావాలని కాంగ్రెస్ సోషల్ మీడియాలో ఓటింగ్‌పెట్టారన్నారు. ఇప్పుడే మనప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నా రన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వమే కావాలని ఓట్లు వేశారన్నారు. కాంగ్రెస్ పాలకులు రాష్ట్రాన్ని >>7



శుక్రవారం మొగిలిగిద్ద బహిరంగసభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

# చెల్లని వెయ్యి నోటు కెసిఆర్

## అసెంబ్లీకి వస్తే లెక్కలన్నీ చెప్తా

### రాష్ట్రాన్ని రూ. 7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన మాజీ సిఎం

### ఫామ్‌హౌజ్‌లో ఉండి సోది చెప్పొద్దు

### నన్ను కొట్టుడుకాదు.. ముందు సరిగా నిలబడు

### కెటిఆర్, హరీష్ యమకింకరులు

### మొగిలిగిద్ద బహిరంగసభలో నిప్పులు చెరిగిన సిఎం రేవంత్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జనవరి 31):** ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను బిఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని, అప్పుల నుండి కోలుకుంటూ దశల వారీగా అభివృద్ధి చేస్తుంటే సర్కార్ సంక్షేమాన్ని ఎగ్గొడుతుందని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్‌హౌజ్‌లో కూర్చొని సోది మాటలు చెబుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి కెసిఆర్ తీరుపై మొగిలిగిద్ద బహిరంగ సభలో విరుచుకుపడ్డారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్ పాఠశాల 150వ వార్షికోత్సవానికి పౌరహక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మొగిలిగిద్ద గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెసిఆర్ తీరుపై ధ్వజమెత్తారు. రాష్ట్రం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో అప్పజెబితే రూ.7 లక్షల కోట్లు అప్పు చేసి 2023లో మాకు ప్రభుత్వాన్ని >>7

## 'ఆప్'కు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

### తాజా ఎన్నికలకు పార్టీ టిక్కెట్లు రాకపోవడమే కారణం

### 5న ఢిల్లీ పోలింగ్

**న్యూఢిల్లీ, జనవరి 31:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీపార్టీకి భారీ షాక్ తగిలింది. ఒకేసారి ఏడుగురు ఎమ్మెల్యేలు శుక్రవారం రాజీనామాచేసారు. అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు పార్టీపైనా తమకు నమ్మకం పోయిందని వారంతా తమతమ రాజీనామా లేఖల్లో ప్రకటించారు. పార్టీలో ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేలు భావనాగౌర్, మదన్‌లాల్‌లు కేజ్రీవాల్ పైనా, పార్టీపైనా తమకు నమ్మకం లేదని అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు వేరువేరుగా లేఖలు పంపించారు. మీపట్ల పార్టీపట్ల విశ్వాసం లేదని అందువల్లనే ఈనిర్ణయం తీసుకున్నా దయచేసి నా రాజీనామాను ఆమోదించాలని భావనాగౌర్ తన లేఖలో వివరించారు. ఎమ్మెల్యేలు మెహ్రౌలి నుంచి నరేష్ యాదవ్, త్రిలోక్‌పురి రోహిత్ కుమార్, జనక్‌పురి రాజేష్ రిషి, ఆదర్శనగర్ పవన్‌శర్మ, బిఎస్ జూన్ >>7




శుక్రవారం బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోడీ

# వేతన జీవులకు ఊరట ఎంత?

### నేడే కేంద్ర బడ్జెట్

### నిర్మలమ్మ పద్దుపైనే అన్ని వర్గాల నజర్

### పేదలు, సామాన్యులపై మహాలక్ష్మి కృప: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 31:** కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే కొత్త సంవత్సర బడ్జెట్‌పైనే ఇపుడు అన్నివర్గాలు ఉత్కంఠతో ఉన్నాయి. అటు కార్పొరేట్‌రంగంతోపాటు, ఈక్విటీ ఫండ్ మార్కెట్ల ఇన్వెస్టర్లుసైతం నిర్మలమ్మ రాయితీలు, ప్రోత్సాహకాలపై ఎదురు చూస్తున్నారు. వేతనజీవులకు ఊరటనిచ్చే అంశాలు, ఆదాయపు పన్ను మినహాయింపు, వడ్డీ రాబడులపై మినహాయింపులు పరిమితులు పెంచుతారన్న అంచనాలు పెరిగాయి. అలాగే సాధారణ బడ్జెట్ పరిమితి ఐదులక్షలకు పెంచాలని ఎప్పటినుంచో డిమాండ్ వినిపిస్తోంది. ఈసారైనా పెంచుతారన్న అంచనాలు ఎక్కువ ఉన్నాయి. అలాగే కార్పొరేట్ రంగానికి ఊతంఇస్తూ పన్ను >>7

# టిటిడి రథసప్తమి వేడుకలు

## ఏడు వాహనాలపై ఊరేగనున్న మలయప్ప స్వామి

**తిరుమల,జనవరి 31ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా ఒకేరోజు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఏడువాహనాలపై ఊరేగనున్నారు. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 8గంటల వరకు జరిగే ఈ వేడుకలకు 2లక్షలమందికిపైగా భక్తులు తరలివస్తారని అంచనావేసి తదనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పటిష్ట ఏర్పాట్లపై శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి పాలక మండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి బోర్డుసభ్యులు, టిటిడి ఇఒ జె.శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒ మణికంఠచందోలు, టిటిడి సిపిఆర్‌ఒ డాక్టర్ తలారిరవి తదితర అధికారులతో గంటన్నరకుగాపై సమీక్షించారు. అనంతరం ఛైర్మన్ నాయుడు వివరాలను మీడియాప్రతినిధులకు వెల్లడించారు. ఫిబ్రవరి 4వతేదీ రానున్న మంగళవారం సూర్యజయంతి పర్వదినం పురస్కరించుకుని మలయప్పస్వామి ఉత్సవమూర్తి ఉదయం 5.30 గంటలకు తోలివాహనసేవగా సూర్యప్రభపై ఆలయమాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆ రోజు ఉదయం 6.44గంటలకు సూర్యోదయం కానున్నందున సూర్యకిరణాలు స్వామివారిపై ప్రసరిస్తాయన్నారు. అనంతరం ఉదయం 9గంటలకు చిన్నశేషవాహనం ఇలా రాత్రి 8గంటలకు చంద్రప్రభవాహన సేవలు ఉంటాయన్నారు. గత అనుభవాల దృష్ట్యా భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. మాఢవీధుల్లోని గ్యాలరీల్లో పోలీసులు, శ్రీవారిసేవకులు, ఎస్‌పిఎఫ్, ఆక్టోపస్, విజిలెన్స్ బలగాలు భద్రతాపరంగా, సేవలకు సిద్దంగా ఉంటారన్నారు. దాదాపు 3లక్షలమంది లోపు భక్తులు రావచ్చని అంచనాతో అన్ని ఏర్పాట్లు తీసుకున్నామన్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటుచేశారు. ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులనునియమిస్తున్నామన్నారు. భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన చర్యలు తీసుకున్నారు. 8లక్షల లడ్డూలు అదనంగా నిల్వఉంచడం జరుగుతుందన్నారు.

**4న అన్ని దర్శనాలు రద్దు:**

4వతేదీ మంగళవారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశామని ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్ధులు,దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 3వతేదీ నుండి 5వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేశారు.

**ఉదయం నుండి రాత్రి వరకు వాహనసేవలు:**

4వతేదీ ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానమహోత్సవం, సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు కల్పవృక్షవాహనం, సాయంత్రం 6గంటల నుండి 7గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9గంటల వరకు చంద్రప్రభవాహనసేవ చివరగా ముగుస్తుంది.

# గద్దర్‌కు చరిత్రలో ఒక పేజీ



శుక్రవారం ఘనంగా జరిగిన గద్దర్ జయంతి వేడుకలో సిఎం రేవంత్, డి.సిఎం భట్టి, మంత్రి జూపల్లి, గద్దర్ సతీమణి, కుమారుడు తదితరులు

### ఆయన్ని అగౌరవపరిస్తే ఊరుకోం..

### పద్మ పురస్కారం గద్దర్‌కు ఇవ్వక పోవడం అన్యాయం: సిఎం రేవంత్ రెడ్డి

### వచ్చే ఉగాదినుంచి గద్దర్ ఫిల్మ్ అవార్డులు: డి. సిఎం భట్టి

### ఘనంగా జరిగిన గద్దర్ 77వ జయంతి వేడుకలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 31 ప్రభాతవార్త :** గద్దర్ తన కుటుంబంకంటే సమాజమే తన కుటుంబమని, సమాజంలో ఉన్న సామాజిక సమస్యలను పరిష్కరించాలి, పోరాటం చేయాల్సిన బాధ్యత ఉందని నిరంతరం ప్రజాజీవితంలో ముందుకువెళ్లి స్ఫూర్తిగా నిలిచారని, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన గద్దర్‌కు చరిత్రపుటల్లో ఒక పేజీ ఉండేలా నిర్ణయాలు తీసుకుంటున్నామన్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గద్దరన్నను మరోసారి అగౌరపరిచి, అహంపూర్తిగా వ్యవహరిస్తే పార్టీ అడ్రస్ మార్చుకోవడంతో వచ్చే ఎన్నికల్లో గల్లంతై పోవడం ఖాయమని కేంద్రంలోని బిజెపి, నాయకులను హెచ్చరించారు. గొప్ప వ్యక్తి గద్దర్‌ను గుర్తించడం ద్వారా భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిని వ్వాలని ప్రభుత్వం ఆయన జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడంతోపాటు ఎల్లకాలం స్మరించుకోవడానికి గద్దర్ అవార్డులను ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

ప్రతీ సంవత్సరం కేంద్రప్రభుత్వం అందించే పద్మ పురస్కారాల కోసం తమతో విభేదించినా నాలుగు కోట్ల తెలంగాణ సమాజం కోసం మమేకమైన వారిని గుర్తించాలని గద్దర్‌తోపాటు చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర్ తిరుమల్ >>7

## వికటించిన మధ్యాహ్న భోజనం

### విద్యార్థినులకు అస్వస్థత

### ఆసుపత్రికి తరలింపు

**ధర్మపురి, ప్రభాతవార్త:** ధర్మపురిలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల కళాశాలలో గురువారం మధ్యాహ్నం భోజనం వికటించడంతో. ఐదుగురు విద్యార్థినులు అస్వస్థత గురయ్యారు.

దాంతో చికిత్స కోసం గురువారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న వేళలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు భోజనం చేశారు. రాత్రి వేళలో ఐదుగురు విద్యార్థినులు వాంతులు చేసుకోవడంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు.

మధ్యాహ్నం భోజనంలో బియ్యాన్ని సరిగా ఉడికించకపోవడంతో కడుపునొప్పి తోపాటు వాంతులు అయ్యాయని సదరు విద్యార్థినులు తెలిపారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. అలాగే వైద్యులతో మాట్లాడి, మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

## డా. ప్రభావతికి సుప్రీంలో ఊరట

### ఎపి డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు

**విజయవాడ,జనవరి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ శాసనసభ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, ఎంపీగా ఉన్న సమయంలో రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో డాక్టర్ ప్రభావతికి సుప్రీంకోర్టులో ఊరట లభించింది. హైకోర్టు తీర్పుపై సుప్రీం ధర్మాసనం స్టే విధించింది. అయితే విచారణకు సహకరించాలని ప్రభావతిని ఆదేశించింది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ప్రభావతికి ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఏపీ హైకోర్టు నిరాకరించింది. కేసు విచాణ దశలో ఉన్నందున ఆమె దాఖలు చేసిన యాంటిసిపేటరీ బెయిల్‌ను మంజూరు చేయడానికి హైకోర్టు తిరస్కరించింది. అంతకు ముందు గుంటూరు జిల్లా కోర్టుకు ఆమె ముందుస్తు బెయిల్ పిటిషన్ తోసిపుచ్చింది.ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఆమె సవాల్ చేశారు. ప్రభావతి పిటిషన్ ను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారించింది.రఘురామ ఈ కేసులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసారు.ఈ కేసులో తన వాదనలు వినాలను ఆయన తన న్యాయవాది



ద్వారా కోర్టును అభ్యర్ధించారు.వీటిని పరిశీలించిన ధర్మా సనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. విచారణకు డాక్టర్ ప్రభావతి హాజరు కావాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. తదుపరి ఉత్తర్వుల వరకు హైకోర్టు ఆదేశాలపై స్టే ఇచ్చిన ధర్మాసనం, 4 వారాలకు విచారణను వాయిదా వేసింది. రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఏ5గా ప్రభావతి ఉన్నారు.

# 'శారీ' సెకండ్ లిరికల్ వీడియో సాంగ్

విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ లేటెస్ట్ మూవీ శారీ లాగ్ లైన్: టూ మచ్ లవ్ కెన్ బి స్కేరీ. గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో,ఆర్జీవీఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై ప్రముఖ వ్యాపారవేత్త రవి శంకర్ వర్మ నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా మూవీగా తెలుగు, హిందీ, తమిళ, మరియు మళయాళ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరో హీరోయిన్లుగా పలు నిజజీవిత సంఘటనల ఆధారాలతో సైకలాజికల్ థ్రిల్లర్‌గా శారీ మూవీ రూపొందుతోంది. శారీ చిత్రానికి సంబంధించిన సెకండ్ లిరికల్ వీడియో సాంగ్ ఎగిరే గువ్వలాగా.. విడుదల చేసారు. ఆర్జీవీ డెన్ మ్యూజిక్ ద్వార సెకండ్ లిరికల్ సాంగ్ ఎగిరే గువ్వలాగా... రిలీజ్ చేసామని రామ్ గోపాల్ వర్మ తెలిపారు. ఈ పాట రాకేష్ పనికెళ్ళ ట్యూన్ చేసి లిరిక్ కూడా అతనే ఇచ్చాడని, పాటలో సాహిత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, ఈ పాటను సింగర్ సాయి చరణ్ పాడారని ఆయన తెలిపారు. నిర్మాత రవి శంకర్ వర్మ మాట్లాడుతూ, మా శారీ చిత్రంలోని తొలి లిరికల్ సాంగ్ ఇటీవల విడుదల చేసిన ఐ వాంట్ లవ్‌కి విశేష స్పందన లభించింది. సెకండ్ లిరికల్ సాంగ్ ఎగిరే గువ్వలాగా... రిలీజ్ చేసాము. ఇంకా హిందీ, తమిళ, మళయాళ భాషల్లో కూడా ఈ సెకండ్ లిరికల్ సాంగ్ విడుదల చేసాము. ప్రస్తుతం సెన్సార్ కార్య క్రమాలు జరుగుతున్నాయ్, కొన్ని అనివార్య కారణాల వలన విడుదల ఆలస్యం అయింది త్వరలోనే విడుదల తేది ప్రకటిస్తాము అన్నారు.

బ్యానర్: ఆర్జీవీ ఆర్వీ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి, నటీనటులు: సత్యా యాదు, ఆరాధ్య దేవి, సాహిల్ సంభవాల్, అప్పాజీ అంబరీష్, కల్పలత తదితరులు, సినిమాటోగ్రఫీ: శబరి, మ్యూజిక్: రాకేశ్ పనికెళ్ళ, పాట రచన, బాణీ: రాకేశ్ పనికెళ్ళ, నిర్మాత: రవి శంకర్ వర్మ, దర్శకత్వం: గిరి కృష్ణ కమల్.



# 'తండేల్'లో నటించడం నా అదృష్టం: నాగ చైతన్య

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం 'తండేల్'. 'కార్తికేయ2' లాంటి బంపర్ హిట్ కొట్టిన డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వంలో సక్సెస్‌ఫుల్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రమోషన్స్ ఓ రేంజ్‌లో చేస్తుంది. తాజాగా గురువారం ఈ మూవీ తమిళ ట్రైలర్‌ను చెన్నైలో విడుదల చేశారు. కోలీవుడ్ స్టార్ కార్తి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్, డైరెక్టర్ వెంకట్ ప్రభు సహా చిత్ర యూనిట్ పాల్గొన్నారు. ఈ చిత్రాన్ని తమిళంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సందర్భంగా, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఎస్.ఆర్.ప్రభు మాట్లాడుతూ, ఇప్పుడు మన ఇండియన్ సినిమాల్లో భాషా పరమైన హద్దులు చెరిగిపోతున్నాయి. అందుకు సినిమాలకు పెడుతున్న టైటిల్స్.. వాటిని ఆదరిస్తోన్న ప్రేక్షకులే. బాహుబలి రిలీజ్ తర్వాత మనకు ఇది అలవాటుగా మారిపోయింది. బాహుబలి రిలీజ్ సమయంలో ఆ టైటిల్ అర్థమేంటని ఎవరూ అడగలేదు. ఇప్పుడు తండేల్ సినిమా విషయంలోనూ అలాగే ఎవరూ టైటిల్‌కు అర్థమేంటని ఎవరూ అడగటం లేదు. ప్రేక్షకులు సినిమాకు మంచి ఆదరణను చూపిస్తున్నారు. 'తండేల్' అంటే లీడర్ అని అర్థం. ఆ విషయాన్ని మనం ట్రైలర్‌లోనే చూపించారు. సినిమాను ఎంతో ప్యాషనేట్‌గా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించారని చూస్తుంటేనే అర్థమవుతుంది. ఇక ఈ మూవీని తమిళంలో విడుదల చేసే అవకాశం కలిగించిన అల్లు అరవింద్‌కి థాంక్స్. కానీ ఆయన ఐదు దశాబ్దాలుగా నిర్మాతగా కొనసాగుతున్నారు. ఇది సాధారణమైన విషయం కాదు. ఎన్నో గొప్ప సినిమాలను నిర్మించిన సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశం మాకు ఇచ్చినందుకు అరవింద్‌కి థాంక్స్. నేను నాగచైతన్యగారితో కలిసి పని చేయాలని అనుకుంటాను. అందుకని నేను కథలు విన్న ప్రతీసారి వాటిని చైతన్యకి పంపుతుంటాను. సాయిపల్లవి ఓ సినిమా చేసిందంటే చాలా మంచి సినిమా అయ్యుంటుందనే నమ్మకాన్ని ఆమె ఈరోజు అందరి మనసుల్లో సంపాదించుకున్నారు. తండేల్ ఆ కోవలో ప్రేక్షకులను మెప్పిస్తుందని గట్టిగా నమ్ముతున్నాను. ఇందులో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు. దర్శకులు చందూ మొండేటికి, మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్‌గారికి థాంక్స్. ప్రేమకథా చిత్రాలకు సంగీతాన్ని అందించటానికి మ్యూజిక్ డైరెక్టర్స్ ఎప్పుడూ ప్రత్యేకమైన ఆసక్తిని చూపిస్తుంటారు. దేవిశ్రీ తనదైన శైలిలో అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఫిబ్రవరి 7న తండేల్ సినిమా రిలీజ్ అవుతోంది. తప్పకుండా సినిమా అందరినీ మెప్పిస్తుంది అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ, తండేల్ సినిమాను డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసు వన్ లైనర్స్‌గా చెప్పినప్పుడు ఎంతగానో నచ్చేసింది. ఓ ఇంట్రెస్ట్ క్రియేట్ అయ్యింది. అది సినిమా అంతా కొనసాగుతూ వచ్చింది. ఈ జర్నీని నేను ఎంతో ఎంజాయ్ చేశాను. అల్లు అరవింద్‌గారికి నేను చిన్నప్పటి నుంచే తెలుసు. చాలా మంచి వ్యక్తి. ఆయనకు స్పెషల్ థాంక్స్. చైతన్య నాకు చాలా మంచి స్నేహితుడు. ఈ సినిమా కోసం తను పూర్తిగా మారారు. తన పోస్టర్‌ను ముందుగా చూసినప్పుడు ఇది నాకు తెలిసిన చైతన్య కాదే అనిపించింది. చాలా కష్టపడ్డారు. సాయి పల్లవి పేరు చెబితే చాలు. అద్భుతంగా నటించింది. ఆమె డాన్స్‌కు నేను పెద్ద అభిమానిని. విజువల్స్ చాలా గొప్పగా ఉన్నాయి. చక్కటి కథ. ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన కార్తికి థాంక్స్. వెంకట్ ప్రభు, కార్తీక్ సుబ్బరాజ్‌కి థాంక్స్. వివేకన్ అద్భుతమైన లిరిక్స్‌ను అందించారు. ట్యూన్స్‌కు ఆయన తన సాహిత్యంతో ప్రాణం పోశారు. తండేల్ చిత్ర యూనిట్‌కు స్పెషల్ థాంక్స్. సినిమాను ఫిబ్రవరి 7న థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. హీరోయిన్ సాయి పల్లవి మాట్లాడుతూ, మా తండేల్ చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించటానికి ఇక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ కథను ఓ రియల్ స్టోరీలాగా ముందుగా చెప్పారు. తర్వాత దాన్ని అందమైన ప్రేమ కథగా మార్చారు.




# స్ట్రీమ్ కానున్న 'కాఫీ విత్ ఏ కిల్లర్'

ఆర్ పి పట్నాయక్ కథ రచనా దర్శకత్వంలో సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సతీష్ నిర్మాతగా ఆహా ఓటిటిలో ప్రేక్షకులకు అందుబాటులో ఉండనున్న చిత్రం కాఫీ విత్ ఏ కిల్లర్. టెంపర్ వంశీ, శ్రీనివాసరెడ్డి, సత్యం రాజేష్, రవిబాబు, అంబటి శ్రీను, శ్రీరాప, జెమిని సురేష్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం క్రైమ్ జోనర్ లా అనిపి స్తుంది. అనుష్ గోరక్ ఈ చిత్రానికి డిఓపి, ఎడిటర్, డిఐగా వ్యవహరించగా తిరుమల డైలాగులు రాశారు. ఆహాలో స్ట్రీమ్ కానున్న సందర్భంగా ఈ చిత్ర యూనిట్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ విధంగా స్పందించారు. ఈ సందర్భంగా నటుడు అంబటి శ్రీను మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ చిత్రం చాలా అద్భుతంగా ఉండబోతుంది. మంచి కాఫీ తాగే ఫీల్ కలిగిస్తుంది. ఈ చిత్రంలో నాకు మంచి పాత్రను ఇచ్చిన ఆర్ పి పట్నాయక్‌కి నా కృతజ్ఞతలు. ఆయన అంటే నాకు ఎంతో అభిమానం. నేను ఆయన పాటలకు వీరాభిమానిని. ఆర్‌పి పట్నాయక్ అభిమానులు ఆయన నుండి ఒక యూత్ ఫుల్ లవ్ స్టోరీ రావాలని కోరుకుంటున్నారు. అలాగే ఈ చిత్రం నిర్మాత సతీష్‌కి, గౌతం పట్నాయక్‌కి నా కృతజ్ఞతలు. ఈ సినిమాలో నటించిన నటీనటులు ఎవరికీ కూడా ఈ చిత్ర కథ ఏంటి అనేది తెలీదు. కాబట్టి చిత్రాన్ని అందరూ తప్పకుండా ఆహ్వానం చూసి ఎంజాయ్ చేయండి అన్నారు. నటి శ్రీరాప మాట్లాడుతూ, మీడియా వారికి పెద్దలకు అందరికీ నమస్కారం. కాఫీ విత్ ఏ కిల్లర్ సినిమా గురించి మాట్లాడాలి అంటే ముందుగా నేను గౌతమ్ గురించి మాట్లాడాలి. ఆయన ఈ చిత్రానికి ఎంత ముఖ్యమైన వ్యక్తి. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన వారికి నా కృతజ్ఞతలు. అలాగే ఆర్ పి పట్నాయక్ అంటే తెలియని వారు లేరు. ఆయన సంగీత దర్శకుడుగా అలాగ దర్శకుడిగా ఎంతో మంచి పేరు ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో పనిచేయడం ఎంతో ఆనందంగా అనిపించింది అన్నారు. నటుడు జెమిని సురేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ చిత్రంలో నటించిన నేను ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఈ చిత్రంలో కాఫీ షాప్ మేనేజర్ పాత్ర పోషిస్తున్నాను. సినిమా అంతా నా చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. ఈ సినిమాలో కిల్లర్ ఎవరు? ఎవరిని చంపుతాడు? అనే విషయాలు తెలుసుకోవాలంటే ఖచ్చితంగా ఆహాలో ఈచిత్రాన్ని చూడాల్సిందే. ఈచిత్రం ఎంతో ప్రత్యేకం. తెలుగుచిత్ర పరిశ్రమలో ఉన్న ఎంతోమంది కమెడియన్స్ అంతా కలిసి చాలా కాలం తర్వాత నటించిన చిత్రం. చిత్రంలో ప్రతి సీన్ ఎంటర్టైన్మెంట్‌గా ఉంటుంది. చిత్రానికి సాంకేతిక బృందం ఎంతో ప్రత్యేకమైనది. ఈ చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులు అందరూ చాలా టాలెంటెడ్. ఈ రోజుల్లో ఒక సినిమా తీసి బయటికి వెళ్లాలంటే ఎంతో ఛాలెంజ్ అయిపోయింది. అటువంటి పరిస్థితుల్లో సతీష్ ఈ చిత్రాన్ని నిర్మించి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ చిత్రంలో నా పాత్ర మీకు గుర్తుండిపోతుంది. అలాగే ఎన్నో మంచి సినిమాలు అందిస్తున్న ఆహాలో ఈ చిత్రం ఇంకా మంచి సినిమాగా నిలిచిపోతుంది. ఈ చిత్ర టీం అందరికీ నా ధన్యవాదాలు అన్నారు. నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ, మా ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. ఒక మంచి సినిమా చేశాము. అందరికీ ఎంతో ఇష్టమైన సంగతి దర్శకుడు అలాగే ప్రతి సారి ప్రత్యేకమైన చిత్రాలతో ప్రేక్షకులకు ముందుకు వచ్చే దర్శకుడు ఆర్పి పట్నాయక్. ఆయన చేసిన చిత్రం ఈ కాఫీ విత్ ఏ కలర్ నేటినుండి ఆహాలో స్ట్రీమ్ అవుతుంది. రెండు గంటలపాటు మిమ్మల్ని ఎక్కడికి కదలకుండా చేసే ఒక ప్రత్యేకమైన చిత్రంగా ఉండబోతుంది. తిరుమల నాగ్ డైలాగ్స్ చాలా బాగుంటాయి. శ్రీనివాస్ రెడ్డి పాత్ర ఎంతో అద్భుతంగా ఉండబోతుంది. ఈ చిత్రానికి సాంకేతిక బృందం చాలా కష్టపడి పనిచేశారు.



# ఒకప్పుడు ఐఎఎస్..ఇప్పుడు హీరోయిన్

డాక్టర్ కాబోయి..యాక్టర్ అయ్యాను అనే సామేత చాలాకాలం నుంచి మనం వింటూనే ఉన్నాం. కానీ ఓ హీరోయిన్ కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా మారింది. ఆ హీరోయిన్ మరెవ్వరో కాదు రాశి ఖన్నా. అవును ఇది నిజం. రాశి ఖన్నా కలెక్టర్ కాబోయి హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ వివరాల్లోకి వెళ్తే, రాశి ఖన్నా 1990 నవంబరు 30న న్యూఢిల్లీలో జన్మించారు. రాశి ఖన్నా మొదటి నుంచి కూడా బ్రిలియంట్ స్టూడెంట్. స్కూల్లో, కాలేజీలో టాపర్. మధ్యతరగతి కుటుంబానికి చెందిన రాశి ఖన్నా,తొలుత ఉద్యోగం చేయలని భావించింది. అందుకే కలెక్టర్ చదవాలని కోరుకుంది. కొంతకాలం ట్రైనింగ్ తీసుకొని పరీక్షలు కూడా రాసింది. కానీ విఫలం అవ్వడంతో ఆ తర్వాత నటనపై ఆసక్తి పెంచుకొని సినీ రంగం వైపు అడుగులు వేసింది.రాశి ఖన్నా తెలుగు, తమిళం, హిందీ సినిమాలలో నటించారు. ఆమె తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఊహాలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాతోనే మంచి మార్కులు కొట్టేసింది. జోరు, జిల్, బెంగాల్ టైగర్, శివం, సుప్రీం, హైపర్, జై లవ కుశ, టచ్ చేసి చూడు, తొలిప్రేమ, శ్రీనివాస కళ్యాణం తదితర సినిమాల్లో నటించారు.అందానికి అందం, టాలెంట్‌కు టాలెంట్ రాశి ఖన్నా సొంతం. కెరీర్ స్టార్ చేసి పుష్కరకాలం అయినప్పటికీ అమ్మడు కెరీర్‌లో పెద్దగా హిట్లు లేవనే చెప్పాలి. కారణాలు తెలియదు కానీ స్టార్ హీరోలతో నటించే అవకాశం రాశి ఖన్నాకు దక్క లేదనే చెప్పాలి. ఎన్టీఆర్ మినయిస్తే మిగిలిన హీరోలెవ్వరూ కూడా రాశి ఖన్నా వైపు కన్నెత్తి చూడలేదు పోలవరంపై కేంద్రం సంచలన ప్రకటన ఇక సెకండ్ గ్రేడ్ హీరోలతో రాశి ఖన్నా నటించిన సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. దీంతో బాలీవుడ్ బాట పట్టిన ఈ అమ్మడుకు అక్కడ కూడా నిరాశే ఎదురైంది. బాలీవుడ్‌లో బికినీ, లిప్‌లాక్ వంటి సన్నివేశాల్లో నటించినప్పటికీ పెద్దగా లాభం లేకపోయింది. రాశి ఖన్నా ప్రస్తుతం హిందీలో వెబ్ సిరీస్‌తో పాటు యోధ సినిమాలో యాక్ట్ చేస్తోంది. తెలుగులో పద్దతి కనిపించే రాశి ఖన్నా.. బాలీవుడ్‌లో మాత్రం హాట్‌గా కనిపిస్తోంది. అక్కడి హీరోలతో లిప్‌లాక్‌లు ఇస్తూ రెచ్చిపోతుంది. ఇలా ఐఎఎస్ కావాల్సిన రాశి ఖన్నా హీరోయిన్‌గా మారింది.





# 'అగత్యా' రిలీజ్ డేట్ పోస్ట్‌పోన్

కోలీవుడ్ నటుడు జీవా, యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా నటిస్తున్న తాజా చిత్రం 'అగత్యా'. వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి గణేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ గీత రచయిత పా.విజయ్ కథ, దర్శకత్వ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంతో పాటు మంచి థ్రిల్లింగ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో రాశీఖన్నా హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి రీసెంట్‌గా విడుదలైన సెకెండ్ సాంగ్ బాగా ఆకట్టుకుంది. నేలమ్మ తల్లి అంటూ సాగే ఈ పాట అర్జున్‌ను హైలెట్ చేస్తూ ఉంది. జీవా నటించిన గత చిత్రం బ్లాక్ కూడా మంచి విజయం అందుకుంది. ఇప్పుడు అగత్యాతో తమిళం, తెలుగు, హిందీ ప్రేక్షకులను పలకరించేందుకు రెడీ అవుతున్నారు. ఈ సినిమా అద్భుతమైన సీజీ వర్క్‌తో భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఇందులో మన సంస్కృతి, మానవ అనుబంధాలను దర్శకుడు బలంగా స్పృశిస్తున్నారు. మార్వెల్ చిత్రాల తరహాలో ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించేందుకు చిత్ర యూనిట్ కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో వీఎఫ్ఎక్స్ వర్క్ కోసం మరికొంత సమయం కేటాయించాలని భావించిన మేకర్స్.. సినిమా విడుదలను జనవరి 31 నుంచి ఫిబ్రవరి 28కి పోస్ట్ పోన్ చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. అవేంజర్స్ తరహాలో ప్రేక్షకులను వేరే ప్రపంచానికి తీసుకెళ్లే ఊహాత్మక కథా చిత్రంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు.



# నిర్మాత వేదరాజు టింబర్ మృతి

అల్లరి నరేష్‌తో 'మడత కాజా', 'సంఘర్షణ' వంటి చిత్రాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్ (54) శుక్రవారం ఉదయం స్వర్గస్తులయ్యారు. సినిమాలపై ఇష్టంతో ఓ వైపు కన్‌స్ట్రక్షన్ రంగంలో బిజీగా ఉంటూనే మరోవైపు సినిమాలను నిర్మించిన నిర్మాత వేదరాజు టింబర్. త్వరలో మరో చిత్ర నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఈ సంఘటన జరిగింది. గత కొంతకాలంగా ఊపిరితిత్తులకు సంబంధించిన అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఎ ఐ జి హాస్పిటల్‌లో ఆయన చికిత్స తీసుకుంటున్నారు. త్వరలోనే కోలుకుని వస్తారు అని సన్నిహితులు, కుటుంబ సభ్యులు భావిస్తున్న తరుణంలో ఇలా జరగటం వారందరిలో విషాదాన్ని నింపింది. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు శుక్రవారమే జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



# హర్యానా భామకు తెలుగులో మరో ఛాన్స్

హర్యానా భామ యుక్తి తరేజాకు తెలుగులో ఓ మంచి ఛాన్స్ దక్కింది. తను హీరోయిన్‌గా నటించిన మలయాళీ సినిమా మార్కో భారీ హిట్‌గా నిలిచింది. ఆ సినిమా హిట్ అవడంతో యుక్తికి ఇప్పుడు తెలుగులో మరో అవకాశం దక్కింది. ఎందుకంటే యుక్తి తరేజా ఇప్పటికే తెలుగులో ఓ సినిమా చేసింది. కానీ ఆ సినిమా హిట్ కాకపోవడంతో తర్వాత టాలీవుడ్ లో కనిపించకుండా పోయింది. నాగశౌర్య హీరోగా 2023లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రంగబలి సినిమాలో యుక్తినే హీరోయిన్. రంగబలి సినిమా తర్వాత యుక్తికి తెలుగులో వరుస ఆఫర్లు వస్తాయని అందరూ అనుకున్నారు కానీ అమ్మడికి లక్ కలిసిరాకపోవడంతో టాలీవుడ్ నుంచి ఆఫర్లు రాలేదు. ఈ గ్యాప్‌లో యుక్తి మలయాళంలో చేసిన మార్కో సినిమా రీసెంట్‌గా రిలీజై మంచి హిట్ అందుకుంది. ఇప్పుడు మార్కో సినిమా హిట్ అవడంతో అందరి ఫోకస్ యుక్తి తరేజా వైపు మళ్లింది. ఈ నేపథ్యంలో అమ్మడిని కిరణ్ అబ్బవరం సినిమాలో హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. రాజేష్ దండా నిర్మించనున్న కె ర్యాంప్ సినిమా కోసం యుక్తిని తీసుకున్నట్లు సమాచారం. కె ర్యాంప్ కథ బాగా వచ్చిందని ఆల్రెడీ టాక్ వినిపిస్తుంది. ఈ సినిమా కూడా హిట్ అయితే యుక్తికి తెలుగు నుంచి అవకాశాలు క్యూ కట్టే ఛాన్సుంది. 2019లో మోడలింగ్‌తో కెరీర్ ను స్టార్ట్ చేసిన అమ్మడు తర్వాత ఎంటీవీ సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్‌లో 4వ ప్లేస్ సాధించి అందరినీ ఆకర్షించింది. తర్వాత ఎన్నో కమర్షియల్ యాడ్స్‌లో నటించగా ఆ టైమ్‌లోనే యుక్తికి నాగశౌర్య సరసన నటించే అవకాశం దక్కింది. హర్యానాకు దగ్గరలోని కైతల్ ప్రాంతంలో పర్వీన్ తరేజా, రీటా తరేజా జంటకు 2000వ సంవత్సరంలో జన్మించిన యుక్తి తరేజా యాక్టింగ్‌పై ఉన్న ఇంట్రెస్ట్ తో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత ఇమ్రాన్ హాష్మీ చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బమ్ లో మొదటిసారిగా కనిపించింది. ఆ సాంగ్ లో తనకు స్క్రీన్ స్పేస్ తక్కువైనప్పటికీ తర్వాత మాత్రం అమ్మడికి పలు ఆఫర్లు దక్కాయి.





# అరబ్‌లో తెలగమ్మాయి ఘనత!



ఈ కాలం పిల్లలు మొబైల్, వీడియోగేములంటూ కాలక్షేపం చేస్తారు. చుట్టూ ఉండే ప్రపంచాన్ని పట్టించుకోరు అనేది చాలామంది ఫిర్యాదు. అలాంటి వాళ్లకి అక్కినేని మోనికని చూపించాలి. ప్రపంచ సమస్యలు, పర్యావరణం గురించి ఆలోచించడమే కాదు... వాటికి పరిష్కారం చూపి, అరుదైన పురస్కారాన్నీ అందించింది. మోనికా స్వస్థలం ఏలూరు. అమ్మ స్వీటీ, నాన్న భూపేష్, తండ్రి వృత్తిరీత్యా ఈమె కుటుంబం అబుదాబిలో స్థిరపడింది. అక్కడి మెర్రీలాండ్ ఇంటర్నేషనల్ స్కూల్లో పదో తరగతి చదువుతోంది. మోనిక సస్టెయినబిలిటీ అంటే ఆసక్తి దానికి సంబంధించి పరిశోధనలు చేస్తూనే ఉంటుంది. నీటిలో దొరికే ఆల్గేతో కర్బన ఉద్గారాలు తగ్గించేలా ప్రాజెక్టులూ చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్... ఏటా 'జాయెద్ సస్టెయినబిలిటీ ప్రైజ్'లు అందుకున్నారు.. ప్రపంచ పర్యావరణానికి సంబంధించి సవాళ్లకు పరిష్కారాలు చూపినవారికి వీటిని అందిస్తారు. వివిధ కేటగిరీలూ ఉంటాయి. ప్రపంచ దేశాలకు చెందినవారు ఈ పోటీలో పాల్గొంటారు. విద్యార్థులూ తమ ఆలోచనలను పంచుకోవచ్చు. దానికి తన ఆలోచనను పంపింది మోనిక ఇల్లు, తరగతులు వంటి చోట్ల కర్బన ఉద్గారాలు తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించాలనే ప్రతిపాదన. గతంలో అల్గేతో నేను చేసిన ప్రాజెక్టునే ఇందుకు ఉదాహరణ. నా ఆలోచన 'జాయేద్ సస్టెయినబిలిటీ'కి ఎంపికైంది. అయితే తరవాతి దశలో అది ప్రయోగాత్మకంగా ఎలా నిరూపితమవుతుందో రుజువు చేయాలి. దీనితో స్కూలు సాయంతో ఓ సంస్థతో కలిసి పనిచేశా. ఈసారి అల్గేతోపాటు కొబ్బరిపీచు, సహజ రబ్బరులను ఉపయోగించి బయోడిగ్రేడబుల్ టైల్స్ రూపొందించబడింది. ఇవి మనం వదిలే కార్బన్ డై ఆక్సైడ్ని పీల్చుకోవడమే కాదు... గాలి స్వచ్ఛతనూ పెంచుతాయి' అంటోంది 15 ఏళ్ల మోనిక ప్రపంచవ్యాప్తంగా ఆరువేల మందికి దరఖాస్తు చేసుకుంటే తుది పోటీకి 33 మంది ఎంపికయ్యారు. అందులో మోనిక ఒకరు. దీని కోసం ఈ అమ్మాయి అయిదు నెలలు కష్టపడింది. ప్రయోగాత్మకంగా స్కూల్లోనూ ఉపయోగించి విజయం సాధించింది. తాజాగా తన 'బయోడిగ్రేడబుల్ టైల్స్' జాయేద్ స్టెయినబిలిటీ నుంచి బెస్ట్ కాన్సెప్ట్ ఆఫ్ ద ఇయర్ అవార్డునూ దక్కించుకుంది. యూఏఈ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకుంది మోనిక చిన్నవయసులో పర్యావరణ హితం కోసం ఆలోచిస్తూ అందరిచేతా శభాష్ అనిపించుకుంటోంది. భవిష్యత్తులో డాక్టర్ అవ్వాలన్నది తన కల. □

# సవాళ్లే పాఠాలు నేర్పాయి!



ఏటా రైలు పట్టాల్ని పనిచెయ్యడానికి వందల కోట్లు ఖర్చవుతుందట. కానీ జవ్వాది వెంకట అమూష చాలా తక్కువ మొత్తంతో ఆ పని పూర్తి చేసారు. ఇదొక్కటే కాదు... ఇలాంటి ఎన్నో అసాధ్యాలను, సాధ్యం చేశారు. ఇందుకుగాను 63వ రైల్వే సేవా పురస్కారాల్లో ఆమె 'అతి విశిష్ట రైల్వే సేవా పురస్కారం' అందుకున్నారు. రైల్వేలో ఏ పని జరగాలన్న అనుమతులు, బడ్జెట్ నిధులు అంటూ ప్రతిదానికీ వేచి చూడాలి. వేల మొత్తంతో ఏ పని జరగదు. రూ.కోట్లు కావాలి. అందుకే ఈ జాప్యం.అయితే నా స్థాయిలోనైనా ఇది మారాలనుకున్నా. 15 ఏళ్లుగా ప్రయత్నించనే ఉన్నా. అందులో ఒకటే ఇది. రైళ్ల రాకపోకలతో పట్టాల కింద ఉన్న మట్టి వదులైపోతుంది. సంవత్సరానికోసారైనా దానికి ఫార్మేషన్ ట్రీట్మెంట్ చేయాలి. అప్పుడు ఒక కి.మీ.కి రూ.56 లక్షల వరకు ఖర్చవుతుంది. కానీ నేను జియోగ్రిడ్, జియోసెల్ ఉపయోగించి, రూ.3 లక్షల పూర్తి చేయొచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించాను. ఈ వంటలలో మట్టిపై ఐరన్ గ్రిడ్స్ వేస్తారు. దాంతో పాటూ పాయింట్లు, క్రాసింగ్‌లు మార్చడానికి టి.28 మెషీన్లను వాడేవాళ్లం. సాధారణ క్రేన్లను ఉపయోగించే ఆ పని పూర్తి చేశాను. దీనివల్ల 80-90 శాతం ఖర్చు తగ్గింది. సమయమూ ఆదా అయ్యింది. రైల్వే సేవా పురస్కారాన్ని అందుకోవడానికి ఇవే కారణాలు అని అనూష, ఈ రెండు అమలైతే రైల్వేకు రూ.వందల కోట్లు ఆదా అవుతుంది. ఇవే కాదు, బ్రహ్మపుత్ర నదిపై వంతెన,



రాజమహేంద్రవరం యార్డు రీమోడలింగ్, రెండు గూడ్స్ రైళ్ల ఒకేసారి ట్రాక్ మీద ఉండే విధంగా బిక్కవోలులో లాంగర్లూ నిర్మించారు. ఇందుకు రెండుసార్లు జీఎం అవార్డునూ అందుకున్నారు. ప్రస్తుతం గుంటూరు రైల్వే డివిజన్‌కి సీనియర్ డివిజనల్ ఇంజినీరు(కోఆర్డినేషన్)గా పనిచేస్తున్నారు. దేశంలో ఈ బాధ్యత చేపడుతున్న తొలి మహిళ కూడా అనూషనే. అయితే ఇవన్నీ సాదించడానికి కారణం తన వృత్తి ప్రారంభంలో పడిన బలమైన పునాదులేనంటారు. ఈమె సొంతూరు పిఠాపురం, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. నా మొదటి పోస్టింగ్ అసోంలో, అక్కడి పరిస్థితులు అంత సానుకూలంగా ఉండవు. కమ్యూనికేషన్ సరిగ్గా ఉండేది కాదు.క్షేత్రస్థాయిలో పనిచేసే వాళ్లలో ఒక తెగకు చెందిన వారే ఎక్కువ. ఆడపిల్ల మాకు చెప్పడం ఏంటి అన్నట్లు చూసేవారు. వీటన్నింటిని అధిగమించ డానికి చాలా సమయమే పట్టింది. కొన్ని సార్లు ఒత్తిడిగానూ అని పించేది. కానీ దీని ప్రభావం విధులపై పడకుండా జాగ్రత్త పడ్డాను. ఆరేళ్లు అక్కడే పనిచేశా. పనిపట్ల నిబద్ధత, నాయకత్వ లక్షణాలు, వినూత్న ఆలోచనలూ అన్నీ అసోం అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలే. తర్వాత విజయవాడలో పని చేశా. ఇప్పుడు గుంటూరు, నాకు ఇద్దరు పిల్లలు, మావారు జవ్వాది వెంకట నాగ సుబ్రహ్మణ్యం, ఐఏఎస్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు డెప్యూటేషన్‌పై ఢిల్లీ వెళ్లారు.వృత్తిరీత్యా ఇద్దరం పిల్లలకు అందుబాటులో లేమనే బాధ వెంటాడుతూ ఉంటుంది. కానీ వాళ్లు నా పరిస్థితిని అర్థం చేసుకున్నారు. నేను సివిల్ ఇంజినీరింగ్‌లోకి రావడానికి నాన్నే కారణం. అయితే దీన్లో రాణించడానికి అమ్మ అందిం చిన సాయం మరచిపోలేనిది. నా పిల్లల్ని చూసుకోవడానికి ఆమె తన లా ప్రాక్టీసుని వదులు కున్నారు. సహకారంతోనే ముందుకెళ్తున్నా' అంటారు అనూష. □

# మగువ సౌకర్యమే ఫ్యాషన్!



ఫ్యాషన్ ఫ్యాషన్

ఫ్యాషన్.. మహిళలు.. అలాగే చూడటం కష్టం కదూ! అన్నట్టు ఈ మనం మనసుపడ్డ ఫ్యాషన్ దుస్తులేవో తెలుసా కాపాస్ సమ్మర్ బెస్ట్ సెల్లర్ ఇదేనంటూ ప్రముఖ ఫ్యాషన్ మేగజీన్ వోగ్ ప్రకటించింది కూడా పొడమైన వదులు చేతులు... కింది నుంచి పైదాకా లూజుగా ఉంటుంది ఆస్థానంలో నిలిచిందబ్బా అన్న సందేహమొచ్చిందా? ఇంట్లో ఉన్నా.. పనులు చేసుకుంటున్నా ఎక్కువ అందంగా కనిపించే దుస్తులేని కక్కుమని నైటీ అన్న సమామెడిగింది పింగ్ పార్టీ ఏదైనా ముగించుకుని ఇంటికి రాగానే వైట్ వేసుకుంటే కానీ ఊడిరి ఇడినట్లు ఉండదు. చాలామందికి. ఇక పదులు అందుకే నిద్రించడానికి ఎంత అనుకలు దూ నైటీలోనే అని అడిగినా మహిళల ఓటు మాత్రం వాటికీ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా వాటిల్లో దర్శనమిచ్చేస్తుంటారు. ఇప్పుడు కాస్తాన్ని నైటీసీ పోల్చండి ఇది శరీరాన్ని చుట్టేసినట్టు ఉండదు. పైగా పనులు మన నైటీ తరహా ప్రయోజనాలే ఇక మనసు దోచకుండా ఉంటుందా? ఏదైనా అత్యవసరమనుకోండి. ఉన్నపళంగా జుట్టు రబ్బర్‌బ్యాండ్‌లో తగిలించుకుని చక్కగా ఆ దుస్తుల్లో వెళ్లిపోవచ్చు కాబట్టి ఈ పశ్చిమాసియా దుస్తులు మనల్ని అంతగా అనించాయి, వైరటీలన్నా వంటి కొద్ది రోజుల్లోనే దొరుకుతాయి. కాపాస్ అయితే కేసు, వెల్వెట్, కార్గెట్... కోరుకున్న కాస్ వస్త్రరకంలో ఎంచుకోవచ్చు. వేడుకలకీ దానిలో సిద్ధమైపోవచ్చు. అందుకే కాఫీ లంటూ చిన్నరకాల్లో విందులూ తీసుకొచ్చారు. ఆహ్లాదకరమైన, స్టైల్‌లు ఆకర్షించే డిజైన్‌లు ఇన్ని కలగలిశాయి కాబట్టి ఈ ఏడాది గ్లోబల్ మార్కెట్‌ని ఏలేసింది..









# స్త్రీ శక్తితో ఏక్తా కుమారి





యువజన దళం... జాతీయ సేన... ఎన్సీసీ పేరేదైనా... విద్యార్థి దశనుంచే దేశభక్తినీ, ధైర్యసాహసాల్నీ ప్రదర్శించే అర్హత, బాధ్యత వీరికే సొంతం. త్రివిధ ప్రదర్శనకు దీటుగా మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం చేసే అధికారమూ వీళ్లకే ఉంటుంది. ఇందుకు గడ్డకట్టే చలిలో ఆరునెలల ముందునుంచీ శిక్షణ తీసుకుంటారు. ఈసారి ఈ క్యాంప్‌కు 2316మంది హాజరుకాగా అందులో 917 మంది బాలికలే. ఈ మహిళా శక్తిని నడిపించే బాధ్యతను ఏక్తా కుమారి అందుకున్నారు. ఈమెది జమ్మూలోని అఖ్నూర్. తండ్రి రిటైర్డ్ సైనికుడు, ఏక్తా ఆయన్నుంచే దేశభక్తిని పుణికిపుచ్చుకుంది. గాంధీనగర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. జమ్మూకశ్మీర్ నేవల్ యూనిట్‌లో ప్రధాన క్యాడెట్ ఈమె. 'కర్తవ్యపథ్లో ఆల్ ఇండియా గర్ల్స్ కంటింజెంటు కమాండర్‌గా వ్యవహరించడం గర్వంగా ఉంది. ఇది నాకు కాదు, మా నాన్నకు దక్కిన విజయం, సమయపాలన, క్రమశిక్షణతో నాకిచ్చిన బాధ్యతలను నిర్వర్తిస్తా అంటున్నారు □

# టి.బి. లింఫాడినైటిస్

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది శరీరంలో మెడ, చంకలు, గజ్జల్లో ఉండే లింఫ్ గ్రంథుల వాపు. ఇది ఎక్స్‌ట్రా పల్మోనరీ టి.బి వల్ల 15-20% కేసుల్లో వస్తుంది. పిల్లల్లో 8% మందిలో వస్తుంది. ఇది మైకోబ్యాక్టీరియం బ్యాకీరియాతో కలుషితమైన గాలిని పీల్చడం వల్ల వస్తుంది. ఇది ఇన్స్‌మేషన్ టైప్‌ని పోలి ఉండడం వల్ల లింఫాడినైటిస్ అంటారు. ఇది లింఫాడ్ అనే గ్రీక్ పదం నుండి వచ్చింది. ఎడిమాస్ (గ్లాండ్), పెటిరియా (డిస్ఈజ్) అనే పదాల నుండి రావడంతో దీన్ని ఎడినోపతీ అని అంటారు. ఇది నాన్ స్పెసిఫిక్‌గా 43% మందిలో వస్తుంది. లింఫ్‌గ్రంథులతో పాటు లింఫాటిక్ వెసల్స్‌లో కూడా వాపు రావడం వల్ల దీన్ని లింఫా జైటిస్ అని అంటారు. 18వ శతాబ్దంలో యూరోప్‌లో కింగ్స్ ఈవిల్, తరచుగా వచ్చే రుగ్మతగా పిలిచేవారు. ఈ వ్యాధిని నయం చేయడానికి ఏకైక మార్గం రాజకుటుంబానికి చెందిన సభ్యునిచే తాకడం అని భావించేవారు. (రాజు యొక్క చెడు) ఎందుకంటే లింఫ్‌గ్రంథుల్లో చెడురక్తం గడ్డకట్టడం వల్ల సంభవిస్తుందని, వంశపారంపర్యంగాను, తల్లిదండ్రుల్లో చికిత్స చేయని వెనిరియల్ ఇన్ఫెక్షన్స్ (సుఖవ్యాధులు) వల్ల సంభవిస్తాయని నమ్మేవారు. దీన్నే స్క్రోఫులా అని కూడా అంటారు. ఇది లాటిన్ పదం బ్రూడ్‌సౌ నుండి వచ్చింది. ఇన్ఫెక్షన్ తర్వాత ఒక సంవత్సరం తర్వాత వస్తే దీన్ని పోస్ట్ ప్రైమరీ ఇన్ఫెక్షన్ అని అంటారు. దీన్నే పెరిఫెరల్ టి.బి. లింఫాడినైటిస్ లేదా ఎపిథిలాయిడ్ గ్రాన్యులోమా అని అంటారు. ఇది పిల్లల్లో యుక్త వయస్కుల్లో 11-30 సంవత్సరాల మధ్య వారిలో ఎక్కువ. ఇది పురుషుల కన్నా స్త్రీలలోనే ఎక్కువ ఇది అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువ. ఇది లాటెంట్ ఇన్ఫెక్షన్ రీ ఆక్టివేషన్ వల్ల వస్తుందని చెప్పవచ్చు.



**కారణాలు :** కారణాల్ని బట్టి టి.బి. లింఫాడినైటిస్ 3 రకాలుగా విభజించవచ్చు.

**అక్యూట్ రకం :** ఇన్ఫెక్షన్స్ : ఇబివి, సిఎమ్‌వి,, స్టెఫ్లోస్టఫలో కాకస్, హెచ్ఐవి, టాక్సో ప్లాస్మోసిస్ ఇన్ఫెక్షన్స్ ముఖ్యమైనవి. నోటికుహరం నుండి వచ్చే లాడ్‌విగ్ ఎంజైనా, గాయాలవల్ల వచ్చే హెమటోమా, సూడో అన్యూరిజమ్ (ఎ.వి.పిస్టులా మొదలైనరవి అక్యూట్ ఇన్ఫెక్షన్స్‌కి చెందినవి.

**సబ్‌అక్యూట్ :** కేన్సర్స్ (హెచ్‌పవివి వల్కల వచ్చే కేన్సర్స్, స్వామస్‌సెల్ కార్సినోమా, లింఫోమా, పరోటిడ్ ట్యూమర్స్, న్యూరోబ్లాస్టోమా) సిస్టమిక్ డిసీజెస్ (అమెలాయిడోసిస్, సార్కయిడోసిస్, సోర్జెన్స్ సింద్రోమ్) మొదలైనవి.

**క్రానిక్ :** థైరాయిడ్ నోడ్యుల్స్, గాయిటర్స్, గ్రేవ్స్ డిసీజ్, అయోడిన్ లోపం, థైరా యిడ్ కౌన్సర్స్, లిథియం వాడకం హాషిమొటో థైరాయిడైటిస్, టాక్సిన్ మల్టీ నోడ్యులార్ డిసీజ్ ముఖ్యమైనవి. ఇవే గాకుండా పుట్టుకతో ఏర్పడి సిస్టులు (బ్రాయియల్ క్లెఫ్ట్ సిస్ట్, థైరోగ్లోసల్ డక్ట్‌సిస్ట్) కారోటిడ్ బాడీ ట్యూమర్స్, లారింగోసీల్, లైపోమా, లైపోసార్కోమా ముఖ్యమైన వ్యాధులు ఇవేగాకుండా పాశ్చరైజ్ చేయని పాలు త్రాగిన, అంటువ్యాధులు, చిన్న జలుబు నుండి ఆటో ఇమ్యూన్ వ్యాధులు, స్టోరేజ్ వ్యాధులు, టైఫాయిడ్, లిష్ మానియాసిస్, సిస్టోసోమియాసిస్ ఫైలేరియా, కొన్ని రకాల కీటకాలు కటుట్టడం, ఇమ్యూనై. జేషన్ వల్ల కూడా లింఫ్‌నాడ్స్ వాపులు వచ్చే అవకాశముంది. ఇవి రోగి వయస్సు, లింఫ్‌నోడ్ స్థానం, సంఖ్యని బట్టి రెండు రకాలుగా ఉంటుంది. □

# మొటిమలు కనిపించకుండా..



ముఖం మీద మొటిమలను దాచడానికి మేకప్ వేసుకునేటప్పుడు కొన్ని మెలకువలు పాటించాలి. లేదంటే మొటిమలు మరింత స్పష్టంగా కనిపించే ప్రమాదం ఉంది. మొటిమలను దాచే మేకప్ మెలకువలు ఇవే!

**మాయిశ్చరైజర్:** మేకప్ చర్మం మీద సమంగా అంటుకోవాలంటే, మొదట ముఖాన్ని శుభ్రంగా కడిగి, మాయిశ్చరైజర్ పూసుకోవాలి. జిడ్డు చర్మం కలిగిన వాళ్లు మాయిశ్చరైజర్ వాడకూడదు.

**ప్రైమర్:** మేక్‌పకు ముందు అనుసరించవలసిన చిట్కా ఇది. మేకప్ ఉత్పత్తులు చర్మంలోకి ఇంకిపోకుండా ప్రైమర్ తోడ్పడుతుంది. హెచ్చుతగ్గులు లేకుండా మేకప్ చర్మం మీద పరుచుకోవడానికి వీలుగా, ప్రైమర్ చర్మాన్ని సిద్ధం చేస్తుంది.

**కరెక్టర్:** మొటిమలను కరెక్టర్‌తో కనిపించకుండా చేయవచ్చు. ఇందుకోసం ఎర్రగా ఉండే మొటిమల మీద ఆకుపచ్చని కరెక్టర్ అద్ది, పైన కన్‌సీలర్ అద్దుకోవాలి. ఇలా చేయడంవల్ల మొటిమ ఎరుపు రంగు తగ్గి, చర్మంలో కలిసిపోతుంది. మొటిమ ఎరుపు రంగులో లేకపోతే, నేరుగా కన్‌సీలర్‌నే అద్దవచ్చు. కన్‌సీలర్‌ను మొటిమ మీద అద్దాలే తప్ప, రుద్దకూడదు.

**లిక్విడ్ ఫౌండేషన్:** బ్రష్ లేదా మేకప్ స్పాంజ్‌తో ముఖం మీద ఫౌండేషన్‌ను వేసుకోవాలి. అంటే ముఖం మీద ఫౌండేషన్ చుక్కలుగా అద్ది, బ్రష్ లేదా స్పాంజ్‌తో ముఖాన్ని అద్దినట్టు చేస్తూ, ముఖమంతా పరుచుకునేలా చేయాలి.

**మేపక్ సెట్టింగ్:** ఫౌండేషన్ పూసుకున్న తర్వాత కొన్ని నిమిషాలు ఆగాలి. ఆ తర్వాత ప్రెస్‌డ్ లేదా లూజ్ పౌడర్‌ను అద్దుకోవాలి. తర్వాత ఫినిషింగ్ స్ప్రే కూడా వాడుకోవచ్చు.

**మచ్చలను దాచాలంటే... :** ఫేస్ ప్రైమర్‌తో మేకప్ మొదలు పెట్టాలి. తర్వాత ప్రైమర్, కన్‌సీలర్, అంతిమంగా ఫౌండేషన్, లూజ్ పౌడర్ వాడాలి. మచ్చలు నల్లగా లేదా ఎర్రగా ఉంటే, కలర్ కరెక్టర్‌ను వాడుకోవచ్చు. □

# నాగోబా జాతర



నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైంది. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చు కోమనగా గౌరి సంప్రదా యాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుం పూర్ నుంచి గరిమెల వరకు అతనికోసం వెతికిన గౌరి గోదావరిలోనే సత్యవసి గుండంలో కలిసిపోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్ళి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (పేథికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లి పోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ప్రతిఏటా పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్కా, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.మెస్రం వంశీయులు తొలినాళ్ళలో నాగోబా దేవత వెలిసిన పుణ్యస్థలం (పుట్ట)ను మాత్రమే పూజించేవారు. 1956లో గడ్డి పరకలతో చిన్న గుడిసెను, 1995లో సిమెంట్, ఇటుకలతో చిన్న మంది రాన్ని నిర్మించి పూజలు చేశారు. 2000 సంవత్సరంలో ప్రభుత్వ సహకారంతో గుడిని నిర్మించారు. 2022లో శిలలతో నూతన దేవాలయాన్ని నిర్మించారు □

ఆధ్యాత్మికం

# ఎగ్‌ప్లాంట్ పిజ్జా



**కావలసిన పదార్థాలు**

ఎగ్‌ప్లాంట్ (పెద్ద వంకాయ): ఒకటి, టమాట: ఒకటి, పిజ్జా సాస్: అర కప్పు, తురిమిన చీజ్: అర కప్పు, పార్సిమెన్: పావు కప్పు, ఆలివ్స్: పావు కప్పు, ఆలివ్ ఆయిల్: అర కప్పు, కొత్తిమీర తురుము: కొద్దిగా.

**తయారీ విధానం:** ఎగ్‌ప్లాంట్‌ను కాస్త మందంగా గుండ్రటి ముక్కల్లా కోయాలి. కోసిన ముక్కల్ని ఒక ప్లేట్‌పై పరిచి పైనుంచి ఆలివ్ ఆయిల్ వేసి పదిహేను నిమిషాల పాటు 180 డిగ్రీల వద్ద ఒవెన్‌లో బేక్ చేయాలి. బేక్ అయిన ముక్కలపై పిజ్జా సాస్, చీజ్ తురుము, పార్సిమెన్ వేసి పైనుంచి ముక్కలు చేసిన ఆలివ్స్, సన్నగా, గుండ్రంగా కోసిన టమాట ముక్కలు పెట్టి మరో పదినిమిషాలు బేక్ చేయాలి. చివరగా పైనుంచి కొత్తిమీర చల్లుకుంటే వేడివేడిగా నోరూరించే ఎగ్‌ప్లాంట్ పిజ్జా సిద్ధం. □

వార్త

ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు ఆశావాది, ప్రతి అవకాశంలోనూ కష్టాన్నే చూస్తాడు నిరాశావాది.

-షేక్స్పియర్

# లెక్కలు తేల్చేస్తాయి

నీతి ఆయోగ్ నివేదికల్లో తెలుగు రాష్ట్రాల్లో కాస్తంత వెనుకబడి ఉన్నట్లు ర్యాంకుల్లో తేలిపోయింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నివేదికలలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు స్థాయిలో ఉండగా తెలంగాణ కాస్త బెటర్. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఎపి డెబిట్ సస్టెన్‌బిలిటీలో జీరో స్థాయిలోఉంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలోనూ వెనుకబడి ఉన్నట్లు పాలకులు, పాలితుల మధ్య చర్చ నడుస్తోంది. గత పాలన లోటుపాట్లు ఎత్తి చెప్పడంలోనూ ఆర్థిక వెనుకబాటుతనం, ఆర్థిక ఖాతాల నిర్వహణ, అభివృద్ధిలో లోటుపాట్లను దిద్దడానికి నీతిఆయోగ్, కాగ్, ఫిస్కల్ ఇండెక్స్‌లు ఎత్తి చూపుతుంటాయి. తాజాగా నీతి ఆయోగ్ నివేదికలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానానికి, తెలంగాణ 8వ స్థానంలోనూ ఉన్నాయి. 2022–23లో రాష్ట్రంలో ఆర్థిక వనరులు బాగా దెబ్బతిన్నాయని ఈ అంకెలు చెబుతున్నాయి. అసలు మూలధనవ్యయమేదీ కనపడడం లేదు. అంటే విద్య, వైద్యం వంటి సామాజిక అంశాలలోనూ మూలధన వ్యయమేదీ లేదు. ఐతే 2023లో అప్పులు మాత్రం 62 వేల కోట్లు. ఇదే సందర్భంలో స్టేట్ ఫిస్కల్ హెల్త్ ఇండెక్స్ నివేదికపై కూడా చర్చ జరుగుతోంది. రాష్ట్రాభివృద్ధి పేరిట 16.5 శాతం రుణాలు పెరగగా 9.8 శాతం ఆదాయం తగ్గింది. వడ్డీ మొత్తాలు 15 శాతం మేరకు పెరిగాయి. ఎక్కువ వడ్డీకి అప్పులు తీసుకురావడం, మూలధనవ్యయం అసలే లేకపోవడం, పన్నుల పెంపు వంటి కారణాల వల్లనే ఆంధ్రప్రదేశ్ అప్పుల సూచికలో కూరుకుపోయిందనే ఆరోపణలున్నాయి. నీతిఆయోగ్ నివేదికలో ఈ అంశాలపై వ్యాఖ్యానాలు రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి గత పాలన తప్పిదాలను ప్రత్యేకించి ఏకరువు పెట్టారు. నిజానికి ఈ నివేదికలు తాజా ప్రభుత్వాలకు పాలనా మార్గదర్శకత్వం చేస్తాయి. ఇలాంటి సమీక్షలతో పాలనా క్రమంలో చేయదగినవి, చేయకూడనివి, చేయాల్సి నవ్వి దృష్టిలో ఉంచుకునేందుకు సూచికలుగా పని చేస్తాయి. 2014–19లో తెలుగుదేశం ప్రభుత్వ పాలన చేయగా, 2019–2024 వరకు రాష్ట్రంలో వైసిపి పాలనలో ఉంది. మళ్లీ తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పాలనా పగ్గాలు చేపట్టడంతో ముందుగతిని నిర్దేశించే అవసర మొచ్చింది. తాజాగా గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన 7 శ్వేత పత్రాల్లో ఉన్న అంశాలనే నీతి ఆయోగ్ ధృవీకరించినట్లయింది. దీని నేపథ్యంలోనే భవిష్యత్ ఆలోచనలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై పడింది. దేశవ్యాప్తంగా 18 పెద్ద రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను సైతం నీతిఆయోగ్ నివేదిక విశ్లేషించింది. 2023–23 నాటికి ఉన్న ఆర్థిక పరిస్థితులను క్రోడీకరించి, కొన్ని ఆర్థిక ప్రమాణాలను ఐదు కీలకాంశాల ఆధారంగా ఈ ఆర్థిక సూచి 2025లో ర్యాంకులు కూడా కేటాయించింది. 5 ప్రధాన సూచికలు 9 మైనర్ సబ్ ఇండికేటర్‌లు ఆధారంగా నీతి ఆయోగ్ సర్వే చేసింది. వీటిలో ఉత్పాదక వ్యయం రెవెన్యూ లోటు, వడ్డీ చెల్లింపులు ప్రస్తుత రుణాలు, రుణ సామర్థ్యం, జిఎస్టీ వృద్ధి తదితర అంశాలను ప్రామాణికంగా ఈ నివేదిక రూపొందించారు. ఆర్థిక ఆరోగ్యసూచీ- 2025లో ఒడిశా 67.8 స్కొలర్‌తో మొదటి స్థానంలో కంటే ప్రప్రథమ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 20.9 స్థానంతో అట్టడుగున ఉంది. గతంలో వెనుకబాటు తనంలో బీహార్‌ను ఒక సంకేతంగా భావిస్తారు. తాజా పరిస్థితులను బట్టి ఆంధ్రప్రదేశ్ దాని తర్వాతనే ఉండడం ఆలోచించదగిన విషయం. ఒక దాని తోనొకటి పోటీపడుతూ అభివృద్ధి చెందాల్సిన తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సూచీలు పెద్దగా ఆశించినట్లు లేవు. నీతి ఆయోగ్ 2022–23 ఆర్థిక ఆరోగ్య డేటా పరిశీలిస్తే ఆర్థిక సంవత్సరంలో పలు పారామీటర్‌ల ప్రకారం 17వ స్థానంలో నిలిచిందంటే బాగా వెనకబడినట్లే. ఆ ఏడాది ఆర్థిక ఆరోగ్యంలో ఒడిశా అద్భుతంగా ఉండగా, తర్వాత స్థానంలో ఛత్తీస్‌గఢ్ ఉంది. ఆంధ్రప్రదేశ్ కంటే పంజాబ్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాల ఆర్థిక, ఆరోగ్య స్థితి బావుందని నివేదికలో నీతి ఆయోగ్ పొందుపరిచింది. నీతి ఆయోగ్ నివేదికను 16వ ఆర్థికసంఘం చైర్మన్ అరవింద్ పనగడియా విడుదలచేసి పలుసూచనలు కూడా చేసారు. వాటి ఆధారంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు తమ ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. 2014–19లో పోల్చి చూసినప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించి మూల ధనవ్యయం 60శాతం నుంచి గత పాలనలో 15 శాతానికి తగ్గిపోయింది. అభివృద్ధికి నిధులు కేటాయించలేనప్పుడు జరిగే అభివృద్ధి శూన్యమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పుడు ప్రజలమీద పన్నులు వేయడంతప్ప గత్యంతరం ఉండదు. నిన్న మొన్నటి ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి వాటిని పూర్తిగా అమలులోకి తేకుండానే రాష్ట్ర ఆర్థికపరిస్థితిపై సిఎం చంద్రబాబు నాయుడు పెదవి విరవడంతో విపక్షాలు, 'సూపర్ సిక్స్ అట్టర్‌ఫ్లాప్' అని ఎద్దేవా చేసే పరిస్థితి తలెత్తింది. ఆర్థిక పరిస్థితి ఎలాఉన్నా ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి అభివృద్ధి ప్రణాళికలకు రూపుదిద్దడంతో మరింత అభివృద్ధికి పునాదులు పడుతున్నాయని జనం ఆశపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో గత ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగిన తప్పులేమీ జరగలేదంటూ తాజా అప్పుల మోతపై ఆనాటి ప్రభుత్వ అనుయాయులు విమర్శలు గుప్పిస్తూ సమర్థించుకుంటున్నారు. ఇలాంటి బేరీజులు, దిశానిర్దేశం చేసే విషయంలో నీతిఆయోగ్,కాగ్ నివేదికలు మార్గదర్శకమే అవుతాయి. ఆసరాగా చేసుకుని పాలకులు దిశా నిర్దేశం చేసుకోగలిగితే ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిలో మూడు పువ్వులు – ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది.

సమస్య చిన్నదైనా, పెద్దదైనా సకాలంలో చర్య తీసుకుంటే ఎందులోనూ అపజయం అనేది ఉండదు.



సి.సి.కాల్టన్

వాడని ఇనుము తుప్పు పడుతుంది. కదలని నీరు స్వచ్ఛతను కోల్పోతుంది. బద్ధకం మెదడును నిస్తేజం చేస్తుంది.



డావిన్సి

# ప్రజావాక్కు



## పథకాల దుర్వినియోగం సరికాదు

ఒక పథకం పది సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అంటే చాలా గొప్పవిషయం. ఏదేశమైనా ఆర్థికాభివృద్ధి సాధించడానికి పరిపూర్ణ ఆరోగ్యం సమకూర్చుకోవడం ముఖ్యం. అయితే 2014ముందు 39శాతం ఉన్న స్వచ్ఛత 2014 తరవాత ప్రజా భాగస్వామ్యం పౌరుల బాధ్యతాయుత వైఖరి మూలంగానే ఇవ్వాళ 93 శాతం మంది మహిళలు డిగ్నిటీ ఆఫ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. నేడు భారత దేశంలో ఈ పది సంవత్సరాలలో 11.5 కోట్ల సౌచాలయాలు నిర్మాణం చేసి ఇవ్వాళ ఓడీఫ్ నుండి ఓడీఫ్ ప్లేస్ వరకుప్రయాణంసాగుతోంది. ఈ ప్రయాణంలో సుస్థిరాభివృద్ధిలక్ష్యాలలో మూడో లక్ష్యమైన అందరికి ఆరోగ్యం, ఐదవ లక్ష్యం అయిన జెండర్ సమానత్వంను సాధించే వైపుగా ప్రయాణం చేస్తున్నది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో ఆరోవ లక్ష్యంలో శుభ్రత కూడా చేకూరుతుంది అయితే దీనివల్లభారతఆర్థికవ్యవస్థకు 6శాతంవృద్ధి చేకూరుతుంది.

-భారత అవినాష్, జనగామ

## వలంటీర్ల పరిస్థితి ఏమిటి?

రాష్ట్రంలో గత వై.సీ.పీహయాంలో వలంటీర్ వ్యవస్థ మొదలైంది. సంక్షేమ పథకాలవిషయంలో లబ్ధిదారులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ వ్యవస్థను ప్రారంభించారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు నెలకు 5 వేల రూపాయలు మాత్రమేఇచ్చి బండచాకిరీ చేయించుకుంది.డిగ్రీలు, పీజీలు, బీటెక్ చేసిన యువత ప్రభుత్వ సర్వీస్ అవుతుందనే ఆశతో తక్కువ వేతనానికేపనిచేసారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు న్యాయం చేసేలా ప్రస్తుత ప్రభుత్వం మానవతా దృక్పథంతో తగిన చర్యలు తీసుకోవాలి.

- ఆర్. కృష్ణ , గోపంపల్లి

## ఉపాధ్యాయుల కొరత

తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు ఒక్కవ్యాయామ ఉపాధ్యాయుడు కూడా లేడు. గంటల తరపున ఉపాధ్యాయులను వలంటీర్లుగా నియమించుకుని అరకొర జీతాలతో నెట్టుకుస్తుంది ప్రభుత్వం. ఉపాధ్యాయుల కొరత వలన విద్యార్థులలో క్రమశిక్షణ లోపిస్తుంది. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ఇకనైనా ఉపాధ్యాయులను నియమించాలి.

-గూరుడు ప్రశాంత్, గోధుర్, జగిత్యాల జిల్లా

## తీగల కింద చెట్లు నాటొద్దు

పచ్చదనం కోసంరోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం చేస్తుంటారు. రోడ్ల వెంబడి విద్యుత్తు లైను నడపబడి ఉన్నా అవేవీ పట్టించుకోకుండా మొక్కలునాటేస్తున్నారు.అవి పెరిగి పెద్దయ్యాక విద్యుత్ తీగలకు అడ్డు వస్తుండడంతో వాటి కొమ్మలు కొట్టి వేసి మోడుగా మిగిలిస్తున్నారు. మొక్కలను నాటి వాటికి నీరుపోసి,జంతువులనుండి కాపాడేందుకు ఫెన్సింగ్‌వేసి వాటిని చెట్లుగా మార్చడం చాలా వ్యయ ప్రయాసతో కూడిన పని. ఇంత చేశాక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మొక్కలను ఎదగనీయకుండా కొమ్మలునరకడం తరచుగా చూస్తున్నాం. తద్వారా ప్రయాణికులకు నీడ,మంచిగాలి దూరమవుతున్నాయి. విద్యుత్తు తీగలకింద మొక్కలు నాటకుండా చూడాలి. విద్యుత్ తీగలు లేని వైపు మాత్రమే మొక్కలను నాటాలి.

-డి. వెంకటరెడ్డి, నెల్లూరుజిల్లా

## శబ్దకాలుష్యాన్ని నివారించాలి

శబ్ద కాలుష్యం ఆరోగ్యాన్ని, ప్రవర్తనను రెండింటినీ ప్రభావితం చేస్తుంది. అవాంఛిత ధ్వని(మోత)శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది.శబ్దకాలుష్యానికి అనేక ఆరోగ్యపరిస్థితులకూ సంబంధం ఉంది. వీటిలో హృదయ సంబంధ రుగ్మతలు,రక్తపోటు, అధిక ఒత్తిడి స్థాయిలు, టిన్నిటస్, వినికిడి లోపం, నిద్రలేమి, ఇతర హానికారక, కలతపెట్టే ప్రభావాలు ఉన్నాయి. 55 డెసిబెల్స్ కు పైబడి ఉండే మోతలు మానవ ఆరోగ్యానికి హానికరం.

-సింగు. లక్ష్మీనారాయణ, భూపాలపల్లి

## ఉపాధి కల్పనే పెద్ద సవాల్

యువతకు ఉద్యోగ,ఉపాధిఅవకాశాలు కల్పించడమే దేశం ఎదుర్కునే అతి పెద్దసవాల్ అనిఇటీవలి రాయిటర్స్ సంస్థ అధ్యయనం తెలియజేస్తోంది.గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం పెరగకపోవడం, ఆరు శాతం మంది పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నాలుగు శాతంమంది పేదరికాన్ని ప్రధాన సమస్యలుగా సదరు అధ్యయనం పేర్కొంది.2023 అక్టోబర్‌నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 2024 ఏళ్ల మధ్య యువతలో నిరుద్యోగం 44.49 శాతానికి పెరిగిందని,, మార్చి 2021 నాటికి దేశ వ్యాప్తంగా 9.79 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం నివేదిక తెలియజేస్తోంది.ఇందులో ఒక్కరైల్వేలోనే 2.93 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ఇవికాక,వివిధ రాష్ట్రాల్లో భర్తీ చేయాల్సిన ప్రభుత్వఉద్యోగాలూ లక్షల సంఖ్యలోనే ఉన్నాయి.

-సి.హెచ్.ప్రతాప్. కోటి వీధి, శ్రీకాకుళం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమలుకు నోచుకోని చట్టాలెందుకు?

**చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయ పరిస్థితి. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపై ఆధారపడి ఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలు కాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయో జనం ఉండదు. పాలకులకు చిత్తశుద్ధి ఉండే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తు లను,అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒక పరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణ సాధ్యంకానీ అమలు చేయలేని చట్టాలు చేస్తే పాలకులు నవ్వులపాలౌతారు.**

దామెర్ల సాయిబాబా

మానవజాతిని పట్టిపీడిస్తున్న మద్యపానం, ధూమపానాలను పారద్రోలే విషయంలో ఆరాటమే కానీ, త్రికరణ శుద్ధిగా పోరాటం చేయడంలేదనే చెప్పాలి. ఈ రెండు వ్యసనాలతో మాదకద్రవ్యాలు తోడు కావడంతో దేశంలో కోట్లాది కుటుంబాలు చితికిపోతున్నాయని, లక్షలాది మంది మంచానికే పరిమితమై కృంగికృశించి మరణిస్తున్నారనే విషయం పాలకులకు తెలియంది కాదు. చట్టాలు చేస్తున్నారు. ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ త్రికరణశుద్ధిగా వీటిని నియంత్రించేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. కొందరిని కొంతకాలం మోసం చేయవచ్చు. అందరిని కొంత కాలం మోసం చేయవచ్చు. అందరిని ఎల్లకాలం మోసం చేద్దామనుకుంటే అది భ్రమే అవుతుంది. అలా ప్రజలను మోసం చేసిన వారు, వేధించిన వారు ఎందరో చక్రవర్తులు, రాజులు, మరెందరో నేతలు చరిత్రహీనులుగా కాలగర్భంలో కలిసిపోయారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ప్రజా అవసరాలను గుర్తించి ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చి ఆదరాభిమానాలు పొంది వారి హృదయాల్లో చోటు సంపాదించుకున్నవారు చిరస్థాయిగా మిగిలిపోతారు. మాదకద్రవ్యాల విషయంలో అటు కేంద్ర,రాష్ట్ర పాలకులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా, ఎంత మంది అధికారులను నియమిస్తున్నా నిందితులను పట్టుకొని జైళ్లల్లో పెడుతున్నా అది ఏమాత్రం ఆగడం లేదు. అంతకంతకు పెరుగుతున్నది. యేటా దేశ వ్యాప్తంగా వేలాది కోట్ల రూపాయల మత్తుపదార్థాలు పట్టుబడుతూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏమాత్రం తక్కువ లేదు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, గౌరప్రదమైన ఉద్యోగాలు చేస్తున్న కొందర సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఈ మత్తుకు అలవాటు పడడమే కాదు అందులో కొందరు ఆ వ్యాపారంలో భాగస్వాములవుతున్నారు.తాజాగా బెంగుళూరులో ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ శని, ఆదివారాల్లో అక్కడ నుండి హైదరా బాద్‌కు మత్తు మందులు తెచ్చి అమ్ముకుంటున్న విషయం నిన్న సోమవారం బయటపడింది. ఆయనే కాదు ఎందరో యువకులు ఈ మత్తు వ్యాపారంలో మునిగితేలుతున్నారు.మద్యం విషయంలో పాలకులు పైకి ఏమి చెప్తున్నా ఆదాయం కోసం ప్రోత్సహిస్తున్నారనేది కాదనలేని వాస్తవం. గతంలో దశలవారీగా తగ్గిస్తామని చెప్పుకున్న పెద్దలే అంచెలంచెలుగా పెంచుతున్నారు. ఒకనాడు కేవలం వందకోట్ల ఆదాయంతో ప్రారంభమైన మద్యం వ్యాపారం నేడు రెండు రాష్ట్రాల్లో కలిసి యాభై, అరవైవేల కోట్లకుపైగా చేరుకుంటున్నది. ఈ యేడాది తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం వస్తున్న ఇరవైఐదు వేల కోట్లకు అదనంగా ఐదువేల కోట్ల రూపాయలకుపైగా ఆదాయాన్ని పెంచుకోనున్నట్లు మొన్నటి బడ్జెట్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలకు మద్యం ఆదాయమే మహాప్రసాదంగా పరిణమించింది. ఇక మద్యం సరే. సారాను నిషేధించారు. కానీ ఏ మాత్రం అమలవుతున్నది? మంచినీరు దొరకని గ్రామాలు ఎన్నో ఉండొచ్చు.కానీ సారా దొరకని గ్రామం లేదు. గుడుంబ, నాటుసారా ఒక కుటీర పరిశ్రమగా రూపుదిద్దుకున్నది. ఈ అక్రమ సారాను నియంత్రించేందుకు పాలకులే చీప్ లిక్కర్‌ను ప్రవేశపెట్టారు. ప్రజారోగ్యానికి అత్యంత హానిచేస్తున్నది ఈ చీప్‌లిక్కరే. ముఖ్యంగా పేదల జీవితాలు ఈ చీప్‌లిక్కర్‌తో చితికిపోతున్నాయి. లక్షలాది కుటుంబాలు వీధినపడుతున్నాయి. మద్య నిషేధం గురించి ఒకసారి గతంలోకి వెళ్లితే మద్యానికి బానిసై అనారోగ్యంపాలై కుటుంబాలకు కుటుంబాలే బజారున పడుతుండడంతో ఆనాడే ఆవేదన చెందిన మహాత్ముడు స్వతంత్ర భారతావని నుంచి మద్యాన్ని తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కలలకు అనుగుణంగానే

ఒక్క మాట

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1947 అక్టోబరు ఒకటో తేదీ నుంచి అప్పటి మద్రాసు ప్రభుత్వం మద్యాన్ని నిషేధించింది. అందులోభాగంగానే ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మద్యనిషేధాన్ని విజయవంతంగా అమలుచేశారు. మద్యపానం వల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించడంలో, మరొక పక్క అక్రమ మద్యాన్ని తయారుచేసే వారిపై ఉక్కు పాదం మోపడంలో ఆనాటి పాలకులు ఎంతో సమర్థవంతంగా వ్యవహరించారు.1960 ప్రాంతంలో రాజకీయ జోక్యం పెరగడంతో మద్యనిషేధం అమలు చేయడం కష్టతరంగా మారింది. సారా తయారీదారులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో నిషేధానికి తూట్లు పొడవడం ప్రారంభించారు. మద్యనిషేధంవల్ల రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయం కోల్పోతుందనే వాదనను లేవనెత్తి దశలవారీగా మద్యం వ్యాపారాన్ని విస్తరించారు. మధ్యలో ఒకటి, రెండు సందర్భాల్లో సంపూర్ణ మద్యనిషేధానికి శ్రీకారం చుట్టినా అది ఎక్కువ రోజులు నిలవలేదు. మద్యపానాన్ని ఆదాయం దృష్ట్యా నియంత్రించ లేకపోతున్నారనేది అందరికి తెలిసిందే. ధూమపానాన్ని నియంత్రించే విషయంలో కూడా పాలకులు విఫలమవుతున్నారేమోననిపిస్తున్నది. ఊపిరితిత్తుల కేన్సర్, గుండె జబ్బులు, మరెన్నో రోగాలకు ధూమపానం కేంద్ర బిందు వని ఎందరో వైద్యనిపుణుల అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 130కోట్ల మందికిపైగా ధూమపానంలో మునిగితేలుతున్నారు. భారత దేశానికి సంబంధించి ఇరవై కోట్ల మందికిపైగా పొగాకు ఉత్పత్తులకు అలవాటు పద్దారు. ఇందులో బీడీలు తాగేవారే అధికంగా ఉన్నారు. బీడీలు, సిగరెట్లు తాగడం సరదాగా ఆరంభమై ఆతర్వాత అలవాటుగా మారుతున్నది. కేవలం ధూమపానం వల్లనే దేశ వ్యాప్తంగా కోట్లాదిమంది అనేక రోగాలబారిన పడుతుంటే లక్షలాది మంది అసువులు బాస్తున్నారు. సిగరెట్ పొగలో నాలుగువేల ఎనిమిది వందలకు పైగా ప్రమాదకర విష వాయువులు ఉన్నాయని, ఇవి అనేక రోగాలకు కారణాలవుతున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. బీడీ పరిశ్రమ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కోట్లాది మందికి బతుకుతెరువు ఇస్తున్నదనేది కాదనలేని వాస్తవం. అడవుల్లో ఉన్న లక్షలాది మంది గిరిజన కుటుంబాలకు బీడీ ఆకుల సేకరణ ప్రధాన ఆదాయ వనరుల్లో ఒకటి. కొన్ని శతాబ్దాలుగా అదొక కుటీర పరిశ్రమగా వర్ధిల్లుతున్నది. ఈ వాస్తవాలను పట్టించుకోకుండా బీడీ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నం చేయడం వివేకం అనిపించుకోదు. కానీ పాలకపెద్దలు ఈవిషయాన్ని దృష్టిలోఉంచుకోకుండా పొగాకు ఉత్పత్తులను నిషేధించేందుకు ప్రయత్నాలకు దాదాపు మూడు దశాబ్దాలక్రితంనుంచే శ్రీకారంచుట్టారు. దీంతో బీడి కార్మికులు, కాంట్రాక్టర్లు, అందరూ ఏకమై ఎదురుతిరగడం, ఒత్తిడిలు తోడుకావడంతో విరమించుకోవాల్సి వచ్చింది. మళ్లీ బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని నిషేధించారు.పొగాకు పండించే రైతులను ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కిందచర్యలు చేపడుతున్నట్లు ప్రకటిస్తున్నారు. మరోకపక్క పొగాకు ఎగుమతులు పెరుగుతున్నట్టు కేంద్రం చెప్పుకుంటున్నది. గతయేడాది దాదాపు పన్నెండు వేల కోట్ల రూపాయలకు పైగా పొగాకు ద్వారా ఆదాయం వచ్చినట్లు చెప్పుకుంటున్నారు. కామన్‌వెల్త్ దేశాలన్నింటిలో నూ భారత్‌లోనే పొగాకు ఉత్పత్తి అధికంగా అవుతున్నది. అలాగే కేన్సర్ వ్యాధికి మూలకారణాల్లో పొగాకు ఒకటి. నోటి, ఊపిరితిత్తులు రకరకాల కేన్సర్లు భారత్‌లో ఆందోళనకర స్థాయిలో విస్తరిస్తున్నట్లు అధ్యయనాలే వెల్లడిస్తున్నాయి. యేటా దాదాపు ఇండియాలో పద్నాలుగున్నర లక్షల మందికిపైగా పొగాకుతో ప్రాణాలు కోల్పోతున్నట్టు అధికారలెక్కలే వెల్లడిస్తున్నాయి. ఈయేడాది అది పదిహేడు లక్షల దెబ్బైవేలకు చేరవచ్చునని అంచనాలు వెలువడుతున్నాయి. పొగాకు పదమూడేళ్ల ప్రాయం నుండే ప్రారంభించి ఇరవైయేళ్లు వచ్చేసరికి దానికి బానిసలుగా మారిపోతున్నారు. చట్టం అయితే చేశారు కానీ దాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు, యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అంతా అయోమయం, గందరగోళం. ఇంకొకపక్క దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పొగాకు ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. లక్షలాది మంది రైతులు మరెందరో కూలీలు పొగాకు సాగుపైఆధారపడిఉన్నారు. ఈ కుటుంబాలు వీధిపాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.ముందుగా వారికి ప్రత్యామ్నాయం చూపించాలి. అవేమీ పట్టించుకోకుండా కాగితాలపై చట్టాలు చేసి చేతులు దులుపుకుంటే ప్రయోజనం ఉండదు. ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న ఈ ధూమపానానికి కచ్చితంగా ఫుల్‌స్టాప్ పెట్టించాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు.అలాగే జీవనోపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం చూపి పొగాకు ఉత్పత్తులను,అమ్మకాలను, వినియోగాన్ని భూటాన్ దేశంలో లాగా పూర్తిగా నిషేధించాలి. అప్పుడే దీనికి ఒకపరిష్కారం లభిస్తుంది. అంతేకానీ ఆచరణసాధ్యం కాని అమలుచేయలేని చట్టాలుచేస్తే పాలకులు నవ్వులపాలౌతారు. ఈ మారణహోమం కొనసాగుతూనే ఉంటుంది. ●

# నిరుద్యోగుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?


ఎం. చిరంజీవి

ఉద్యోగులకు పదవి విరమణ వయసు పెంచడం పట్ల నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు ఇస్తానని చెప్పి గత ప్రభుత్వం మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ చెప్పినటువంటి మాటలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి పట్టం కడితే, పెద్ద ప్రభుత్వ ఇచ్చినటువంటి ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి మేమే ఇచ్చామని చెప్పుకుంటున్నటువంటి విషయాన్ని గమనిస్తున్న నిరుద్యోగులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైనా కూడా ఏ డిపార్ట్మెంట్లో ఎన్ని వేకెన్సీలు ఉన్నాయనే అటువంటి విషయాన్ని కూడా ఇప్పటివరకు బహిరంగపరచలేదనేటువంటి విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం తెలపడం లేదని, ఎటువంటి నోటిఫికేషన్లు వేయడం లేదనేటువంటి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగం వస్తే తప్ప మా బతుకులు బాగుపడవని గమనించినటువంటి యువత ఉద్యోగం కోసం కొన్ని ఏళ్లనుండి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. కానీ వారి ఆశ నెరవేరడం లేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నోటిఫికేషన్లు జారీచేసి, ఎక్కువ మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 63 సంవత్సరాలకు పెంచడం రాష్ట్ర ప్రభుత్వానికి శ్రేయస్కరం కాదు. దీనివల్ల ప్రభుత్వానికితీరని నష్టం వాటిల్లే ప్రమాదం వుంది. ఉద్యోగ విరమణ వయసును పెంచడమంటే లక్షల మంది నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టినట్టడమే. ప్రభుత్వానికి ఎంత ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ఎన్ని డిమాండ్లు వచ్చినప్పటికీ ఈ ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని నిరుద్యోగ యువత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది. గత ప్రభుత్వం చేసిన తప్పును ప్రస్తుత ప్రభుత్వం చేస్తుందని అంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో నిరుద్యోగులే కీలకపాత్ర పోషించారు. జాబ్ క్యాలెండర్‌కోసం వారు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్ల చల్లకుండా వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరుతున్నారు. నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో ఇప్పటికే ఎంతో మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు చేసుకుంటున్నారని, ఇప్పటికైనా ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువరించకపోతే రాష్ట్రంలోని నిరుద్యోగులు ఏకమై మరొక ఉద్యమానికి సిద్ధపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 5వ వేతన సవరణ సంఘం,58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచాలని సిఫార్సుచేసింది. కానీ, గరిష్ట వయస్సు 60ఏళ్లకు మించరాదని,వయస్సుకు మించిన సర్వీసు పొడిగింపులపై పూర్తిగా నిషేధం విధించాలని పేర్కొంది. అంతేకాదు 7వ పీఆర్సీ సైతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచాలని ఎలాంటి సిఫార్సులు చేయలేదు. అయితే, ఏపీ,తెలంగాణ వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచిన విషయం తెలిసిందే. దీనివల్ల నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారనే విమర్శలు ఉన్నాయి. రిటైర్మెంట్ వయసు పెంచడంతో ఉద్యోగాలసంఖ్యతగ్గిపోయి, కొత్త నోటిఫికేషన్ల రావడం ఆలస్యం అవుతుంది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసు 58 ఏళ్లగా ఉండేది. కానీ, కేంద్రంతోపాటు పలు రాష్ట్రాలు 60 ఏళ్లకు, ఏపీ, తెలంగాణలోనూ 62ఏళ్లకు పెంచారు. దీనిపై తీవ్రవిమర్శలు కూడా వస్తున్నాయి. నిరుద్యోగులకు అన్యాయం చేయడమేమిటని మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు డిఎలు,టిఎలు, పిఆర్సి వంటివి ఇవ్వనవసరం లేకుండా వయస్సు పెంచడం ద్వారా వీటన్నింటి ద్వారా లబ్ధిపొందవచ్చని ప్రభుత్వం యోచిస్తుంది. ●

# ఆర్థిక అవసరాలే ఆసరాగా అవయవమార్పిడి!

మహమ్మద్ ఆరిఫ్

హైదరాబాద్ లోని సరూర్ నగర్‌లో గల ఒక ఆస్పత్రిలో ఇటీవల 'కిడ్నీరాకెట్' వెలుగు చూడడం రాష్ట్రంలో కలకలం రేపింది. ఇంకెన్ని ఆస్పత్రుల్లో ఇలాంటి దందా నడుస్తున్నదనే అనుమానం వ్యక్తమవుతున్నది. అనుమతి లేకుండా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన ఆస్పత్రిపై కఠినంగానే వ్యవహరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆస్పత్రిని సీజ్ చేసింది. కిడ్నీ మార్పిడి చేసుకున్న ఇద్దరు, కిడ్నీ దానం చేసిన ఇద్దరిని గాంధీకి తరలించి వైద్యం చేయిస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతోనే తమిళనాడు, కర్ణాటకకు చెందిన ఇద్దరు వితంతువులు కిడ్నీ ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతున్నది. మరోవైపు అవసరమైతే వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా తొలగిస్తామని మెడికల్ కౌన్సిల్ ప్రకటనచేసింది. అనేకసార్లు ఇలా అవయవమార్పిడి ఘటనలు బయటపడుతున్నా.. ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అయితే ఈ దందాలో పేదలే సమిధలు అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో డబ్బుల ఆశకు కిడ్నీలు ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. అయితే పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని ముఠాలు ఈ దందాను కొనసాగిస్తున్నాయి. అంతేకాకుండా కిడ్నీ తీసుకున్నాక.. వారిని మోసం చేస్తున్నాయి. డబ్బులు చెల్లించకపోవడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే అనేక అవయవ మార్పిడి ఘటనలు వెలుగుచూశాయి.ఇంకా వెలుగులోకి రానిఘటనలు వేలల్లోనే ఉంటాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ ఇలా ప్రతి రాష్ట్రంలో ఇలాంటి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. అనేకసార్లు ముఠాలు పట్టుబడుతున్నాయి. అంతేకాకుండా కిడ్నీ మార్పిళ్ల కోసం పలువురిని విదేశాలకు పంపిన ఘటనలు సైతం వెలుగుచూశాయి. అవయవాలు అవసరమున్న వారు,దానం చేయాలనుకునే వారు ముందుగా జీవన్ దాన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడ అవసరమైనవారు ఎక్కువ, దాతలు తక్కువగా ఉంటున్నారు. అవయవాలకు డిమాండ్ పెరగడంతో డబ్బుల చూపి అక్రమ మార్గంలో వాటిని పొందేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో కొందరు ముఠాలుగా ఏర్పడి పేదల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకొని వారికి డబ్బుల ఆశచూపి అవయవదానానికి ఒప్పిస్తున్నారు. అయితే కిడ్నీ వ్యాధిగ్రస్తుడు కుటుంబ సభ్యులు, లేదా సమీప బంధువుల నుంచి కిడ్నీని పొందొచ్చు. అయితే



ముఠాలు ఎలాంటి బంధుత్వం లేకున్నా వారిని బంధువులుగా చూపించేలా ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారు చేసి కిడ్నీ మార్పిడీ సర్జరీలు చేయిస్తున్నాయి. గతంలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స కోసం నకిలీ పత్రాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తుండగా విజయవాడలోని భవానీపురం తహశీల్దార్ గుర్తించి ఆ దరఖాస్తును తిరస్కరించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫేక్ డాక్యుమెంట్స్‌తో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ లో కిడ్నీ మార్పిడి సర్జరీలు చేయిస్తున్న ముఠాను గతంలో ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అవయవ మార్పిడిల్లో కిడ్నీ సర్జరీలే ఎక్కువగా ఉండడం గమనార్హం. సోషల్ మీడియా ద్వారానూ కొన్ని ముఠాలు అక్రమ అవయవ వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్‌సైట్‌ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను కొందరు రూపొందించినట్లు 2023లో అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్‌బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్‌ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్‌చేశారు. అవయవ మార్పిడి కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఎదురుచూస్తున్నారు. ఇందులో కిడ్నీ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న వారే సుమారు పది లక్షల వరకు ఉంటారని అంచనా. అయితే ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. దేశంలో వివిధ ప్రమాదాల్లో రెండు లక్షల నుంచి మూడు లక్షల మంది వరకు మరణిస్తున్నారు.అయితే అవయవదానంపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల్లో మరణించినవారు, బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు ముందుకు రావడంలేదు. దీంతో వారి శరీరంలోని అవయవాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ ఇచ్చిన వారు, అమర్చుకున్న వారు, సర్జరీ చేసిన వైద్యుడు, అవకాశమిచ్చిన ఆస్పత్రి, మధ్యవర్తులు ఇలా ప్రతి ఒక్కరూ నేరం చేసినట్టేనని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే విచారణ, నేర నిరూపణలో అధికారులు, పోలీసులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. అందుకే మధ్యవర్తుల ముఠాలు పెరిగిపోతున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వాలు పట్టుబడిన ఆస్పత్రులను సీజ్ చేసి తమ పని అయిపోయినట్టుగా భావించకుండా మధ్యవర్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటేనే ఈ దందాకు అడ్డుకట్ట పడే అవకాశముంటుంది. అంతేకాకుండా ఆయా సర్జరీలు చేసిన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేయడమే కాకుండా నిరంతరంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపడితే ఇలాంటి సర్జరీలు జరగకుండా నిరోధించవచ్చు. ●

# సెక్రటేరియట్‌లో విజిటర్లపై ఇక నిరంతర నిఘా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** తెలంగాణ సెక్రటేరియట్‌లో భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్‌పిఎఫ్) ఆధ్వర్యంలో సెక్రటేరియట్ భద్రత మరింత పెంచనున్నారు. భద్రత 24 గంటల పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. 300 సిసి కెమెరాలతో సెక్రటేరియట్ బయట లోపల నిరంతర నిఘా ఉంచనున్నారు. విజిటర్లు సెక్రటేరియట్‌లోకి ఎంట్రీ అయినప్పటి నుంచి ఎగ్జిట్ అయ్యే వరకు వారి కదలికలను పోలీసులు రికార్డు చేయనున్నారు. ఇటీవలే సెక్రటేయట్‌లో నకిలీ ఐడీ కార్డుతో అధికారిగా చెలామణి అయిన వ్యక్తిని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. దీంతో సెక్రటేరియట్‌లో ప్రవేశించే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్పీఎఫ్ నిర్ణయించింది. సెక్రటేరియట్‌లో రికార్డు అయిన మొత్తం డేటాను 5 నెలల పాటు అందుబాటులో ఉంచేలా సర్వర్లను ఏర్పాటు చేశారు. సచివాయంలో ప్రతిరోజు సిఎం సహా మంత్రులు ఐఏఎస్ అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. వీరి భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# టెన్త్ స్పెషల్ క్లాసు విద్యార్థులకు స్నాక్స్

## నేటి నుంచే ప్రత్యేక క్లాసులు ప్రారంభం

### 38 రోజులపాటు కొనసాగింపు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌లో టెన్త్ క్లాసు విద్యార్థులకు నేటి(శనివారం) నుంచి స్పెషల్ క్లాసులు ప్రారంభం కానున్నాయి. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు పాఠశాల విద్య ప్రత్యేకంగా స్నాక్స్‌ను అందించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం గత కొన్ని సంవత్సరాలుగా స్పెషల్ క్లాసులను పాఠశాల విద్య నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా నేటి నుంచి ప్రారంభించనున్న స్పెషల్ క్లాసులు 38 రోజులపాటు కొనసాగ నున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 20 వరకు స్పెషల్ క్లాసులను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మోడల్ స్కూళ్లలో 10వ తరగతి చదువుతూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్‌ను అల్పాహారంగా అందించనుంది. 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేం దుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. దసరా తర్వాత చాలా చోట్ల మొదలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం తింటే.. ప్రత్యేక తరగతులు పూర్తయి ఇళ్లకు వెళ్లడానికి ఇతర గ్రామాల విద్యార్థులకు రాత్రి 7 గంటలవుతోంది. అప్పటి వరకు ఏమీ తినకపోవడంతో విద్యార్థులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. గతంలో కలెక్టర్ల నిర్ణయం మేరకు కొన్ని జిల్లాల్లో సాయంత్రం పూట స్నాక్స్ అందించేవారు. 2023లోనూ విద్యాశాఖనే సమగ్ర శిక్ష ద్వారా స్నాక్స్‌ను అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది మార్చి 21వ తేదీ నుంచి 10వ తరగతి వార్షిక పరీక్షలు మొదలవుతున్నందున.. నేటి(ఫిబ్రవరి 1) నుంచి మార్చి 20 వరకు పాఠశాలలు నడిచే 38 రోజులపాటు అల్పాహారం(స్నాక్స్) అందించనున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున మంజూరు చేశారు. రాష్ట్రంలో సుమారు 4,500 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 194 మోడల్ స్కూళ్లలో సుమారు 1.90 లక్షల మంది టెన్త్ చదివే విద్యార్థులున్నారు. వారికి 38 రోజులకు సుమారు రూ.11 కోట్ల బడ్జెట్ అవసరమని అధికారులు అంచనా వేశారు. స్పెషల్ క్లాసులకు హాజరయ్యే విద్యార్థులకు ఉడకబెట్టిన పెసర్లు, పల్లీలు బెల్లం, చిరుధాన్యాలతో చేసిన మిల్లెట్ బిస్కెట్లు, ఉడకబెట్టిన బొబ్బర్లు, ఉల్లిపాయ పకోడి, ఉడకబెట్టిన శనగలు.. రోజుకొక రకం ఇవ్వనున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల మహిళల ద్వారానే స్పెషల్ క్లాసు విద్యార్థులకు స్నాక్స్‌ను అందించనున్నారు.

# హైదరాబాద్‌లో గులియన్ బారే సిండ్రోమ్ కేసు నమోదు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** నగరంలో ఓ మహిళకు గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. సిద్దిపేట మండలానికి చెందిన మహిళకు జీబీఎస్ ఉన్నట్లు వైద్యులు నిర్ధరించారు. బాధితురాలు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వెంటిలేటర్స్‌పై చికిత్స పొందుతోంది. ఇప్పటికే మహారాష్ట్రలో వంద వరకు ఈ కేసులు నమోదైన విషయం తెలిసిందే. గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలో గులియన్ బారే సిండ్రోమ్ కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ కారణంగా బలహీన రోగనిరోధక శక్తి కలిగిఉన్న వ్యక్తులు ఈ జీబీఎస్ బారినపడే అవకాశాలు ఉంటాయని వైద్యులు వెల్లడించారు. శరీరానికి సోకిన ఇన్ఫెక్షన్‌కు ప్రతిస్పందించే రోగ నిరోధక వ్యవస్థ పొరపాటున నరాలపై దాడి చేసే అరుదైన పరిస్థితి ఇది. ఆ రుగ్మత బారినపడిన వారికి ఒళ్లంతా తిమ్మిరిగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తికడుపు నొప్పి, జ్వరం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీటి ద్వారా ఆ బ్యాక్టీరియా సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, ప్రజలు భయాందోళనకు గురికావొద్దని, జీబీఎస్ అంటువ్యాధి కాదని, చికిత్సతో నయం చేయొచ్చని వైద్యులు వెల్లడించారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

## వాక్‌థాన్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31, ప్రభాతవార్త:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అవుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. రోడ్డు బద్రత అవగాహనా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వాక్‌థాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరివెంకట్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి వికాసన రాజ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్యే దానం నాగేందర్, డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి రవాణా శాఖ కమీషనర్ సురేంద్రమోహన్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్లు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను రక్షించాలని సూచించారు. రోజువారి రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిని ఒక్కరినైనా కాపాడితే మన జీవితంలో మనకి తృప్తిని ఇచ్చేదిగా భావిస్తామన్నారు. 25సంవత్సరాలుగా రాజకీయంగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నా మన్నారు. ఇది రవాణాశాఖ ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీ రోడ్డు బద్రతా వారోత్సవాలు నుంచి ప్రాధాన్యతను పెంచి రోడ్డు బద్రతా మాసోత్సవాలు చేసారన్నారు.

జనవరి 1న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెల్మెట్ ధరించి ప్రారంభించిన ఈ కార్యక్రమం దాదాపు 15 లక్షల మంది విద్యార్థులకు, ప్రజలను భాగస్వామ్యం చేసి 33 జిల్లాల్లో అనేక కార్యక్రమాలు చేసిన రవాణాశాఖ అధికారులకు అభినందనలు తెలియ జేసారు. రాష్ట్రంలో ఎక్కడైతే బ్లాక్ స్పాట్స్ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి తొలగించి అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చేస్తుందన్నారు. అవగాహన కల్పించిన తరువాత కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే ట్రాఫిక్ పోలీసు సహకారంతో కఠిన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి స్కూలులో ట్రాఫిక్ అవేర్ నెస్ పార్కు ఏర్పాటు చేస్తాం అన్నారు. అందరూ వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు. రవాణాశాఖ కమీషనర్ సురేంద్ర మోహన్ మాట్లాడుతూ 2025 జనవరి నెలలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు గతంలో ఎన్నడూ లేని విధంగా 33 జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నాం న్నారు. పండుగ లాగా రోడ్డు సేఫ్టీ అవేర్నెస్ మంత్ జరిగిందన్నారు. దాదాపు 10లక్షల మంది భాగస్వామ్యం అయ్యారన్నారు. 2024సంవత్సరంలో దేశంలో 5లక్షల 70వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయ న్నారు. లక్షా 60వేల మంది మరణించా రన్నారు. తెలంగాణాలో 26వేల రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. 5600మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి సేఫ్ డ్రైవర్స్ కార్యక్రమాన్ని కూడా చేసింది.

# 40 బిసి కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలి

## కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలి

## ప్రభుత్వానికి రాష్ట్ర బిసి కమిషన్ సిఫారసు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని 40 బీసీ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ కమిషన్ కోరింది. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ కమిషన్ ప్రతిపాదించింది. తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు శుక్రవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మీ సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, మెంబర్ సెక్రటరీ బాలమాయాదేవి పాల్గొన్నారు. బీసీ కమిషన్ తెలంగాణ రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల్లో పర్యటించింది. పర్యటన సందర్భంగా వచ్చిన విజ్ఞప్తుల మేరకు.. కొన్ని కులాల పేర్ల మార్పుకి అభ్యంతరాలను స్వీకరించారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అన్ని అంశాలను మంత్రితో చర్చించారు. వివిధ విజ్ఞప్తులను వాటి పర్యవసానాలను మంత్రితో కూలంకషంగా చర్చించినట్టు తెలిపారు. సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో లేని 40 బీసీ కులాలను .. సెంట్రల్ ఓబీసీ లిస్ట్‌లో చేర్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మరోసారి ప్రతిపాదన పంపాలని నిర్ణయించినట్టు తెలిపారు. బీసీల అభ్యున్నతికి కీలక అంశాలతో ముందుకు పోవాలని నిర్ణయించడం జరిగింది.

# పద్మభూషణ్‌ను తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నా

## తనకు జరిగిన సన్మానంలో నందమూరి బాలకృష్ణ

## స్వర్గీయ నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలి




పద్మభూషణ్ అవార్డు వరించిన సంస్థ ఛైర్మన్ నందమూరి బాలకృష్ణను ఘనంగా సత్కరించిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రి సిబ్బంది, యాజమాన్యం

**హైదరాబాద్ (పంజగుట్ట), జనవరి 31, ప్రభాతవార్త:** కేన్సర్ రోగులకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటైన ధరలలో అందించాలనే లక్ష్యంతో మొదటి నుంచి పనిచేస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ వారు నొప్పిలేని సర్జరీలకు దోహదపడే నాలుగో జనరేషన్ డావిన్సి రోబోటిక్ సర్జికల్ వ్యవస్థను అందుబాటులోనికి తీసుకొచ్చారు. దాదాపు రూ. 10 కోట్లకుపైగా ఖరీదైన ఈ సర్జికల్ వ్యవస్థ ద్వారా శస్త్రచికిత్సలు అవసరమైన రోగులకు నొప్పిలేని రీతిలో అత్యంత త్వరగా కోలు కోవడానికి వీలు కలుగుతుంది. ఈ ఆధునిక వ్యవస్థను శుక్రవారం ఉదయం హాస్పిటల్ ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ, వసుంధరదేవి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఇటీవలే భారత ప్రభుత్వం ద్వారా పద్మభూషణ్ అవార్డును గెలుచుకున్న నందమూరి బాలకృష్ణను బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది తరఫున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వసుంధరదేవి, బాలకృష్ణ దంపతులను సిబ్బంది, వైద్యులు శాలువాలు కప్పి, పుష్పమాలలతో సత్కరించి రాధాకృష్ణుల విగ్రహాలను అందజేశారు.

అంతకుముందు కార్య క్రమంలో నందమూరి బాలకృష్ణ నటజీవితంపై హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఫణికోటేశ్వరరావు మార్గదర్శకత్వంలో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. నందమూరి బాలకృష్ణకు అభినందనలు తెలియజేస్తూ మానవసేవే మాధవసేవగా ఎందరికో సహాయం అందిస్తున్నారని ప్రశంసించారు. అనంతరం కార్యక్రమంలో జెయస్ ఆర్ ప్రసాద్, ట్రస్టు బోర్డు సభ్యులు మాట్లాడుతూ బాలకృష్ణ సినిమా, రాజకీయ రంగాలలో చేసిన పనికి ఎంతగానో గుర్తింపు, ప్రచారం కనిపిస్తోందని కానీ హాస్పిటల్ తో పాటూ ఇతరత్రా చేసే సేవా కార్యక్రమాలు అందరికీ తెలియవని అంటూ ఎందరో క్యాన్సర్ రోగులకు అండగా నిలిచిన ఘనత బాలకృష్ణదని అన్నారు. పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ తనకు అవార్డు ఆలస్యంగా వచ్చిందని కొందరంటున్నారని కానీ అది సరికాదని అన్నారు. తన తండ్రి శత జయంతి జరుపుకొంటున్నవేళ, స్వర్గీయ యన్‌టిఆర్ నటజీవితానికి డెబ్బయి అయిదు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంలో అత్యున్నత పురస్కారం పద్మభూషణ్ అందు కొంటున్నానని, ఇది సరైన సమయమని అన్నారు. అయితే తన తండ్రికి భారతరత్న అందకపోవడం కొంత అసంతృప్తికరమైన అంశమని, త్వరలోనే దీనిని సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నాన్నగారి ఆశీర్వాదంతో పద్మభూషణ్ నన్ను వరించిందన్నారు. నాకొచ్చిన అవార్డు మనందరికీ వచ్చినట్లేనని బాలకృష్ణ పేర్కొన్నారు. తాను ప్రారంభించిన అత్యాధునిక డావిన్సి రొబోటిక్ వ్యవస్థను రోగులకు అందుబాటులోకి తీసుకొని రావడం సంతోషంగా ఉందని మా అమ్మగారి ఆశయాలకు అనుగుణంగా పేదప్రజలకు అందుబాటైన ధరలలో అత్యాధునిక కేన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంలో భాగంగానే అత్యంత ఖరీదైన ఈ వ్యవస్థను హాస్పిటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు.

# దేశవ్యాప్తంగా వెలుగుచూస్తున్న కవిత లిక్కర్ దందా

## నీచ రాజకీయాల గురించి కవిత మాట్లాడడం విడ్డూరం!

## భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ జాగృతి నాయకురాలు ఎమ్మెల్సీ కవిత లిక్కర్ దందా దేశవ్యాప్తంగా ఎక్కడెక్కడ ఉన్నాయో రోజు వెలుగులోకి వస్తున్నాయని భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. న్యూఢిల్లీలో ఆయన విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ నీచమైన రాజకీయాలు ఎవరు చేస్తున్నారో యావత్ తెలంగాణ ప్రజలకు తెలుసు అని అన్నారు. మీ ఫ్యామిలీ డైవర్షన్ పాలిటిక్స్ అందరికీ తెలిసిపోయిందని, నీ లిక్కర్ సామ్రాజ్య కేసులు రోజుకోటి బయట పడుతున్నాయి ఇప్పటివరకు ఢిల్లీలోనే బయటపడిన నీ బాగోతం ఇప్పుడు కేరళలో కూడా నీ మూలాలు బయట పడుతున్నాయని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్ నుంచి డైవర్షన్ పాలిటిక్స్ లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. నీళ్ల విషయంలో మీ అయ్య చేసినంత అన్యాయం తెలంగాణకు ఇంకెవరూ చేయలేదని అన్నారు. కృష్ణాలో పోతిరెడ్డిపాడు పొక్క పెద్దది కావడానికి కారణమే మీ అయ్యానే అని ఆయన అన్నారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 40 వేల క్యూసెక్కుల నుంచి 90 వేల క్యూసెక్కుల పెరిగింది మీహయాంలోనే అని గుర్తుచేశారు. అంతేకాదు రోజుకు రెండు టీఎంసీలు తీసుకెళ్లడం కోసం జగన్ రాయలసీమ ఎత్తిపోతల పథకం స్టార్ట్ చేస్తే నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారని దుయ్యబట్టారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఏకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ నే వాయిదా వేసిన ఘనత మీ అయ్యది అని అన్నారు. రోజా ఇంటికి వెళ్లి చేపల పులుసు తిని రాయలసీమను రతనాలసీమ చేస్తానని చెప్పింది నీ అయ్యా కాదా అని ప్రశ్నించారు. ఇలా ఏ విధంగా చూసినా కృష్ణా నీటిలో దక్షి ణ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసింది మీ అయ్యనే ఇక గోదావరి విషయంలో ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది గోదారి మీద కట్టిన కాలేశ్వరం మూడేళ్లకే మునిగిపోయింది లక్ష కోట్లు పెట్టి ఖర్చు చేసి గోదావరి నీటి పాలు చేశారు. ఇలా నీళ్ల విషయంలో తీవ్రంగా అన్యాయం చేసింది మీ అయ్యా కేసీఆరే అని ఆమెకు చామల సమాధానం ఇచ్చారు.

# 3న ఎప్‌సెట్-2025 సమావేశం

## మధ్యాహ్నం ఐ సెట్ కమిటీ మీటింగ్

## ఆ తర్వాత సెట్స్ షెడ్యూల్ జారీకి అవకాశం

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, అగ్రిక్చలర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్)-2025 కమిటీ మొదటి సమావేశం ఈ నెల 3న(సోమవారం) నిర్వహించనున్నారు. ఎప్ సెట్-2025ను జేఎన్‌టీయూ నిర్వహిస్తున్నందున ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఎప్ సెట్ కమిటీ మొదటి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డితోపాటు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నారు. మొదటి సమావేశం అనంతరం ఎప్ సెట్-2025కి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎప్‌సెట్‌లో భాగంగా ఏప్రిల్ 29, 30న అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలను నిర్వహించనుండగా.. మే 2 నుంచి 5 వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహించడానికి ఇప్పటికే తేదిలను ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇక అదే రోజు జేఎన్‌టీయూ క్యాంపస్‌లోనే పీజీ ఈసెట్-2025 కమిటీ సమావేశం కూడా నిర్వహించనున్నారు.

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**

Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

**PUBLIC NOTICE**

ఫినకుర్వే ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 05.02.2025 న 10:00 గంటలకు Finkurve Financial Services Limited లో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం H. No. 2-2-66, 2nd Floor, Burmashell Road, Gandhi Chowk, Beside Harsha Hotel, Khammam, Telangana-507003. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

KHAMMAM ARVOG F : KHAM-14911.

For More Details, Contact : Kandula Vijaya Babu, Mob. 9440473167

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

# కెసిఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నాం..

## ఫామ్‌హౌస్‌లోనే ఉండి మాట్లాడతారా.. అసెంబ్లీకి వస్తారా?


## మాజీ సిఎం వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** 13 నెలల పాటు ఫామ్ హౌజ్‌కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నానని ఇప్పుడేదో అంటే సరిపోదు. ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో తిరగాలి. ప్రజా సమస్యలు ప్రస్తావించాలని రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు వచ్చినా.. వరదలు వచ్చినా కనీసం ప్రజలను పరామర్శించలేదు. ఫామ్ హౌస్ దాటలేదని పేర్కొన్నారు. సీఆర్ సంచలన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. అధికారంలో ఉన్ననాడు సచివాలయానికి రాలేదు. ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదు. ప్రజల్లోకి రాలేదు అని పేర్కొన్నారు. కేసీఆర్ జీవితమంతా ఫామ్ హౌసే. ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని కేసీఆర్ వ్యాఖ్యలు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించేలా ఉన్నాయన్నారు. ప్రజా తీర్పును అగౌరవ పరుస్తున్నారు. ప్రజలన్నా.. ప్రజాతీర్పు అన్నా కేసీఆర్‌కు ఏనాడూ గౌరవం లేదు. పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఈ రోజు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదన్నారు. ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదు. ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బీఆర్‌ఎస్ సభల్లో కూడా.. ఈరోజు మాదిరిగానే గంభీర ప్రకటనలే చేశారు. ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందే అని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ ముఖం చూడని వ్యక్తి తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొర మాదిరి మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఏదో నమ్మి ఓటేశారని అంటున్నావు. వాస్తవాలు గ్రహించి నీ గడీల పాలన వద్దనుకుని ప్రజలు నిన్ను నీ కుటుంబాన్ని ఛీత్కరించారని చెప్పారు. పథకాలు అమలు కాలేదని ఫామ్ హౌజ్ లో కూర్చొని మాట్లాడటం కాదు. ఇప్పటికైనా ప్రజల్లోకి రావాలనే మేమంటున్నాం. అసెంబ్లీ సమావేశాలకు రావాలని ముఖ్యమంత్రి పదే పదే ఆహ్వానించారని చెప్పారు. 80 వేల పుస్తకాలు చదివినారన్నారు. మీ అమూల్యమైన సూచనలు సలహాలు ఇవ్వాలని అసెంబ్లీకి రమ్మంటే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 2020 రెవెన్యూ చట్టం దేశానికే ఆదర్శమని ప్రకటించిన మీరు భూ భారతి చట్టం ప్రవేశ పెట్టిననాడైన అసెంబ్లీకి వస్తారని ఆశించామన్నారు. 'నీ ఫామ్ హౌజ్ కు కరెంటు కోతలెక్కడివి. లెక్కలు తీద్దామా. ఏ రోజు ఎంత కరెంటు సరఫరా అయింది. ఎంత సరఫరా అవుతుందని చెప్పలేదన్నారు. నీ ఫామ్ హౌజ్‌కు నీళ్లెక్కడివి. రైతు భరోసా ఇచ్చిందే మేము. రాష్ట్రంలో ఉచిత కరెంట్ తెచ్చిందే కాంగ్రెస్. చరిత్ర ప్రజలకు తెలియదా అని అన్నారు. నీవంటున్న గురుకులాలను సందర్శిద్దామా. మాతో వస్తారా. నీవెక్కడికంటే అక్కడికి రావడానికి మేము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అద్దె గదుల్లో పెట్టి విద్యార్థులను నానా ఇబ్బందులకు గురిచేసిన మీరా మాట్లాడేదని పేర్కొన్నారు. రైతుల రుణమాఫీ కోసం 20 వేల కోట్ల రూపాయలు ఇచ్చిన సంగతి కళ్లకు కనిపించడం లేదా. అభివృద్ధి మీద చర్చకు సిద్ధమా. ఏదైనా మాట్లాడితే దానికొక ప్రాతిపదిక ఉండాలని చెప్పారు. ముస్లింలను కాంగ్రెస్ వాడుకుంది అంటున్నావు. వాడుకుని వదిలేసే చరిత్ర నీదని వ్యాఖ్యానించారు.

# సిఎం రేవంత్‌తో ముఖాముఖి చర్చకు కెసిఆర్ సిద్ధమా?

## తులం బంగారానికి మహిళలు అమ్ముడుపోయినట్లు చిత్రీకరణ తగదు

## సమాజంపై బాధ్యత గల వారెవరూ ఫామ్‌హౌజ్ పాలన కోరరు: పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** కేసీఆర్ ది పట్టాలు తప్పిన పరిపాలన ఆ తప్పిన పట్టాలపై గాడీని ఎక్కించే పరిపాలన రేవంత్ రెడ్డి అని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పుజయప్రకాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేసీఆర్ మోసగాళ్లకు మోసగాడు మోసం చేయడంలో దిట్ట, మోసం ఎలా చేయాలో కేసీఆర్‌ని చూసి నేర్చుకోవాలి అని ఎకసెక్కాలు చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జీవితాలను కేసీఆర్ బజారు పాలు చేసిండుఅని దుయ్యబట్టారు. లక్షల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టి పోయారని ఆయన వివరించారు. తులం బంగారానికి ఆశపడి ఓటేసారని అమ్ముడుపోయారని కేసీఆర్ మహిళలను అవమానించారని ఆరోపించారు. తెలంగాణ మహిళలకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తులం బంగారనికి సిఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారు. కేసీఆర్ 10 ఏళ్లు సిఎం గా చేసి ఇంత దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారు. కేసీఆర్ తప్పులనీ మీరు చేశారు, మీరు చేసిన తప్పులను ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం సరిచేసుకుంటూ వస్తుంది అని ఆయన చెప్పారు. నువ్వు చేసిన అప్పుల వడ్డీ కట్టుకుంటూ, పథకాలు అమలు చేస్తూ, ప్రజా పాలనా చేస్తుంది రేవంత్ రెడ్డి సర్కార్ అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలను కేసీఆర్ మాయ మాటలు చెప్పి చీటింగ్ చేసిండని విమర్శించారు. పదేళ్ళలో కేసీఆర్ సిఎంగా చేసి ప్రజలకు జవాబుదారుగా లేడుఅని అన్నారు. బిఆర్ఎస్ బాధ్యత లేని పరిపాలన చేసింది. కేసీఆర్ నువ్వు కొట్టేది ఏందీ, మేము నిన్ను దట్టి కొడుతామని హెచ్చరించారు. కేసీఆర్ సిసనల్ పొలిటిషయాన్ ఐపోయ్యడు. కేసీఆర్ ఐదు లక్షల మందితో సభ పెడితే మేము ఐదులక్షల ఒకవెయ్యి మందితో పెడుతాము సిఎం రేవంత్ రెడ్డి ఏమి తక్కువ కాదని అన్నారు. రాహుల్ గాంధీ చెబితే నేను కూడా సభ పెట్టడానికి సిద్ధంకేసీఆర్ అని అన్నారు. నువ్వు ఐదు లక్షల మందితో నువ్వు సభ పెట్టి మొగొడివనిపించుకో మేము 5లక్షల ఒక వెయ్యి మందితో సభ పెట్టి మొనగాళ్ళకు మొనగాళ్ళమని అనిపించుకుంటామని అన్నారు. రేవంత్ రెడ్డి ఏడాది కాలం లో సెక్రటేరియట్ లో 200 సమీక్షలు చేసిండు ప్రజల మధ్య 100 సమావేశాలు నిర్వహించాడని ఆయన మీలా నాలుగు గోడలకు పరితం కాలేదని అన్నారు. కేసీఆర్ పదేళ్లలో ఎంత రుణమాఫీ చేసిండో దానికంటే ఎక్కువ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో 22వేల కోట్లురుణమాఫీ రైతులకు చేశాం. తెలంగాణ సిఎంతో ప్రతిపక్ష నేత కేసీఆర్‌ను ముఖాముఖీ కూర్చో పెడుతాము దీనికి సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. మీరు చేసిన ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులో రైతులకు మీరు ఇచ్చింది ఎంతా..? కేసీఆర్ నువ్వు చేసిన అప్పు కి ఈ రోజు వేల కోట్ల ఇంట్రెస్ట్ కడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు , నాయకులకు వచ్చే కోపనికి ఉఫ్ అని ఉదితే ఆ గాలికి కే కేసీఆర్ కొట్టుకుపోతారని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా అమెరికా నుండి నడుస్తుంది. బ్రాడ్ యూజర్స్ తో పామ్ హౌస్ పాలన కావాలని టాగ్ చేశారు. కేవలం పరిపాలన విధానం గురించి పోల్ చేసాము. ప్రజల వద్ద పరిపాలన ఉండాలా? పామ్ హౌస్ పాలన ఉండాలా? ఏ నాయకుడికి ఈ పోల్‌తో సంబంధం లేదుఅని ఆయన వివరించారు. సమాజం పట్ల బాధ్యత ఉన్నవారు ఎవరు ఫామ్‌హౌజ్ పాలన కావాలని కోరుకోరు అని ఆయన భాష్యం చెప్పారు.

**FINKURVE FINANCIAL SERVICES LIMITED**

Corporate Office : Trade World, D-Wing, 2nd Floor, 202/A, Kamala Mill Compound, Lower Parel (W), Mumbai, Maharashtra - 400013

**PUBLIC NOTICE**

ఫినకుర్వే ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం 05.02.2025 న 10:00 గంటలకు Finkurve Financial Services Limited లో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేయడం # # H.No 11-2-30,1st floor, Near Congress Bhavan, Wyra Road, Khammam-507001. వద్ద జరుగుతుంది అని ఇందుమూలంగా ప్రజలకు తెలియజేయుచున్నము. వివిధ ఖాతాదారులు తమ బకాయిలు చెల్లించడంలో. విఫలమైన కారణముగా వేలం జరుగుచున్నది. వేలం పాట నోటీసులు ఈ రుణగ్రహీతలకు కూడా జారీ చేయబడ్డాయి. గడువు తీరిన మరియు మార్జిన్ తక్కువ ఖాతల వివరాలు బ్రాంచ్ వారిగా క్రింద ఇవ్వబడినది.

SREE MAHEERA KHAMMAM : SSREE-20342, SREE-28152, SREE-66643, SREE-69061, SREE-47500, SREE-08542, SREE-99411, SREE-55590, SREE-76163, SREE-98332, SREE-39885, SREE-01662, SREE-17055, SREE-09934, SREE-07616, SREE-00736, SREE-51717, SREE-39488, SREE-12684.

For More Details, Please Contact : Kakkerla Sukumar : Mob. 9704858037

(Reserves the right to alter the number of accounts to be auctioned & / postpone / cancel the auction without any prior notice)

# పంచాయతీ ఎన్నికల కోసం నిద్ర లేచిన కెసిఆర్!



గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

### రేవంత్ కొట్టిన దెబ్బకు ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన మాజీ సిఎం: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** ఫామ్‌హౌజ్‌లో ఇన్నాళ్ళు కుంభకర్ణుడిలా పడుకున్న కెసిఆర్ పంచాయతీ ఎన్నికల కోసం లేచారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ మహేష్‌బాబు డైలాగ్ లాగ సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బకు కేసీఆర్ మైండ్‌బ్లాక్ అయి ఫామ్‌హౌస్‌కు పరిమితం అయ్యాడని అన్నారు. కాంగ్రెస్ స్కిల్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నడిపిస్తుంటే బీఆర్ఎస్ దుబాయ్ వేదికగా విద్వేషపు వాట్సప్ యూనివర్సిటీని నడిపిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు తిరస్క రించి ప్రతిపక్ష పాత్ర పోషించమని ప్రజలు అవకాశం ఇచ్చారు కానీ కేసీఆర్ ఇన్ని రోజులు కుంభకర్ణుని లాగ పామ్ హౌస్ లో పండుకుండు కేసీఆర్ పంచాయితీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే పామ్ హౌస్ నుండి బయటకు వస్తా అంటుండని ఆయన అన్నారు. కేసీఆర్ ను పదే పదే మాట్లాడించాలని కుటుంబంలో ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అన్ని బయట పెడతాం అని ప్రభుత్వ విప్ హెచ్చరించారు. కేసీఆర్ గంభీర స్వరంతో మాట్లాడుతున్న అంటుండు.. చేసిన పొరపాటుకు చింతిస్తూ ఫామ్‌హౌస్‌లో ఉన్నాడని ఆయన అన్నారు. కైలాసంలో పెద్ద పాములగా కమీషన్లు మింగి ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మిగిల్చి పామ్ హౌస్ లో పండుకుండు అని ఆయన అన్నారు. కేసీఆర్ బస వేశ్వర్, సంగమేశ్వర గురించి మాట్లాడుతుండు.. కాళేశ్వరం గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పదుమూడు నెలల్లో రైతుల కోసం 61 వేల కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని గాడిన పెడుతుందని అన్ని హామీలు వరుసగా అమలు చేసు కొంటూ పోతున్నారని తెలిపారు. పదేళ్ల ప్రజావ్యతిరేక పాలన చేస్తే ఇందిరమ్మ రాష్ట్రంలో ఒకోకటి అమలు చేసుకుంటూ వస్తున్నాం అని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలను అన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

## మార్కెట్లలో మద్దతు ధర అమలుపై ప్రత్యేక బృందాలు: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో రైతుల తీసుకువస్తున్న పంటల ఉత్పత్తులను మద్దతు ధరలకు కొనుగోలు చేయడంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు మార్కెటింగ్ డైరెక్టర్, ప్రాంతీయ, జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మార్కెటింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డులకు పంపించాలని చెప్పారు. రైతులు మార్కెట్లకు తీసుకువచ్చిన తమ పంటకు గరిష్ఠ ధర పొందేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా క్రయవిక్రయాలు జరిగే టట్లు ప్రతి అధికారి బాధ్యత తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలకు తగట్టు ఉన్న పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించాల్సిందే అని ఈ విషయములో ప్రత్యేక బృందాలు చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవడానికి సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

## తెలంగాణలో పెరిగిన తలసరి వ్యయం

### పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633

### కేంద్ర కుటుంబ వినియోగ వ్యయ సర్వే వెల్లడి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** తెలంగాణలో ఏడాది కాలంలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పెరిగిందని కేంద్రం వెల్లడించింది. పట్టణాల్లో తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, గ్రామీణంలో కేరళ తలసరి ఆదాయంలో (రూ.6,611) అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633లకు పెరిగిందని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర కుటుంబ వినియోగ వ్యయం సర్వే 2023-24ను శుక్రవారం విడుదల చేసింది. దీంతో తలసరి నెలవారీ ఖర్చు గ్రామాల్లో రూ.5,435కి, పట్టణాల్లో రూ.8,978కి చేరినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో వ్యయం చూసుకుంటే రూ.4,122 ఉండగా, పట్టణాల్లో రూ.6,199గా ఉంది. ఆదాయ వర్గాల వారీగా చూస్తే తెలంగాణలో గరిష్ఠంగా నెలకు రూ.12,619 ఖర్చు అవుతుంది. ఇక తెలంగణాలో విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో నెలకు తలసరి రూ.183, పట్టణాల్లో రూ.713.89 ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో చదువుల కోసం తెలంగాణలోనే అత్యధిక వ్యయం అవుతోందని నివేదిక తెలిపింది. అలాగే పట్టణాల్లో అద్దెకు 10 శాతం ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యం కోసం నెలకు రూ.376 ఖర్చు చేయగా, పట్టణాల్లో నెలకు రూ.426 చొప్పున వ్యయం అవుతుందని సర్వే పేర్కొంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే మాత్రం ఈ వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యయం తక్కువగా ఉంది.మద్యం, పాన్, పొగాకు తదితర ఉత్పత్తుల కోసం పట్టణాల్లో నెలకు రూ.320 ఖర్చు చేయగా, గ్రామాల్లో నెలకు రూ.396 ఖర్చు చేస్తున్నారు. ఆహార ఖర్చులో పానీయాలు, ప్రాసెస్ట్‌ఫుడ్ కోసం గ్రామాల్లో 20.84 శాతం, పట్టణాల్లో 33.63 శాతం ఖర్చు చేస్తున్నట్లు కేంద్ర సర్వే వెల్లడించింది.

## వర్షాధార వ్యవసాయంపై ముగిసిన సదస్సు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** వర్షాధార వ్యవసాయంపై అంతర్జాతీయ సమావేశం ముగిసింది. హైదరాబాద్‌లో శుక్రవారం నాడు స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలను నిర్మించడం అనే అంశంతో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎస్‌డిఎ అధ్యక్షుడు డాక్టర్ వికె సింగ్ మాట్లాడుతూ ఈసమావేశం వివిధ వర్గాల ప్రెజెంటేషన్ల కింద నిర్వహించబడిందని తెలియచేశారు. వర్షాధార వ్యవసాయం, స్థితిస్థాపకత, స్థిరమైన జీవనోపాధి కోసం మార్గాలు అనే అంశంపై చర్చ జరిగిందన్నారు. అంతేకాకుండా, వర్షాధార పంటల వ్యవస్థల కోసం పరిరక్షణ వ్యవసాయంపై సుదీర్ఘ చర్చ జరిపినట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు, వివిధ సంకేతికతల ప్రధాన అంశంగా ప్రస్తావనకు వచ్చినట్లు వివరించారు. ముఖ్యంగా నీటిసేకరణ, సేకరించిన నీటిని సమర్థవంతంగా ఉపయోగించడం, నేల నీటి సంరక్షణ కోసం సాంకేతికతలు. నేల ఆరోగ్య నిర్వహణ. వాతావరణాన్ని తట్టుకునే పంటలు, పద్ధతులు తదిత వాటిపై సిఫార్సులను సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీహార్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ వైఛాన్సలర్ డాక్టర్ ఎ.కె.సింగ్ తదితరులతో పాటు, వివిధ దేశాలకు చెందిన దాదాపు 750 మంది ప్రతినిధులు, రైతులు, ఎన్జీవో, అధికారులుత పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెట్టాలి

### సిఎంను కోరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం ఏర్పడి 75 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభలో ప్రత్యేక చర్చ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. పంచాయతీ ఎన్నికలలో బీసీ రిజర్వేషన్‌ల పెంపునకు సంబంధించి ఫిబ్రవరి 7న శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు పత్రికల్లో చదివినట్లు కూనంనేని లేఖలో పేర్కొన్నారు. ఆ సమావేశాల్లో భాగంగా.. రాజ్యాం గం ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. రాజ్యాంగం, దాని అమలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై ప్రత్యేక చర్చ పెట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. కొద్దిరోజుల క్రితం ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో 75 సంవత్సరాల రాజ్యాంగంపై ఉభయ సభలు చర్చించిన విషయాన్ని గుర్తు చేశారు. కాబట్టి ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో .. ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి 75 ఏండ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరపటం సముచితంగా వుంటుందని.. శాసనసభా నాయకులుగా ముఖ్యమంత్రి చొరవ చూపాలని కూనంనేని సాంబశివరావు లేఖలో కోరారు.



ప్రజావాణిలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న డా.చిన్నారెడ్డి.

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 9,307

### వీటిలో 7,100 ఇందిరమ్మ ఇళ్ల కోసమే..

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 31, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 9307దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 211 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 160 దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 43 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి సంబంధించి 1దరఖాస్తు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1,736 దరఖాస్తులు (రేషన్‌కార్డుల కోసం)దరఖాస్తులు వచ్చా యి. ఇతర శాఖలకు సంబంధించి 56దరఖాస్తులు అందాయి.రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చినవారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సంబంధిత అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. పలు సమస్యలను తక్షణమే పరిష్కారమయ్యేలా చిన్నారెడ్డి చర్యలు తీసుకున్నారు.

# విద్య, ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి

### మహిళల అభివృద్ధే కేంద్రంగా నిధుల కేటాయింపు : డిప్యూటీసిఎం భట్టి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 31:** ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, ఆరోగ్య రంగాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించిందని, ఈ రంగాల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైన కేటా యించేందుకు సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఆయన బేగంపేటలోని ఓ ప్రైవేట్ మహిళా కళాశాల వార్షిక దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యపై పెట్టు బడి మూలంగా గొప్ప మానవవనరులు రాష్ట్రంలో అభివృద్ధి చెందు తాయి, ఫలితంగా ప్రపంచాన్ని ఏలే శక్తి తెలం గాణకు దక్కుతుందని ఆయన అన్నారు. విద్యా రంగ అభివృద్ధి కోసం ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నామని ఇప్పటికే 60 స్కూళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు విద్యను అందిస్తే ఆ ఫలితం కేవలం ఆమెకే కాకుండా కుటుంబానికి.. సమాజానికి మేలు జరుగుతుందని వివరించారు. కుటుంబ వ్యవస్థ దేశానికి బలం.. ఆ కుటుంబ వ్యవస్థను నడిపించే శక్తి అమ్మ, భార్య, సోదరి రూపంలో ఉన్న మహిళ అని అభివర్ణించారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని మహిళల అభివృద్ధికి అన్ని విధాల రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నామని వివరించారు, వారికి చదువు, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మహాలక్ష్మీ పేరిట ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని.. విద్యార్థినీలు కళాశాలలకు వెళ్లేందుకు, మహిళలు ఉచితంగా పని ప్రదేశాలకు వెళ్లేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని.. వీటితో రాష్ట్ర ప్రభుత్వం ఆగిపోదని తెలిపారు. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఆలోచనలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలతో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ఉత్పత్తికి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. సహజంగా వీటిని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తారు అందుకు భిన్నంగా మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు కేటాయిస్తుందని తెలిపారు. సోలార్ విద్యుత్ లో పెట్టుబడుల కోసం బ్యాంక్ లింకేజీ ఇప్పించడం, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేయడం మహిళలకు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఈ తరహా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పథకం దేశంలోనే గొప్ప పథకంగా అభివర్ణించారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దబోతున్నామని వివరిం చారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని, వారి తరఫున వడ్డీని ఆర్థిక శాఖ చెల్లిస్తుందని వివరించారు. ప్రపంచం లోనే పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన ఇందిరాగాంధీ మహిళలు ఏ పనినైనా చేయగలరని నిరూపించా రని తెలిపారు. 1959లో 15 మంది విద్యార్థినులతో ప్రారంభమైన సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల ప్రస్తుతం 3000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం అభినంద నీయమని, ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులు గొప్ప ప్రతిభను కనబరుస్తున్నారని అభినందించారు.

# నీళ్లపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం



శుక్రవారం తెలంగాణ జాగృతి సంస్థ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

### జల రాజకీయం మానేసి ప్రభుత్వం వాస్తవాలు చెప్పాలి

### 'నీళ్లు-నిజాలు' రౌండ్‌టేబుల్ సమావేశంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్

**హైదరాబాద జనవరి 31, ప్రభాతవార్త :** నీళ్ల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నీచ రాజకీయం చేస్తున్నదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడ్డారు. నీటి విషయాల్లో రాజకీయం చేయడం మానేసి నిజాలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై అక్కసుతో కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేయడమే కాకుండా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలను ఎండ బెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయానికి గోదావరి వరదను కూడా తట్టుకొని మేడిగడ్డ బ్యారేజీ మేరునగధీరుడిలా నిలబడిందని అన్నారు. తెలంగాణ జలవనరులు, ప్రాజెక్టులు 'నీళ్లు-నిజాలు'పై తెలంగాణ జాగృతి సంస్థ శుక్రవాం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు ఆమోదించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేసీఆర్ పూర్తి చేసిన ప్రధాన ప్రాజెక్టుల్లో మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను కాంగ్రెస్ ప్రభు త్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-1 పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలన్నారు. ఇరిగేషన్ అడ్వైజర్ పోస్ట్ నుంచి ఆదిత్యనాథ్‌దాస్‌ను తొల గించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోదావరి కృష్ణా పెన్నా లింక్ చేస్తూ ఏపి అక్రమంగా నిర్మిస్తోన్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాస్తామని అన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్‌లో తెలంగాణకు బేసిన్, క్యాచ్‌మెంట్, కమాండ్ ఏరియా, డ్రాట్‌ప్రోన్ ఏరియా ప్రాతిపదికన 575 టీఎంసీల నికర జలాలు సాధించేలా సమర్థ వాదనలు వినిపించాలని సూచించారు. కృష్ణాజలాల్లో గోదావరి మళ్లింపు కింద మొత్తం 125 టీఎంసీల సాధనకు బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఎదుట బలమైన వాదనలు వినిపించాలని ఆమె అన్నారు. గోదావరి మూసీ ప్రాజెక్టును మల్లన్న సాగర్ నుంచి కాకుండా తక్కువ ఖర్చుతో పూర్తయ్యే కొండపోచమ్మ సాగర్ నుంచి చేపట్టాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయడానికి ఏటా రూ.20 వేల కోట్లకు తగ్గకుండా బడ్జెట్ కేటాయించి ఖర్చు చేయాలని ఆమె కోరారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టును పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ అధీనంలోకి తేవాలని అన్నారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు సాధించాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వి. ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఓఎస్డీ, విశ్రాంత ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, బిఆర్ఎస్ నేత పల్లె రవి కుమార్ గౌడ్, రిటైర్డ్ సీఈ ఖగేందర్,సీనియర్ జర్నలిస్టు కామెర నవీన్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలే

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫాంహౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని పిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కేసీఆర్ అభ్యర్థుల కోసం ఇటువంటి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. ప్రజలు ఫాంహౌస్ పాలన గడీల పాలన కోరు కోవడం లేదని మహేష్ అన్నారు. ప్రజా పాలన ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని ఆయన వివరించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో ఆయన దిక్కుతోచక మాట్లాడు తున్నారని ఎద్దేవా చేశారు. ఆయన వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని ఎకసెక్కాలు చేశారు.ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కాంలో కూరుకుపోయిన కేసీఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కాం ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడు తున్నారని దుయ్యబట్టారు.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గద్దెదింపినా, 2024 పార్ల మెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వని కేసీఆర్ ఫాంహౌస్‌లో పగటి కలలు కంటున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష నేతగా విఫలమైన కేసీఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యా స్పదం. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50 వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం ఆయనకు కనిపించడం లేదా? కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిన ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ది అని స్వోత్కర్షలు చెప్పుకున్నారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురుచూస్తే పట్టించుకోని కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడడంతో, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చెవాకులు పలుకుతున్నారు. ప్రజలు ఛీకొట్టినా కేసీఆర్ వ్యవహార శైలి, మాటతీరులో మార్పు రాకుంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్నిసార్లు సవాలు విసిరినా స్పందించని కేసీఆర్ పామ్‌హౌస్‌లో కూర్చొని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు.

# కులాంతర వివాహితుల భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి

### తుంగతుర్తి కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** కులాంతర వివాహం చేసుకున్నవారి భద్రత కోసం ప్రత్యేక చట్టం తేవాలని సిఎంఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు వెస్లీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదు నెలల క్రితం దళితుడైన వడ్లకొండ కృష్ణ, బీసీ కులానికి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకున్నారని.. దాంతో తమ కుటుంబ పరువు పోయిందనే నెపంతో భార్గవి కుటుంబ సభ్యులు కృష్ణను హత్య చేశారని గుర్తు చేశారు. కృష్ణను హత్య చేసిన నిందితులపై గతంలో అనేక కేసులు న్నాయని.. వారిని అరెస్టుతోనే సరిపెట్టకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి.. కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, భద్రత కల్పించాలని.. అదేవిధంగా కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చట్టాలెన్నొచ్చినా కులాంతర వివాహం చేసుకున్నవారిపై హత్యలు, దాడులు, బహిష్కరణలు జరుగుతున్నాయని.. వాటిని నియంత్రించడంలో ప్రభుత్వాలు, రక్షణ వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులాంత వివాహాలు చేసుకున్న వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 45 కుల దురహంకార హత్యలు జరిగాయని గుర్తు చేశారు. ఇటువంటి ఘటనలు జరిగిన వెంటనే నిర్ణీత కాల వ్యవధిలో విచారణ జరిపి.. బాధితులకి భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.



చోరీ సోత్తును చూపిస్తున్న పరిగి డిఎస్పీ

## దొరికిన కిలాడీ లేడీ

### పరిగి బస్టాండ్ వరుస చైన్ స్నాచింగ్‌లు

### రద్దీ ప్రాంతాలే లక్ష్యంగా చోరీలు : పరిగి డిఎస్పీ

**పరిగి, జనవరి 31, ప్రభాతవార్త:** రద్దీ ప్రాంతాల్లో, బస్టాండుల్లో వరుసగా చైన్ స్నాచింగ్, దొంగతనాలు చేసే కిలాడీ లేడీని పరిగి పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా, పరిగిలో డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశాన్ని నిర్వహించి, వివరాలు వెల్లడించారు. భువనగిరికి చెందిన అమూల్య అనే మహిళ, హైద్రాబాద్ కు చెందిన మహ్మద్ ఇక్బాల్ ఇద్దరు కలిసి రద్దీ ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు.కిలాడి లేడీ అమూల్యను పోలీసులు అరెస్టు చేయగా, మరో నిందితుడు మహ్మద్ ఇక్బాల్ పరారీలో ఉన్నాడు .. కిలేడీ అమూల్య వద్ద నుండి దాదాపు 11 తులాల బంగారం, 80 వేల నగదు, ఒక సెల్ ఫోన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో పరిగి బస్టాండ్‌లో జరిగిన వరుస చైన్ స్నాచ్చింగ్ ఘటనలు వీరిద్దరూ కలిసి చేశారని, గతంలోను ఇద్దరు కలిసి జిల్లాలో పలుచోట్ల చోరీలు చేసినట్లు పోలీసుల విచారణలో మహిళదొంగ తెలిపిందని, మహ్మద్ ఇక్బాల్ ప్రధాన సూత్రధారిగా ఉంటూ చోరీలు ఎలా చెయ్యాలో, ఎక్కడ చెయ్యాలో శిక్షణ ఇచ్చేవాడని మహిళ పోలీసులకు తెలిపిందని, మరో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసు బృందం ప్రయత్నిస్తుందని డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

## తగ్గిన పత్తి ధరలు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పత్తి ధరలు తగ్గడంతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులకు మద్దతు ధర కల్పించి వారికి అండగా నిలవాల్సిన కాటన్ కార్పొరేషన్ రైతాంగాన్ని నష్టాలకు గురిచేస్తుదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది పత్తి క్వింటాలుకు రూ.4521 మద్దతు ధరను కేంద్రం ప్రకటించింది. అక్టోబర్ చివరి వారంలో పంట కొనుగోలు ప్రారంభం కాగా డిసెంబర్ నెలాఖరు వరకు మద్దతు ధరతో పంట కొనుగోలు చేశారు. అయితే పంట నాణ్యత సరిగా రావడం లేదంటూ సీసీఐ అధికారులు రూ.100 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తాము నాణ్యమైన పంటను విక్రయానికి తీసుకువస్తున్నామని రైతులు చెబుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెటింగ్ శాఖ అధికారులు సైతం పట్టించు కోకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పంటను సీసీఐకి విక్రయిస్తున్నారు. దీంతో పత్తికి మద్దతు ధరలు రాక రైతాంగం ఆందోళన చెందుతోంది.

## ఆన్‌లైన్ రమ్మీ ఆడి అప్పలపాలై యువకుడి ఆత్మహత్య



భూష కార్తీక్ (ఫైల్)

**శంకరపట్నం, ప్రభాతవార్త:** శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన భూష కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆడి ప్రాణాలు తీసుకున్నాడని ఎస్సై రవి తెలి పారు. ఆయన కథనం మేరకు.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన భూష కార్తీక్ ఆన్‌లైన్ రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టు కున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ ఈనెల 28న పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో, జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తండ్రి శంకర్ శుక్రవారం కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్ రమ్మీతో డబ్బులు పోగొట్టుకొని కార్తీక్ ఆత్మహత్య చేసుకున్నట్లు, మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

## ఎంపికైన జూనియర్ లెక్చరర్లకు నియామకపత్రాలు ఇచ్చేలా చూడాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి అభ్యర్థుల విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ద్వారా ఎంపికైన 1392 జూనియర్ లెక్చరర్స్(జేఎల్)కి వెంటనే నియామక పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీకి ఎంపికైన అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జాన్ వెస్లీని శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపిన సెలెక్టెడ్ అభ్యర్థులు తమ సమస్యను పరిష్కరించేలా చూడాలని వినతిపత్రం సమర్పించారు. జాన్‌వెస్లీని కలిసిన వారిలో వివిధ యూనివర్సిటీల నుండి జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు డాక్టర్ జి లింగానాయక్, ఏ వేణు రావు, జి ముత్యాలు, బొజ్య నాయక్, వీణా చారి, సుమన్, రాజశేఖర్, అభిషేక్, వినయ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు .. టీజీపీఎస్సీ ద్వారా 15 సంవత్సరాల తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఖాళీగా ఉన్న 1392 జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు 2022లో నోటిఫికేషన్ ఇచ్చి, 2023లో రాత పరీక్ష నిర్వహించారని తెలిపారు. అనంతరం 2024 జూలైలో మెరిట్ జాబితా ప్రకటించి.. తుది ఫలితాలు విడుదల చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు తమకు నియమకపత్రాలు అందచేయలేదన్నారు. డీఎస్సీ-2024 నిర్వహించిన 55 రోజుల్లో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేసిందని తెలిపారు. రాష్ట్రం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల అభివృద్ధికి.. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ముందుంటామని తెలియజేస్తూ తమకు నియామకపత్రాలు అందచేసేలా చూడాలని జాన్‌వెస్లీని కోరారు.



శుక్రవారం రంగారెడ్డి జిల్లా మొగిలిగిద్ద గ్రామంలో ప్రభుత్వ పాఠశాల 150 వ వార్షికోత్సవానికి హాజరై సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి31:** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. కరీంనగర్-మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. కాగా, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే కరీంనగర్,మెదక్,నిజామాబాద్,ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో 42 నియోజకవర్గాలు ఉన్నాయి. దీంతో పాటు ఆరు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 3.41 లక్షల గ్రాడ్యుయేట్ ఓట్లు ఉన్నాయి. ఒకప్పుడు బిఆర్ఎస్‌కు ఈ ప్రాంతం కంచుకోటగా ఉండగా. తాజాగా ఈ ఎన్నికలకు బిఆర్ఎస్ దూరంగా ఉండాలని భావిస్తోందని సమాచారం. తెలంగాణలో రెండు టీచర్,ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ స్థానంతో పాటు మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ ఉపాధ్యాయ స్థానానికి, మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏకకాలంలో రెండు ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల నియోజకవర్గంనుంచి టి.జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘోత్తమ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు ఇరువురి పదవీకాలం మార్చి 29వ తేదీన ముగియనుంది. భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను అనుసరించి ఫిబ్రవరి 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానున్నాయి. 11న నామినేషన్ల పరిశీలన.13న ఉపసంహరణ, ఫిబ్రవరి 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు,ఫలితాలు వెల్లడిస్తారు.

## జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక నైపుణ్య కేంద్రాలు

### తెలంగాణను 'స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా మార్చడమే లక్ష్యం : మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి31:** తెలంగాణను 'స్కిల్స్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తీర్చి దిద్దేందుకు జిల్లాలవారీగా ప్రత్యేక నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో డార్క్ మేటర్ టెక్నాలజీస్ పేరిట కెనడాకు చెందిన కన్సల్టేషన్ సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే నైపుణ్యమున్న మానవ వనరులు అవసరం. కంపెనీలు ఉద్యోగాల్లోకి తీసుకున్న తర్వాత తమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చదువుకునే సమయంలోనే వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాం. చదువు పూర్తయ్యే నాటికి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చి దిద్దుతున్నామని, ఫలితంగా పరిశ్రమల డబ్బు, సమయం ఆదా అవుతుందని వివరించారు.

మన దగ్గర టాలెంట్‌కు కొదువ లేదు. తక్కువ పెట్టుబడితో అద్భుత ఆవిష్కరణలను చేసే సత్తా ఉంది. మరి ఎందుకు డీప్ సీక్ లాంటి అధునాతన ఆవిష్కరణలను చేయలేకపోతున్నామని చెప్పారు. ఇప్పటికైనా హైదరాబాద్‌లో ఉన్న పరిశ్రమలు ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నా. తెలంగాణ యువత కూడా నైపుణ్యాలను పెంచుకోవాలని చెప్పారు. ప్రభుత్వం తరపున మద్దతుగా ఉంటాం. మీకు ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటాం" అని వివరించారు. జీసీసీలు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయి. ఈ ఏడాది వాటి విలువ 46 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లుగా ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. వచ్చే ఏడాది 60 బి.డాలర్లు, 2030 నాటికి 100 బి.డాలర్ల మార్క్ దాటుతుందని అంచనా వేస్తున్నారు.అందుకే రాష్ట్ర ప్రభుత్వం జీసీసీలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. తెలంగాణను ట్రిలియన్ ఎకానమీగా మార్చే లక్ష్యంలో వీటిని భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్‌ను జీసీసీల హబ్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికే 400 జీసీసీలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, మరికొన్ని ప్రముఖ సంస్థలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు.

## చెల్లని వెయ్యి నోటు కెసిఆర్

>>అప్పుజెప్పారని విమర్శించారు. ఎక్కడ చేయి పెట్టినా అప్పులే చేతికి అందుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, గత ప్రభుత్వం చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని అన్నారు. రుణమాఫీ చేయలేదంటున్న కెసిఆర్ అసెంబ్లీకి వస్తే లెక్కలు చెబుతామని అన్నారు. ఫామ్‌హౌజ్‌లో ఉండి సోది చెప్పడం కాదు, అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. ఏ గ్రామంలో ఏ రైతుకు ఎంత రుణమాఫీ చేశామో శాసనసభలో ప్రతి పైసాతో సహా లెక్కలు చూపెడతామని అన్నారు. కెసిఆర్‌కు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని అన్నారు. కెసిఆర్ కాలంచెల్లిన వెయ్యి రూపాయల నోటు అని, ఆ నోటును నమ్ముకుంటే జైలుకెళ్లడం ఖాయమని రేవంత్ అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే బిసి గణన, మాదిగ ఎబిసిడి వర్గీకరణ ఫిబ్రవరి మొదటివారంలో అసెంబ్లీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, వీలైతే అన్ని లెక్కలు చెబుతాం.. ముందు సభకు రావాలని కెసిఆర్‌కు సూచించారు. రైతు భరోసా ఎగ్గొడతారని కెసిఆర్ చెబుతున్నారని, మీలాగా మాట తప్పే వ్యక్తిని కాదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అని అనేక హామీలు గుప్పించి మాటతప్పిన చరిత్ర కెసిఆర్‌ది అని విమర్శించారు. పదేళ్లు పాలించి ప్రజల దగ్గరకు వెళ్తే పార్లమెంటు ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయారని, పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఇక్కడి ప్రాజెక్టులను పండబెట్టారని రేవంత్ రెడ్డి విమర్శించారు.

**విద్యపై చేసేది ఖర్చు కాదు.. భవిష్యత్తు పెట్టుబడి**

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21 వేల కోట్లు కేటాయించామని, విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేందుకే విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో 150వ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మొగిలిగిద్దకు దాదాపు రూ.16 కోట్ల నిధులు మంజూరు చేశానని అన్నారు. అదేవిధంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను కూడా మంజూరు చేస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో టీచర్ల నియామకం జరగలేదని, విద్యను నిర్వీర్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. గతంలో నోటిఫికేషన్లు ఇస్తే సంవత్సరాల తరబడి నియామక ప్రక్రియ జరిగేదని, తమ ప్రభుత్వం రాగానే 55 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశామన్నారు. బిఆర్ఎస్ హయాంలో యూనివర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయని, తమ ప్రభుత్వ రాగానే వీసీలను నియమించామని, ప్రొఫెసర్ల పదవీ విరమణ వయస్సు 65 ఏళ్లకు పెంచామని అన్నారు. ఎలాంటి వివాదం లేకుండా 35 వేల మంది ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను విజయవంతంగా చేపట్టామన్నారు. విద్యపై చేసేది ఖర్చు ఎంత మాత్రము కాదని, భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తామని అన్నారు. గ్రామంలో నూతన భవనాన్ని నిర్మిస్తామని, అలాగే టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు గ్రంథాలయం, సిసి రోడ్లు, షాదీఖానాను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభ్యర్థన మేరకు రూ.16 కోట్లతో పనులు చేపడతానని హామీ ఇచ్చారు. విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తుచేశారు. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతానికి పైగా పెంచామని అన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలు పెంచాలనే ఉద్దేశంతో యంగ్ ఇండియా స్కూల్ వర్సిటీలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దేశంలో 140 కోట్ల జనాభా ఉన్నప్పటికీ మెరుగైన క్రీడాకారులను సిద్ధం చేసుకోలేకపోయామని, ఒక్క గోల్డ్ మెడల్ రాలేదని, అదే కోటి మంది ఉన్న ఉత్తర కొరియా దేశానికి 30 గోల్డ్ మెడల్స్ వచ్చాయన్నారు. అందుకే మేలి రకాలైన క్రీడాకారులను తయారు చేసుకునే బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. వివిధ క్రీడల్లో పథకాలు సాధించిన క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన సిరాజ్, ఇంకా మరికొందరికి గ్రూప్ 1 ఉద్యోగంతో ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేశామని అన్నారు. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాఠశాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. విద్యను దూరదృష్టితో చూస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామన్నారు. అందుకే తమ ప్రభుత్వం రాగానే ఎలాంటి షరతులు లేకుండా 35 వేల మంది టీచర్లను బదిలీ చేశామని, 20 ఏళ్ల వారి నిరీక్షణకు తెరదించామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే 53 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.

**నన్ను కొట్టుడు తర్వాత.. నువ్వు ముందు సరిగ్గా నిలబడు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొగిలిగిద్ద సభలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై పొలిటికల్ సెటైర్లు వేశారు. కెసిఆర్ ఫామ్‌హౌజ్‌లో కూర్చొని నన్ను కొడతానని తన అనుచరుల వద్ద చెబుతున్నాడని, సరిగ్గా నేలపై నిలబడితే ఆ తర్వాత చూద్దామని ఎద్దేవా చేశారు. కెసిఆర్ పరిస్థితి ఫామ్‌హౌజ్‌లో ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని విమర్శించారు. అదేవిధంగా సోషల్ మీడియాలో తమ ఇద్దరికీ పోటీ పెడితే లైకులు కెసిఆర్‌కు ఎక్కువ వచ్చాయని సోది చెబుతున్నారని, అదే సోషల్ మీడియాలో సల్మాన్‌ఖాన్‌కు రాఖీ సావంత్‌కు మధ్య పోటీ పెడితే రాఖీ సావంత్‌కు ఎక్కువ లైకులు వచ్చాయని అంతమాత్రాన సల్మాన్‌ఖాన్ హీరో కాకుండా పోతాడా అని కెసిఆర్‌పై రేవంత్ సెటైర్లు వేశారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఇదే నియోజకవర్గంలో జెపి దర్గాకు వంద కోట్లు ఇచ్చి అభివృద్ధి చేస్తానని చేతికి దస్తీలు కట్టి మాట తప్పాడని, కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు దర్గాకు వెళితే చేతికి దస్తీలు, గుళ్లకు వెళితే దండాలు ఉంటాయని, అభివృద్ధి మాత్రం సున్నా అని అన్నారు. కెసిఆర్ కొడుకు కెటిఆర్ మైసమ్మకు వదిలిన దున్నపోతులా, దర్గాకు వదిలిన మేకపోతులా ఊర్లపై పడి తిరుగుతున్నాడని, తెలంగాణ రాష్ట్రంలో కెటిఆర్, హరీష్ రావు యమకింకరులని ఘాటుగా ప్రస్తావించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూసి రాష్ట్ర ప్రజలకు మొఖం చూయించలేక ఫామ్‌హౌజ్‌లో పడుకున్న కెసిఆర్ ముందు అసెంబ్లీకి రావాలని కోరారు. ఈ సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, మహేందర్ రెడ్డి, సినీనటుడు, నిర్మాత బండ్ల గణేష్, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బీష్వ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, శివశంకర్ గౌడ్, విశాల, ప్రియాంక గౌడ్, రఘు నాయక్, సయ్యద్ సాదిక్, వెంకట్‌రాంరెడ్డి, జాంగారి రవి, ఆయా మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం పార్ల మెంటు భవనం వద్ద రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, ప్రధాని మోడీ

## గద్దర్‌కు చరిత్రలో ఒక పేజీ

>> రావు, గోరటి వెంకన్న పేర్లను సూచించినా ఏఒక్కరి పేరును పరిగణనలో తీసుకోకపోగా కేంద్రమంత్రి ఒకరు గద్దర్‌ను అగౌరపరుస్తూ, అహంతో ఇష్టానుసారం మాట్లాడాడని, ఇలా మరోసారి కించపరిస్తే ఆపార్టీ ఆఫీస్ కార్యాలయమున్న ప్రాంతానికి గద్దర్ పేరుపెడతామని, అడ్రసు మార్చుకోవాల్సి, లేక గద్దర్ పేరుతో వ్రాసుకోవాల్సి వస్తుందన్నారు. త్వరలో ఓట్లవిప్లవం వస్తది అందులో కొట్టుకుపోతావ్ అని హెచ్చరించారు. గద్దర్‌ను గుర్తించనంత మాత్రాన విలువ తగ్గదు.... కోహినూర్ వజ్రం విలువ ఏనాడు తగ్గదని స్పష్టం చేస్తూ త్వరలో నక్లెస్‌రోడ్‌లో గద్దర్ మెమోరియల్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క గద్దర్ కవి, గాయకుడు, విశ్వమానవుడు అన్నారు. గద్దర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా గతంలో సినీపరిశ్రమలో ప్రముఖులకు ప్రభుత్వం అందించే నంది పురస్కారాలను నవీకరించి గద్దర్ ఫిలిమ్ అవార్డులుగా వచ్చే ఉగాది నుండి పెద్దయెత్తున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రవీంద్రభారతి ప్రధానమందిరంలో గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ నిర్వహణలో వైభవంగా జరిగిన ప్రజాయుద్ధనౌక గద్దర్ గుమ్మడి విఠల్‌రావు 77వ జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విశిష్ట అతిథులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు కోదండరాం, గోరటి వెంకన్న, గద్దర్ భార్య విమల గద్దర్, కుమార్తె డా. జి.వి.వెన్నెల, డా. మామిడి హరికృష్ణ, అద్దంకి దయాకర్, పట్నం మహేందర్‌రెడ్డి, కె.శ్రీనివాస్, పాశం యాదగిరి, కంచె ఐలయ్య, డా. గంటా చక్రపాణి, అల్లం నారాయణ, కాకి మాధవరావు తదితరులతో కలిసి గద్దర్ చిత్రపటానికి పుష్పాంజలితో ఘననివాళులర్పించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గద్దర్ వ్రాసిన మాపల్లె, ప్రతీ పాటకు ఒక కథ ఉంది పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్సీలు తదితర అతిథులు మాట్లాడారు.

## వేతన జీవులకు ఊరట ఎంత?

>> రాబడుల్లో మినహాయింపులు ఇస్తారని అంచనాగా ఉంది. గత ఏడాదికంటే ఈ సంవత్సరం ఆర్థికవృద్ధిమరింత తగ్గుతుందన్న అంచనాలనడుమ నిర్మలమ్మ బడ్జెట్ ఏరీతిలో ఉంటుందో నన్న ఉత్కంఠకూడాపెరిగింది. ఆర్థికవృద్ధి 6.3నుంచి 6.8శాతం మాత్రమే ఉంటుందని అంచనావేసినా ద్రవ్యోల్బణం స్థిరంగా ఉంటుందని, ప్రభుత్వ వ్యయాలు పెరగడంద్వారా మౌలికవనరులరంగానికి ఎక్కువ నిధులు కేటాయిస్తారన్న అంచనాలు పెరిగాయి ఈనేపథ్యంలోనే ఉపాధి శిక్షణ రంగాలతోపాటు నైపుణ్యం పెంపు రంగాలు, ఉపాధి రంగాలకు ఎక్కువ ఊతం ఇస్తారన్న అంచనాలున్నాయి. రీట్స్, ఇన్విట్స్ వంటి ఫండ్స్ పెట్టుబడులు, దీర్ఘకాలిక మూలధన లబ్దిపన్ను వంటివాటిపై ఎక్కువ ఫోకస్ పెరుగుతోంది. అలాగేసెక్యూరిటీల లావాదేవీలపన్నుపైనా కొంతమేర ఉపశమనం కల్పిస్తారని, మూలవనరులనుంచి పన్ను మినహాయింపును కూడా మరింత సడలించవచ్చన్న అంచనాలు పెరుగుతున్నాయి. ఏంజల్ ట్యాక్స్, విదేశీ ఆస్తుల ప్రకటన, బినామీ లావాదేవీలపై కొంతమేర ఉపశమన చర్యలు ఉంటాయన్న అంచనాలుపెరుగుతున్న క్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం లోక్‌సభలో తన ఎనిమిదవ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఉదయం 11 గంటలనుంచి ప్రారంభం అయ్యే ఆమె బడ్జెట్‌ప్రసంగం ప్రత్యక్షప్రసారంచేసేందుకు ప్రభుత్వ టివిలు ఏర్పాట్లుపూర్తిచేసాయి.

## 'ఆప్'కు ఏడుగురు ఎమ్మెల్యేలు గుడ్‌బై

>> బిజ్వాసన్‌లు కూడా తమతమ ఎమ్మెల్యేల పదవులకు రాజీనామాలుచేసారు. రాజీనామాలుచేసిన ఈ ఏడుగురు ఎమ్మెల్యేలకు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్లు ఇవ్వలేదు. దీనితో ఎన్నికల్లో పోటీలోలేని ఈ ఏడుగురు శుక్రవారం రాజీనామాచేసారు. ఏపార్టీలో చేరాతమన్నది మాత్రం వారు స్పష్టంచేయలేదు. 70 మంది ఎమ్మెల్యేలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి ఐదోతేదీ పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలుప్రకటిస్తారు.

## ఇక చూస్కో నా ప్రతాపం

>> ఆర్థికంగా దివాళా తీయించారని ఆరోపించారు. గురుకులాల్లో చదువు అగమ్యగోచరమైందని, పురుగుల అన్నం పెడుతున్నారని మండిపడ్డారు. తాను చెప్పినా ప్రజలు వినలేదని.. అత్యాశకు పోయి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, తులం బంగారం ఇస్తారని ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం చెబుతారని తాను ఎన్నికల సమయంలోనే చెప్పానని గుర్తు చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రాబోయే రోజుల్లో విజయం మనదేనన్నారు. ప్రత్యక్ష పోరాటాలకు బిఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పోరాటం చేస్తే తప్ప ఈ ప్రభుత్వం దిగిరాదన్నారు. ఫిబ్రవరి నెలాఖరులో భారీ సభ పెడుతామని.. బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు అమాంతం పడిపోయాయని.. రాష్ట్రంలో ప్రాజెక్టులు అక్కడే ఆగిపోయాయని మండిపడ్డారు. సంగమేశ్వర, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మబ్బులు ఇప్పుడే తొలగిపోయి నిజాలు బయటకు వస్తున్నాయన్నారు. మంచేదో చెడు ఏదో ప్రజలకు తెలుస్తుందన్నారు. మాట్లాడితే ఫామ్ హౌస్.. ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారన్న కెసీఆర్.. ఫామ్ హౌస్‌లో పంటలుతప్ప ఏముంటాయని ప్రశ్నించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటుం దన్నారు. కాంగ్రెస్ పాలనపై అంతా అసంతృప్తే ఉందన్నారు. పాలనా వైఫల్యాలను నిలదీస్తే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని, ఇప్పుడే మన ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ సిఎం కెసిఆర్ అన్నారు. పోరాటం చేస్తే తప్ప ప్రభుత్వం దిగిరాదని అన్నారు. తెలంగాణ శక్తి ఏంటోచూపించి, కాంగ్రెస్ మెడలు వంచుతామని హెచ్చరించారు. భూముల ధరలు అమాంతం పడిపోయాయని, ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావా లని, మన విజయం, తెలంగాణ ప్రజల విజయం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నో ప్రభుత్వాలను చూశానని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని కెసిఆర్ పేర్కొన్నారు. ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే పడుకున్నాయని, సంగమేశ్వరం, బసవేశ్వర, కాళేశ్వరం ప్రాజెక్టులను ఎండబెడుతున్నారని విమర్శించారు.

కరోనా సమయంలోనూ రైతులకు రైతుబంధు ఇచ్చి ఆదుకున్నామని, రైతు బీమాతో ఎంతోమంది రైతులకు మేలు జరిగిందని అంటూ తమ హయాంలో రైతులకు జరిగిన ప్రయోజనాలను సోదాహరంగా వివరించారు. 'ప్రాజెక్టుల ద్వారా సాగు నీళ్లు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీళ్లు ఇచ్చుకున్నం . నీటి తీరువా రద్దు చేసినం . చెరువులు బాగు చేసినం, మల్లన్న సాగర్ వంటి ఎన్నో రిజర్వాయర్లు నిర్మించుకున్నం. రైతు బీమా వంటి పథకం పెట్టి ఒక గుంట భూమి రైతు చనిపోయినా అతని కుటుంబాన్ని ఆదుకున్నం. గొర్రెల కాపరులకు గొర్లు పంపిణీ చేసినం. కరోనా వంటి సమయంలో కూడా రూపాయి ఆదాయం లేకపోయినా రైతు బంధు ఆపకుండా ఇచ్చినం. రైతుల కోసమే నాలుగైదు మంచి పథకాలు పెట్టి ఆదుకున్నం. తెలంగాణలో ఉన్న వాళ్ళందరూ మనోళ్లే అని అనేక సంక్షేమ పథకాలతో కంటికి రెప్పలా చూసుకున్నం. ఇప్పుడు అన్నీ పోయినయి. కాంగ్రెస్ పాలనలో మళ్లీ మొదటికి వచ్చింది. వాళ్లు ఇప్పుడు అన్ని రంగాలను నాశనం చేస్తున్నరు' అని బిఆర్ఎస్ అధినేత ఆవేదన వ్యక్తం చేశారు.

## 3వ ఆర్థిక వ్యవస్థగా మారుతున్న భారత్

>> వంటి వివిధ బహుపాక్షిక వేదికలపై ప్రపంచం భారత్‌శక్తిసామర్థ్యాలు, ఉద్దేశ్యాలను గుర్తించిందని ప్రపంచ అస్థిరత సమయంలో భారత్ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిరత్వానికి మూల స్తంభంగా మారి ప్రపంచానికి ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు. ప్రభుత్వం రెండువేల కోట్ల ఖర్చుతో మిషన్ మౌసమ్‌ను ఏర్పాటుచేసి రైతులకు ప్రయోజనం కలిగించిందని, రైతులకు గిట్టుబాటుధరలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తోందని అన్నారు. పిఎం జన్మాన్‌యోజన, ధర్తీఆబా గిరిజన గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ వంటివి గిరిజన సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని సూచిస్తున్నాయన్నారు.

సికిల్‌సెల్ రక్తహీనతకు సంబంధించి ఆరోగ్యసమస్యలు కూడా ప్రత్యేక జాతీయ మిషన్‌పరిధిలో ఇప్పటివరకూ ఐదు కోట్లమందిని పరీక్షించారన్నారు. పేదరిక నిర్మూలనకోసం కృషిచేస్తున్న ప్రభుత్వం 25 కోట్లమందిని పేదరికంనుంచి విముక్తి కల్పించిందని, అర్హులందరికీ లబ్దిచేకూరేలా సంక్షేమపథకాలను వేగంగా అమలుచేస్తున్నామన్నారు.

మధ్యతరగతిప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నామని, అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్లనిర్మాణంకోసం ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పొడిగించామనానరు. ఆయుష్మాన్‌భారత్‌పథకం కింద 70 ఏళ్లుపైబడిన ఆరుకోట్లమంది వృద్ధులకు ఆరోగ్యబీమా అందిస్తోందని, అమృత్‌భారత్; నమోభారత్‌రైళ్లు నడుస్తున్నాయని, విద్యారంగంపై ప్రత్యేక ఫోకస్‌పెట్టియువతకు కొత్త ఉపాధి అవకాశాలు అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త విద్యావిధానంతో ఆధునిక విద్యా వ్యవస్థను ఏర్పాటుచేసామని అన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు గొప్ప ముందడుగు అని నేషనల్ రూరల్ లైవ్లీహుడ్‌మిషన్‌కింద 91 లక్షలకుపైగా స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించి మూడుకోట్లమందిని లక్‌పతీ దీదీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. భారత్ గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం అని నేషనల్ రీసెర్చి ఫౌండేషన్ ప్రారంభించామని, కృత్రిమ మేధరంగంలో భారత్ ఎఐమిషన్ మొదలుపెట్టామన్నారు. మానవసహిత అంతరిక్షప్రయోగం గగన్‌యాన్‌ను ప్రయోగించేరోజు ఎంతో దూరంలోలేదని, ఎంఎస్‌ఎంఇలకు క్రెడిట్ గ్యారటీ పథకాలు, ఇకామర్స్ ఎగుమతి కేంద్రాలు దేశంలో అన్ని రంగాల్లో వ్యాపారాలను ప్రోత్సహిస్తున్నాయని అన్నారు.

డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచ వేదికపై భారత్ కీలకంగా ఉందని యుపిఐ లావాదేవీల వ్యవస్థ విజయాన్ని అభివృద్ధిచెందిన దేశాలుకూడా ప్రశంసించాయని, మెట్రోరైల్ నెట్‌వర్క 1000 కిలోమీటర్లు దాటిందని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా నిలిచిందన్నారు. ఆరోగ్య సంరక్షణకోసం దేశంలో 1.75 లక్షల ఆరోగ్యమందిర్‌లను ఏర్పాటుచేసామని, కేన్సర్ వ్యాధిగ్రస్తులకోసం వారు ఉపయోగించే ఔషధాలపై కస్టమ్స్ సుంకం రద్దుచేసామని, గర్భిణులు, పిల్లల వ్యాక్సినేషన్‌కోసమే యువిన్‌పోర్టల్ పనిచేస్తోందన్నారు. జమ్ముకాశ్మీర్‌లో 370 అధికరణం రద్దుతర్వాత పరిస్థితులు ఎంతో మెరుగయ్యాయని, సంస్కరణలు, పనితీరు, పరివర్తన అనేవి ప్రభుత్వ పాలనకు బలమైన స్తంభాలుగా మారాయన్నారు. సరిహద్దుల రక్షణ, అంతర్గతభద్రతకోసం ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని, వామపక్ష అతివాదానికి వ్యతిరేకంగా పోరాటం చివరిదశకు చేరిందని, నక్సల్స్ ప్రభావితజిల్లాలసంఖ్య 38కి తగ్గిందన్నారు. సామాజిక ఆర్థిక రాజకీయ సుస్థిరలతో ప్రపంచానికే భారత్ స్ఫూర్తిదాయకమని ఇపుడు వికసిత్‌భారత్ నిర్మాణమే మనముందున్న ఏకైకలక్ష్యమని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు.

## 6.8% ఆర్థిక వృద్ధి అంచనా

>> ఆర్థికసర్వేలో సూచించారు. ప్రైవేటు వినియోగం కూడా స్థిరంగా ఉందని ఆదాయ వ్యయాలు సమన్వయం సంతులనంచేసుకుంటూ పోతుంటే 2026లో ఆర్థికవృద్ధి 6.3 నుంచి 6.8శాతంగా ఉంటుందని ప్రభుత్వం అంచనావేసింది.

2020-201 సంవత్సరంనుంచి కూడా జిడిపి రేటు 6.3 నుంచి 6.8శాతంగానే ఉంటోందని కొవిడ్ సంవత్సరంలో మాత్రం భారత్ ప్రతికూల వృద్ధిరేటు అంటే 5.8శాతంగా నమోదయింది. 2021-22 సంవత్సరంలో జిడిపి రేటు 9.7శాతంగా ఉందని 2022-23లో ఏడుశాతం, గత ఆర్థికసంవత్సరంలో 8.2శాతంగా ఉందని ఆర్థికసర్వేలోప్రస్తావించారు. అలాగే ఆహారద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని సీజనల్‌గా కూరగాయల ధరలు కొంతమేర తగ్గుతాయని, ఖరీఫ్ పంటల దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అందువల్ల ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని అంచనా. వాణిజ్యరంగంలో అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలవల్లనే కొన్ని సవాళ్లు ఉంటాయన్నారు.

ఇప్పటికే భారత్‌ప్రపంచస్థాయిలో పోటీతత్వంతో ముందుకుపోతోందని, దేశీయ ప్రాథమిక సూత్రాలను అమలుచేసుకుంటూ మరింత ముందుకు పోతుందని అన్నారు. క్రమానుగతంగా చేపట్టే సంస్కరణలు, నిబంధనల సడలింపులతో మరింత ముందుకు పోగలమని ఆర్థికసర్వేలో చూపించారు. కృత్రిమ మేధ ఫ్రేమ్‌వర్క్‌లో దుర్వినియోగం అరికట్టే టెక్నాలజీని కూడా అమలుచేయాలని సూచించారు. కార్పొరేట్ బాండ్లమార్కెట్లలో ఎంట్రీ వ్యయాలు, సమాచార వ్యాప్తి, సెకండరీ మార్కెట్ సమస్యలు వంటి వాటిని పరిష్కరిస్తే ఈరంగంలోకి మరింత నగదులభ్యత పెరుగుతుందని అంచనావేసింది. 2024లో రూపాయి తరుగుదల బౌగోళిక ఉద్రిక్తతలకారణంగా డాలర్ ఒక్కసారిగా పెరగడం, అమెరికా ఎన్నికలపరంగా కొంత అనిశ్చితి కూడా రూపాయి క్షీణతకు దోహదంచేసింది. 2025లో మార్కెట్లు కొంత సర్దుబాటుకు గురవుతాయి. కొత్త రిటైల్ ఇన్వెస్టర్లుభారీ సంఖ్యలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకువస్తారని ఆర్థికసర్వేలో అంచనావేసారు.

## ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో ఆహార భద్రత, నాణ్యత ప్రమాణాలకు ఎన్ఐఎన్ సహకారం

### రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి. హైదరాబాద్,జనవరి31:** రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు మరో ముందడుగు వేసింది.ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ఆహార భద్రతతో పాటు నాణ్యత ప్రమాణాలను పెంపొందించేందుకు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (జాతీయ పోషకాహార సంస్థ) సహకారం తీసుకుంటోంది. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో 268 రెసిడెన్షియల్ విద్యాసంస్థలున్నాయి. వీటిలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 1.70 లక్షల మంది విద్యార్థులున్నారు. వీరికి ప్రతిరోజు భోజనంతో పాటు స్నాక్స్‌ను అందించే కామన్ డైట్ ప్రోగ్రాంను ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. రాష్ట్రంలో ఇటీవల కొన్ని చోట్ల ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, కొన్ని చోట్ల ఆహార నాణ్యత లోపించిందని ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.

ఇందులో భాగంగా ఎన్ఐఎన్ సహకారంతో ఆహార భద్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెంపొందించాలని నిర్ణయం తీసుకుంది. విద్యా సంస్థలకు సరుకుల సరఫరా, ఆహారం తయారీ, వడ్డించే విషయంలో ఎలాంటి నిరక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో పని చేసే ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని పారదోలేందుకు డైట్ మెనూ, వంట పద్ధతుల్లో నాణ్యత లోపించకుండా నిర్ణీత ప్రమాణాలు పాటించాలని నిర్ణయించింది. వంట గదితో పాటు, స్టోర్ రూమ్, భోజనం వడ్డించే చోట నిర్దిష్టమైన పద్ధతులను (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) అనుసరించాలని సూచించింది. ఆహార నాణ్యత ప్రమాణాలతో పాటు సిబ్బంది పాటించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిజర్ రూపొందించేందుకు ప్రభుత్వం ఎన్ఐఎన్ సహకారం కోరింది. వీటితో పాటు సిబ్బందికి తగిన శిక్షణ మాడ్యూల్‌ను అభివృద్ధి చేయాలని కోరింది.

### వారం - వర్జ్యం

తేది : 01-02-2025, శనివారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
శుక్ల తదియ ఉ.11.39
పూర్వాభాద్ర రా.2.32
వర్జ్యం ఉ.10.10-11.40
దు.ఉ.6.48-8.21
శుభసమయం : ఉ.8.30-9.15, సా.4.00-5.00
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం:** చికాకులు, మానసిక అశాంతి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహ పరుస్తుంది. రుణబాధలు తప్పవు.

**వృషభం:** కీలక నిర్ణయాలలో జాప్యం జరిగిన నిదానంగా తీసుకుంటారు. ఇంటా బయట ప్రోత్సాహం లభిస్తుంది.

**మిథునం:** ఆలోచనలు నిలకడగా ఉండవు. రుణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. వాహన సౌఖ్యం.

**కర్కాటకం :** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. పనులలో విజయం సాధిస్తారు. కాంట్రాక్టు లభిస్తాయి.

**సింహం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. దైవ దర్శనాలు. వాహనాలు కొనుగోలు.

**కన్య :** వాహనయోగం. దూర ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సన్నిహితుల కలయిక.

**తుల :** అనారోగ్యం. ప్రతి విషయాలలో చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. ఖర్చులు పెరిగినా సమర్థవంతంగా తీరుస్తారు.

**ధనుస్సు:** భాగస్వామ్య వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వస్తు కొనుగోలు చేస్తారు.

**మకరం:** ఇంటిలో ప్రశాంతత వాతావరణం నెలకొంటుంది. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కుంభం:** కొత్తమిత్రులు పరిచయమవుతాయి. సంఘంలో ఆదరణ పొందుతారు. నూతన వస్తువులు కొనుగోలు.

**మీనం :** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వస్త్రా కొనుగోలు వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పోలీసుల అష్టదిగ్బంధనంలో
# ఉస్మానియా ఆస్పత్రి కొత్త భవన నిర్మాణానికి భూమిపూజ



శుక్రవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలోని స్థలంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన సముదాయ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, మేయర్ విజయలక్ష్మి తదితరులు

### పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్
### పోలీసు వలయంలో గోషామహల్ పరిసర ప్రాంతాలు
### బిజెపి, బిఆర్ఎస్ నాయకులను హౌస్‌అరెస్ట్‌లు చేసిన పోలీసులు
### శంకుస్థాపనలో కనిపించని బిజెపి ఎమ్మెల్యే టి.రాజాసింగ్, ఎంపి అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ (గోషామహల్), జనవరి 31, ప్రభాతవార్త:** రాష్ట్రం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు సత్వరవైద్యం అందేలా గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలోని 26 ఎకరాల 20 గుంటల స్థలంలో ఏర్పాటు చేసిన ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి వేద పండితుల మంత్రోచ్చరణతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభానుగుణంగా వచ్చే వందేళ్ల అవసరాలకు అనుగుణంగా 2వేల 700కోట్లతో నాలుగుబ్లాక్,12 అంతస్థుల కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నిర్మాణానికి సంబంధించి ఏవిషయంలోనూ రాజీపడొద్దని అధికారులకు సూచించారు. ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణాలతో పాటు టీచింగ్ స్టాప్, స్టూడెంట్స్ కు ప్రత్యేకంగా హాస్టల్ భవనాల నిర్మాణానికి సూచనలు చేశారు. పార్కింగ్, ల్యాండ్ స్కేప్ విషయంలోనే తగు జాగ్రత్తలు పాటించాలని సిఎం తెలిపారు. ఆసుపత్రికి రాకపోకలు సాగించేలా నలువైపుల్లా రహదారులు ఉండాలని, అసవరమైన చోట ఇతర మార్గాలను కలిపేలా అండర్‌పాస్‌లు నిర్మించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకుల వాహనాలు, నిలిపేందుకు వీలుగా అండర్ గ్రౌండ్‌లోని రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఉండేవిధంగా చూడాలని నిర్మాణం భాధ్యతలు చేపట్టే ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణాలకు సంబంధించిన నమూనాల్లో పలు మార్పులు చేర్పులను సిఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. పేషంట్ల కొసం విశాలమైన వెయిటింగ్‌హాల్స్ కనీసం రోజు మూడు వేల నుంచి 5వేల మంది పేషంట్లకు సరిపడా ఓపి కౌంటర్ల నిర్మాణం చేయాలని ఆదేశించారు. నయా ఉస్మానియాలో నర్సింగ్, డెంటల్, పిజియో థెరపి కాలేజీలు కూడా అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్‌కుమార్‌యాదవ్, తెలంగాణ వైద్య, విద్య సంచాలకులు నరేందర్‌కుమార్, ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్‌సాహాయ్, మాజీ సూపరిండెంటెంట్ డాక్టర్ నాగేందర్, ప్రొఫెసర్లు మనీషా సాహాయ్, తిమ్మారెడ్డి, మధుసూదన్, కృష్ణారెడ్డి, బి.రమేష్, లక్ష్మి, పాండునాయక్, పల్లంప్రవీణ్, ఆర్ఎంఓలు జయకృష్ణ, షరీఫ్, రఫీ, కవిత వైద్యాధికారులు పాల్గొన్నారు.

గోషామహల్ పోలీస్‌స్టేడియంలో కొత్త ఆసుపత్రి నిర్మాణానికి గోషామహల్ పరిసర ప్రాంతాల బస్తీవాసులు చాక్నవాడి, హిందీనగర్, కట్టెలమండి, గోషామహల్ తదితర బస్తీలు వాసులు పూర్తి వ్యతిరేకంగా ఉన్నారు. ప్రభుత్వం నిర్ణయం ప్రకటించినప్పటి నుంచి గోషామహల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటిగా ఏర్పాటు చేసుకుని ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారు. ఈప్రాంతంలో ఆసుపత్రి నిర్మాణం చేయడం ద్వారా స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని అనేక సార్లు కలెక్టర్, ఎమ్మార్‌రోలకు వినతిపత్రాలు సమర్పించారు. ఐన ప్రభుత్వం స్థానికుల విన్నపాలు పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం గోషామహల్ పోలీస్‌స్టేడియంలోని 26 ఎకరాల స్థలం తీసుకుని శుక్రవారం నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా భూమి చేసేందుకుగాను ప్రభుత్వం ప్రకటించడంతో భూమి పూజను అడ్డుకుంటామని గోషామహల్ పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ప్రకటించడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు ముందస్తుగా బిజెపి, బిఆర్ఎస్ నాయకులను హౌజ్ అరెస్ట్‌లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘ టనలు జరగకుండా పూర్తిగా గోషామహల్ పరిసరా ప్రాంతాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని అష్ట దిగ్బంధంలోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భూమి పూజచేసి వెళ్లేవరకు పోలీసుల వల యంలో గోషామహల్ పరిసరా ప్రాంతాలు ఉన్నాయి. అడుగడునా పోలీసులతోపాటు ఎస్.బి, టాస్క్‌ఫోర్స్, లాఅండ్‌అర్డర్, ఇంటలిజెన్స్ పోలీసుల నిఘానీడలో కొనసాగింది.



# మరో మ్యాచ్ ఉండగానే సిరీస్ కైవసం

### 15 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై భారత్ విక్టరీ

**పుణే, జనవరి 31:** ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ ఉండగానే సాధించింది. 3-1 తేడాతో సిరీస్‌ను భారత్ తనఖాతలో వేసుకుంది. పూణె వేదికగా జరిగిన కీలకమైన నాలుగో మ్యాచ్‌లో 15 పరుగుల తేడాతో విజయం సాధించింది. 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు 19.4 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌట్ అయింది. హ్యారీబ్రూక్ 26 బంతుల్లో ఐదుఫోర్లు,ర ఎండు సిక్స్‌లతో 51 పరుగులుచేసి అర్థశతకంతో పోరాటంచేసినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లలో హర్షిత్‌రాణా, రవిబిష్ణోయ్‌లు చెరో మూడు వికెట్లు తీసేయగా వరుణ్‌చక్రవర్తి రెండు, అక్షర్‌పటేల్, అర్ష్‌దీప్‌సింగ్ చెరొక వికెట్ తీసారు.

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లనష్టానికి 181 పరుగులుచేసింది. లక్ష్యఛేదనకు దిగిన ఇంగ్లండ్‌జట్టు ప్రారంభంలో దూకుడుగా ఆడినా తర్వాత నెమ్మదించింది. ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్ 23, డకెట్ 39 వరుసబౌండరీలతో కొంత వేగం పెంచినా ఈ జోడిని రవిబిష్ణోయ్ విడదీసాడు. జట్టుస్కోరు 62 పరుగులవద్ద భారీ షాట్‌కుయత్నించిన డకెట్ సూర్యకుమార్‌కు కాచౌట్ అయ్యాడు. ఆ తర్వాత మరో ఓపెనర్ సాల్ట్‌కూడా అక్షర్‌పటేల్‌చేతిలో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. తొలిడౌన్‌లో వచ్చిన బట్లర్‌ను రెండుపరుగులకే వరుణ్‌చక్రవర్తి పెవిలియన్‌కు చేర్చాడు. దీనితో ఒక్కసారిగా జట్టుకష్టాల్లోకిపోయింది.

తర్వాతక్రీజులోకి వచ్చినవారిలో ఓవర్టిన్ 19 పరుగులు తప్ప మిగిలినవారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. నాలుగోమ్యాచ్‌లో కూడా భారత్ టాప్ ఆర్డర్ మరోసారి విఫలం అయినా తర్వాత పుంజుకుంది. ఓపెనర్లు సంజుశాంసన్ ఒకటి, అభిషేక్‌శర్మ 29 తక్కువపరుగులకే ఔట్ అయ్యారు. తర్వాతక్రీజులోకి వచ్చిన తిలక్‌వర్మ సూర్యకుమార్ యాదవ్‌లు ఎలాంటిపరుగులుచేయకుండానే డకౌట్ అయ్యారు. ఒకే ఓవర్‌లోమూడు వికెట్లుతీసి మహమూద్ భారత్‌ను తీవ్రంగా దెబ్బకొట్టాడు. మూడో డౌన్‌లో క్రీజులోకి వచ్చిన రింకుసింగ్ 26 బంతుల్లో నాలుగుఫోర్లు ఒక సిక్స్‌తో 30 పరుగులుచేసి మెరిపించాడు. అయితేజట్టుస్కోరు 79వద్ద కార్స్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రషీద్‌కు చిక్కాడు. కానీ ఆల్‌రౌండర్లు శివమ్‌దూబే 34 బంతుల్లో ఏడుఫోర్లు రెండు సిక్స్‌లతో 53 పరుగులుచేసారు. హార్థిక్ పాండ్య 30 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 53పరుగులుచేసి పోరాడి అర్థశతకాలతో జట్టును గెలిపించారు.



నాగపూర్‌లో హైదరాబాద్ రంజీ ఆటగాళ్లతో హెచ్‌సిఎ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు, మహ్మద్ సిరాజ్ తదితరులు

# సెంచరీ హీరో తన్మయ్‌కు జగన్‌మోహన్‌రావు అభినందనలు

### 1 లక్ష నగదు బహుమతి ప్రకటన

**హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త:** తాజా రంజీ సీజన్‌లో నాలుగు శతకాలు, రెండు హాఫ్ సెంచరీలతో సాధించిన హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్‌ను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు అభినందించారు. శుక్రవారం నాగపూర్‌లో విదర్భతో జరుగుతున్న ఈ సీజన్ ఆఖరి రంజీ మ్యాచ్‌ను జగన్‌మోహన్ రావు ప్రత్యక్షంగా వీక్షించారు. హైదరాబాద్ ఆటగాళ్ల ప్రదర్శనను తిలకించి మ్యాచ్ అనంతరం జట్టుతో సమావేశమై వారి ఆటతీరుపై విశ్లేషించారు. గ్రూప్‌బిలో టాపర్‌గా ఉన్న విదర్భపై ఎలాగైనా గెలవాలని జట్టును జగన్‌మోహన్ రావు ఉత్తేజపర్చారు. ఈ సీజన్‌లో ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో 84.36 సగటుతో 928 పరుగులు చేసిన తన్మయ్ అగర్వాల్‌ను ప్రశంసించారు. తన్మయ్ త్వరలో టీమిండియాలోకి రావాలని ఆకాంక్షించారు. లీడింగ్ రన్ స్కోరర్‌గా ఉన్న తన్మయ్‌కు తన సొంత నిధులు నుంచి రూ.1 లక్ష నగదు బహుమతిని జగన్‌మోహన్ రావు ప్రకటించారు. ఇక, ఏడు మ్యాచ్‌ల్లో 33 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ ప్రదర్శనను కూడా కొనియాడారు. ఈ సీజన్‌ను హైదరాబాద్ విజయంతో ముగించాలని, ఆ బాధ్యతను కెప్టెన్ సీవీ మిలింద్, అంతర్జాతీయ పేసర్ మహ్మద్ సిరాజ్ తీసుకోవాలని సూచించారు. జట్టంతా సమష్టిగా రాణించి విజయంతో హైదరాబాద్‌కు రావాలని కోరారు.

# చెన్నైకి చేరువలో ఎస్ఎల్‌బిసి టన్నెల్‌బోరింగ్ మిషన్ బేరింగ్‌లు

### ఏప్రిల్‌లో మొదలుకానున్న ఔట్‌లెట్ తవ్వకాలు
### రోజుకు నాలుగుమీటర్ల సొరంగాన్ని తొలచనున్న ఒక్కో టిబిఎం
### ట్రయల్‌రన్‌తో ఇన్‌లెట్‌లో పనుల పునరుద్ధరణకు కసరత్తు
### షీర్‌జోన్‌లో ఇన్‌లెట్ తొలిచే పనులు
### ఇన్‌లెట్ సొరంగంలో నిమిషానికి పదివేల లీటర్ల బురదనీరు

**హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బిసి టన్నెల్ బోరింగ్ మిషన్ బేరింగ్‌లు అమెరికాలోని ఓహాయోలోని రాబిన్స్‌టన్నెల్ బోరింగ్ మెషనరీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీ నుంచి బయలుదేరి దాదాపు చెన్నైకి చేరువలోకి వచ్చాయి ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న బోరింగ్‌బేరింగ్, ఇతర స్పేర్‌పార్టులు భారత గడ్డపై కొద్దిగంటల్లో రాబోతున్నాయి. చెన్నై ఓడరేవు నుంచి ఏడు డయామీటర్ల పరిమాణం కలిగిన బెరింగ్ వచ్చే23 రోజులు ప్రయాణించి మన్నెవారిపల్లి చేరు కొనున్నది. ఔట్‌లెట్ టన్నెల్ బోరింగ్‌కు దీనిని అమర్చడానికి సుమారు నెలరోజులు సమయం పట్టే అవకాశం ఉంది. మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో మన్నెవారిపల్లి వైపు పనులు షురూ అవుతాయి. ఆగస్టు12న ఆర్‌అండ్‌బి మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి రాబిన్స్ టన్నెల్ బోరింగ్ మెషినరీ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ సిఇవో లాక్‌హోంతో సమావేశమై టన్నెల్ తవ్వకానికి ప్రతిబంధకంగా మారిన బేరింగ్‌తో పాటు ఇతర కటింగ్ స్పేర్‌పార్టులు సమకూర్చాలని ఆదేశాలు జారీచేశారు. తవ్వకానికి సంబదించిన స్పేర్‌పార్టులు ఆలస్యం చేయకుండా సరఫరా చేయాలని లాక్‌హోంతో జరిగి సమావేశంలో వెంకటరెడ్డి సూచించడంతో ఆ కంపెనీ కూడా అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటిని షిప్పింగ్ చేశారు. టన్నెల్ బోరింగ్ బేరింగ్‌లు భారత జలాల్లోకి వచ్చాయన్న విషయం తెలియగానే మూడేళ్ళ తరువాత ఎస్ఎస్‌బి సొరంగం పనుల తవ్వకంకు ట్రయల్‌రన్ పనులు ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. ఇన్‌లైట్‌లెట్ సొరంగంలో నిమిషానికి పదివేల లీటర్ల నీరు వస్తుండటంతో బురదమయంగా మారుతూ పనులను ఆటంకం కలిగిస్తున్నది. శ్రీశైలం ఎడమగట్టు ప్రాజెక్టులో 44.5 కి.మి మేరకు సొరంగ నిర్మాణం ఉంటుంది. 2004లో వైఎస్ రాజేశర్‌రెడ్డి ముఖ్య మంత్రిగా సొరంగం తవ్వకాలకు శంకుస్థాపన చేశారు. శ్రీశైలం రిజర్వాయర్ వైపు నుంచి ఒక టన్నెల్ బోర్ మిషదోమలపెంట నుంచి సొరంగంను(దీనిని ఇన్‌లెట్ వ్యవహరిస్తారు) తొలుస్తుంటే మరొకటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేసిన మన్నెవారిపల్లి నుంచి టన్నెల బోర్ మిషన్ సొరంగం తొలుస్తుంది. వైఎస్ శంకుస్థాపన చేసిన రోజుల్లో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1925కోటులన గా ఉండేది. జెపి సంస్థకు ఐదేళ్ళలో అంటే 2009లో పూర్తి చేయాలని కాంట్రాక్టు పనులు అప్పగించారు. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యేనాటికి కూడా ఆనాటి పాలకులు సొరంగం తవ్వుతూనే ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌లెట్‌లో 14కిమి సొరగం తొలిచే పనిపూర్తిచేయగా ఔట్‌లెట్‌లో 21కి.మి తొలిచారు. ఔట్‌లెట్‌వైపు టన్నెల్ బోర్‌వెల్ మిషన్ రిపేరు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఔట్‌లెట్ వైపు నుంచి 21కిమి తొలిచారు. ఇన్‌లెట్‌లో 14 కి.మి తొలిచారు. ఇంకా 9.5 కి.మి సొరంగం తవ్వాల్సి ఉంది. రోజుకు నాలుగు మీటర్ల మాత్ర మే టిబిఎం తొలుస్తుంది. నెలకు 200మీటర్లు సొరంగం తవ్వుతారు. మూడేళ్ళ విరామం తర్వాత ఎస్ఎల్‌బిసి ఇన్‌లెట్ ట్రయల్ పనులు గురువారం చేశారు. టిబిఎం "షీర్‌జోన్ " తవ్వకం చేస్తుండటంతో సొరంగంలో నిమిషానికి పదివేల లీటర్ల నీరు ఊటగా ఉబికి వస్తుండటంతో బురద వల్ల పనుల వేగం జాప్యం అవుతోన్నది. దీనితో 74 ఎంఎం హోల్స్ 18 మీటర్‌వరకు చేసి32ఎంఎం స్టీల్ రాడ్ ఉపయోగించి పాలియురేతేన్‌గ్రౌట్ చేసి బురుద ఊటను నిలుచేయనున్నారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయానికి ఇంకెంత సమయం కావాలి?

### అసెంబ్లీ స్పీకర్‌ను సూటిగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి ఇంకెంత సమయం కావాలంటూ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. సుప్రీం కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంటీ? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా? అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ , తెల్ల వెంకటరావుపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద ఈ పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్‌పై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి కడియం, దానం నాగేందర్, తెల్ల వెంకటరావు సహ పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. దీనిపై జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ ధర్మాసనం విచారణ జరిపింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెల్లం, కడియం, దానంపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై నాలుగు వారాల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్ వేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తెలంగాణ స్పీకర్ కనీసం నోటీసు ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

# టకీటకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నయ్

### కాంగ్రెస్ రైతు భరోసాపై మాజీమంత్రి కెటిఆర్ సెటైర్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** టకీ టకీ మని పైసలు పడుతయన్నారు.. కానీ, టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నా యని కాంగ్రెస్ రైతు భరోసాపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. సమైక్య రాష్ట్రంలో మున్సిపాలిటీలు మురికి కూపాలుగా ఉండేవని.. బల్దియాలు అంటే ఖాయా.. పియా.. చల్దియా.. అనే సామెత ఉండేది అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కేటీఆర్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక కేసీఆర్ పట్టణాల అభివృద్ధి కోసం ప్రత్యేక విజన్‌తో పని చేయాలని దిశా నిర్దేశం చేశారన్నారు. అందుకే ఆర్థిక ఇంజిన్లుగా ఉన్న పట్టణాలను, వాటిని సమగ్రంగా డెవలప్ చేయాలని అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. పట్టణాల విస్తరణ ఆపడం వీలు కాదు.. కానీ ప్రభుత్వాలకు వాటిని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి మాత్రం అవకాశం ఉంటుందన్నారు. అందుకే ఆ దిశగా పదేళ్లు పనిచేశామన్నారు. చేసిన పనిని అభివృద్ధి నివేదికల రూపంలో ప్రజల ముందుంచామన్నారు. పదేళ్ల పాటు జరిగిన పట్టణాలు అభివృద్ధి కేవలం డైలాగులు కొడితే కాలేదన్నారు. పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ అవసరమైన నిధులు అందించడం తదితర నిరంతర ఫోకస్‌తోనే తెలంగాణలోని పట్టణాలు ఈ రోజు మోడల్ పట్టణాలుగా తయారయ్యా యన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్లలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. గత పది సంవత్సరాలుగా మున్సిపల్ చైర్‌పర్సన్లు కౌన్సిలర్లుగా పట్టణాల అభివృద్ధి కోసం పని చేశారన్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి పూర్తి చేశారని చెప్పారు. పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని.. మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పరిపాలన వికేంద్రీకరణ కార్యక్రమాలు చేపట్టామన్నారు. కొత్త జిల్లాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు పరిపాలన మరింత దగ్గరైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా పెరిగిందన్న కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాలు అభివృద్ధి కుంటుపడడంతో పాటు ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన కొత్తగా కట్టాల్సింది పోయి హైడ్రా, మూసి ప్రాజెక్టుల పేరుతో కూలగొడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని నడిపే వారి ఆలోచనలు సానుకూలంగా ఉంటే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గతంలో నల్లగొండ పట్టణాన్ని సమూలంగా అభివృద్ధి చేసిన మనల్ని కాంగ్రెస్ మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని.. కానీ అదే నల్లగొండ పట్టణంలో నాలుగు నెలలుగా సిబ్బందికి జీతాలు లేకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నల్లగొండ పర్యటన తర్వాత నన్ను బచ్చగాడు అంటున్న మంత్రి.. సీనియర్ అయ్యుండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# 'సంక్షేమా'నికి ఎన్నికల బ్రేక్!

### నిలిచిపోనున్న రైతు, ఆత్మీయ భరోసా?
### తమకెప్పుడా అని అర్హుల ఎదురుచూపు

**హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త :** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించిన నాలుగు సంక్షేమ పథకాలకు బ్రేక్ పడే అవకాశం ఏర్పడింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 26వ తేదీన నాలుగు కొత్త పథకాలను ప్రారంభించింది. వాటిలో రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇళ్ల పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని అన్ని మండలాల్లో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఆ గ్రామంలో అర్హులైన వారికి ఈ నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేయడం ప్రారంభించింది. వీటిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా పథకాలు తమకు ఎప్పుడు దక్కుతుందోనని అర్హులందరూ ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ ఎన్నిల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇప్పుడు ఈ పథకం అమలుకు కోడ్ అడ్డంకిగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఎన్నికల కోడ్ రాక ముందే పథకాలు ప్రారంభమైన నేపథ్యంలో ఎలాంటి ఆటంకం ఉండదని గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు చెబుతున్నారు.

కానీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సైతం ఎన్నికల కోడ్ కారణంగా అప్పటికే ప్రారంభించిన పథకాలను ఎన్నికల కమిషన్ నిలిపివేసింది. దీంతో ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో ఆయా పథకాల అమలుపై గందరగోళం ఏర్పడింది. కాగా పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండలానికో పంచాయతీని ఎంపిక చేసి, ఆయా పథకాలను ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసాకు సంబంధించి ఒక్కొక్కరి అకౌంట్‌లో రూ.6 వేల చొప్పున నిధులు విడుదల చేశారు. ఇక 32 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన 563 మండలాలకు చెందిన 577 గ్రామాలలోని 4,41,911 మంది రైతులకు సంబంధించి 9,48,333 ఎకరాల భూమికి గాను వారి ఖాతాలలో మొత్తం రూ.569 కోట్లు రైతు భరోసా కింద జమ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆత్మీయ భరోసా కింద ఉపాధి హామీ పథకంలో గత ఏడాది ఇరవై రోజులు పని చేసిన, భూమి లేని వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తున్నారు. అలాగే స్లాబు మినహా రేకులు, గూన, తడకలు, ఇలా ఎలాంటి ఇల్లు ఉన్నా వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారి జాబితాలను ప్రకటించగా, రానివారు దరఖాస్తులు చేశారు. ఆ వివరాలను ప్రస్తుతం అంతర్జాలంలో ఎంటర్ చేస్తున్నారు. వీటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో తాజాగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ కొత్త పథకాలు అమలవుతాయా లేదా అనేదానిపై గందరగోళం నెలకొంది.

# మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దత్తత

### దేశ్‌పాండే ఫౌండేషన్ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం ఫౌండేషన్ పని చేస్తున్నది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఫౌండేషన్ ఆంగ్లంలో శిక్షణ ఇస్తున్నది. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి పనిచేస్తున్నది. రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణకు ప్రభుత్వ సహకారం కావాలని కోరుతూ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలోని కస్తుర్బా బాలికల పాఠశాల్లో పని చేయాలని సూచించారు. మహబూబ్ నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు ఫౌండేషన్ సభ్యులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు ,సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురురాజ్ దేశ్ పాండే ,జయ శ్రీ దేశ్ పాండే, రాజు రెడ్డి, జి.అనిల్ పాల్గొన్నారు.

# వారం కిందట తల్లి మరణం..

### దహనసంస్కారం చేయకుండా మృతదేహంతో గడిపిన కుమార్తెలు
### ఆర్థిక ఇబ్బందులే కారణం



లలిత (ఫైల్)

**హైదరాబాద్ (సికిందరాబాద్), జనవరి 31, ప్రభాతవార్త:** అకస్మాత్తుగా తల్లి చనిపోవడంతో ఆమే ఇద్దరు కుమార్తేలు మానిసికంగా కుంగిపోయేలా చేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో తల్లి మృతదేహంతో ఆకే ఇంట్లో నాలుగు రోజులుగా ఉండిపోయారు. ఈ హృదయవిదారక ఘనట వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... వారాసి గూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బౌద్ధనగర్‌లో లలిత (45) కరోనా సమయంలో ఆమే భర్త కుటుంబాన్ని వదిలి ఎటో వెళ్లిపోయాడు. దీంతో ఆమే ఇద్దరు కుమార్తేలతో కలిసి ఉంటోంది. గతక కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికి ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స కూడా తీసుకన్నట్లు లేదని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్యంతో లలిత జనవరి 23న మృతిచెందింది. అప్పటికే మానసికంగా ఇబ్బంది పడుతున్న కుమార్తేలు తల్లి మరణంతో మరింత మానసికంగా కుంగిపోయారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేక తల్లి మరణవార్తను ఎవరికి చెప్పలేదు. ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు లలిత మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలిచారు. లలిత మరణం విషయం కుమార్తేలను పోలీసులు ప్రశ్నించగా జనవరి 23న లలిత మరణించినట్లు తెలిపారు. వారి మానసిక స్థితిని పోలీసులు వారి పరిస్థితిని అర్థం చేసుకున్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హరీశ్‌ను పక్కన కూర్చోబెట్టుకొని బెంజ్ కారు నడిపిన కెసిఆర్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 31:** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన మేనల్లుడు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావును మెర్సిడెస్ బెంజ్ కారులో వెంటబెట్టుకొని వచ్చారు. హరీశ్ రావును తన పక్కనే ముందు సీట్లో కూర్చోబెట్టుకుని కేసీఆర్ స్వయంగా కారు నడుపుకుంటూ ఫాంహౌస్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఆయన జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో తన ఫాంహౌస్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి హరీశ్ రావు, సునీతా లక్ష్మారెడ్డి సహ పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి కేసీఆర్ స్వయంగా కారు నడుపుకుంటూ రాగా, డ్రైవింగ్ సీటు పక్కన హరీశ్ రావు కూర్చోవడం విశేషం.

# కొత్త కరెన్సీని తెస్తే 100% సుంకాలు తప్పవు

## బ్రిక్స్ కూటమికి యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు

**న్యూఢిల్లీ, జనవరి 31:** డాలర్ కరెన్సీ రూపేణా బ్రిక్స్‌దేశాల్లో కొత్తకరెన్సీని అమలుకు తెస్తే అమెరికా సుంకాలు తప్పవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. నూరుశాతం వారి ఎగుమతులపై సుంకాలు వేస్తామని అంతర్జాతీయ ట్రేడ్‌లో డాలర్‌కు ప్రత్యామ్నాయంగా కరెన్సీని తీసుకొస్తే సుంకాలు తప్పవని స్పష్టం చేసారు. అంతర్జాతీయంగా డాలర్ వినియోగాన్ని తగ్గించాలని చూస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, బ్రిక్స్ దేశాలు ప్రపంచ వాణిజ్యంలో అమెరికా డాలర్ స్థాయిని పరిగణన లోనికి తీసుకోవాలని లేదంటే ఆర్థిక పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించారు. డాలం రూపేణా వాణిజ్య లావాదేవీల నుంచి వైదొలగాలని బ్రిక్స్ దేశాలుచూస్తున్నాయని ఇప్పటికే మేం నిశితంగా గమనిస్తున్నామని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో ప్రకటించారు. బ్రిక్స్‌దేశాలు కొత్తగా కరెన్సీని తీసుకురాబోమని, లేదా మరో కరెన్సీని డాలర్‌కు ప్రత్యామ్నాయంగా అమలుకు తీసుకురాబోమని లిఖితపూర్వకంగా తెలియజేయాలని లేదా బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాలని సూచించారు. అలాంటి ప్రయత్నాలే ఈ దేశాల కూటమి చేస్తే ట్యారిఫ్‌కు హలో చెప్పాల్సిందేనని, అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి ఉంటుందని వెల్లడించారు. బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలున్న సంగతి తెలిసిందే. డాలర్‌పై ఆధారపడటం రానురాను తగ్గించాలని ఈ దేశాలకూటమి అనేక సమావేశాల్లో చర్చించింది. పాశ్చాత్యదేశాల ఆంక్షలు పెరుగుతున్నకొద్దీ తమ దేశాలు డాలర్‌పై ఆధారపడటం ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర కాలం నుంచి అమెరికా రష్యాపై మరిన్ని ఆంక్షలు ప్రకటించింది. ఇటీవలి కాలంలోనే బ్రిక్స్ కూటమి విస్తరించింది. ఈజిప్టు, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలను కూటమిలోకి ఆహ్వానించింది. వాస్తవానికి బ్రిక్స్‌ప్లస్ కూటమికి



ఒకే కరెన్సీ అంటూ ఏదీలేదు. వారివారి స్థానిక కరెన్సీల్లోనే ఈ దేశాలు వాణిజ్యం చేస్తున్నాయి. 2023లో జరిగిన 15వ బ్రిక్స్ సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డాలర్‌పై ఆధారపడటం తగ్గించాలని బ్రిక్స్ దేశాలు తమతమ దేశాల కరెన్సీల్లోనే లావాదేవీలు చేసే విధానం అమలుకు తీసుకురావాలని, ఇందుకోసం ఆదేశాల సెంట్రల్ బ్యాంకులు నుంచి సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు ప్రకటించారు. ఇప్పటికీ డాలర్ ప్రపంచంలోనే అత్యంత చెలామణీలో ఉన్న కరెన్సీగా సాగుతోంది. అట్లాంటిక్ మండలి జియో ఎకనమిక్ సెంటర్ గత ఏడాది తన అధ్యయనంలో యూరోపియన్ కరెన్సీ యూరో కానీ, బ్రిక్స్‌ప్లస్ దేశాలు డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలుచేస్తున్నాయని ప్రస్తావించింది. ఇపుడు ట్రంప్ అధికారంలోకి వచ్చినతర్వాత డాలర్‌కరెన్సీ వాడకం తగ్గించాలని చూస్తే 100శాతం సుంకాలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాలు అధికంగా వినియోగిస్తే అక్రమ వలసలు, డ్రగ్స్ అక్రమరవాణా, ప్రత్యేకించి అమెరికాలోకి ఫెంటానిల్ రాకను కట్టడిచేయగలమని చెపుతున్నారు. అయితే సుంకాలు పెంచడంవల్ల అమెరికా వినియోగదారులు, వ్యాపార సంస్థలకు వ్యాపారం దెబ్బతింటుందని పరిశ్రమలు ఎక్కువగా దిగుమతి ఉత్పత్తులపైనే ఆధారపడతాయని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు.



# నియంతలపై ప్రేమ లేదు

## అమెరికా కొత్త ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్

**వాషింగ్టన్, జనవరి 31:** తనకు నియంతలపై ఎలాంటి ప్రేమ లేదని యుఎస్ నూతన ఇంటెలిజెన్స్ అధికారి తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఆమెను నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆ పదవీబాధ్యతలు చేపట్టబోయే ముందు తులసి యుఎస్ సెనేటర్ల ఎదుట హాజరయ్యారు. డెమోక్రట్లు, రిపబ్లికన్ల నుంచి ఎదురైన ఎన్నో కఠిన ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ అసద్, గడాఫీ, మరే ఏ ఇతర నియంతలపైనా తనకు ప్రేమ లేదని, అల్‌ఖైదాను ద్వేషిస్తానని వెల్లడించారు. అసద్ తన సొంత ప్రజలపైనే రసాయన ఆయుధాలను వినియోగించిన ఘటనను తులసి ఖండించారు. ఉగ్రవాదాన్ని, దానిని ప్రోత్సహించే నేతలను తాను ఏమాత్రం ఉపేక్షించనని పేర్కొన్నారు. డిఎన్ఐ డైరెక్టర్‌గా అమెరికా ప్రజల భద్రత, స్వేచ్ఛను కాపాడడానికి, సైన్యాన్ని మరింతపటిష్టం చేయడానికి తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. అమెరికాలోని మొత్తం 18 నిఘా సంస్థలు డిఎన్ఐ హోదాలో ఉన్న తులసి పర్యవేక్షణలో పనిచేస్తాయి. ప్రపంచంలో ఏ మారుమూల ఏం జరిగినా ఇవిసేకరిస్తాయి. చివరికి సిఐఎ అధిపతి కూడా ఆమెకు రిపోర్టుచేస్తారు. నిఘా సమాచారాన్ని క్రోడీకరించి రోజువారీ కీలక విషయాలను ఆమె అధ్యక్షుడికి వెల్లడిస్తారు. 9/11 దాడుల తర్వాత ఏర్పడిన కమిషన్ సూచనల మేరకు ఏర్పాటు చేసిన అత్యంత కీలక పదవి ఇది. 2019లో డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడ్డారు. కానీ, ఆ తర్వాత బైడెన్‌కు మద్దతు పలికారు. నాడు హిల్లరీ క్లింటన్ ఆమెను ఏకంగా రష్యా ఏజెంట్ అంటూ విమర్శలు గుప్పించారు. దీనికి తులసి స్పందిస్తూ.. 'యుద్ధోన్మాదుల అవినీతి స్వరూపంగా' హిల్లరీని అభివర్ణించడం సంచలనం రేపింది. 2024 పోలింగ్‌కు కొన్ని వారాల ముందు రిపబ్లికన్ పార్టీ చేరారు. యుద్ధాలను వ్యతిరేకించే ట్రంప్ తన భావాలకు దగ్గరగా ఉండటంతో చేరినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కూడా దూకుడుగా రిపబ్లికన్ల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. కమలతో చర్చా కార్యక్రమంలో ట్రంప్‌నకు చేదోడువాదోడుగా వ్యవహరించారు. తనపై దాడికి ఇంటెలిజెన్స్ వైఫల్యమే కారణమని ట్రంప్ బలంగా విశ్వసించారు. అందుకే తులసికి ఆ విభాగాన్ని అప్పజెప్పారు.

## మాలిలోని బంగారు గనిలో విరిగిపడిన కొండచరియలు 10 మంది దుర్మరణం

**బమాకో, జనవరి 31:** పశ్చిమ ఆఫ్రికాలోని మాలి దేశంలో ఘోర ప్రమాదం జరిగింది. బంగారు గనిలో కొండచరియలు విరిగిపడటంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. కౌలికోరో ప్రాంతంలోని బంగారు గనిలో బుధవారం ఈ ఘటన జరిగిందని అక్కడి గవర్నర్ కల్నల్ లామైన్ కపోరీ సనాగో పేర్కొన్నారు. 'గనిలో తవ్వకాలు చేస్తుండగా ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో బంగారం వెతుకులాటకు వెళ్లినవారిలో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారు. గనిలోకి బురదనీరు ప్రవేశించి వారిని చుట్టుముట్టింది. మరికొంతమంది శిథిలాల కింద చిక్కుకొనిపోయారు. వారిని రక్షించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది' అని గవర్నర్ వెల్లడించారు. ఆఫ్రికా దేశాల్లో మూడో అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా మాలి ఉంది. ఈ దేశంలో గనుల ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. గతేడాది సైతం ఇదే ప్రాంతంలోని కంగబా జిల్లాలో బంగారు గని కుప్పకూలింది. ఈ ఘటనలో 70 మందికిపైగా మృత్యువాత పడ్డారు.

## బానిసల పిల్లల కోసం ఆ పౌరసత్వం..

# ప్రపంచమంతా ఎగబడితే ఎలా?: ట్రంప్

**వాషింగ్టన్, జనవరి 31:** అమెరికా అధ్యక్ష పదవిలోకి వచ్చీ రాగానే డొనాల్డ్ ట్రంప్ పదులకొద్దీ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. అందులో ఒకటి జన్మతఃపౌరసత్వం లభించే హక్కును రద్దు చేయడం..! ఇది కాస్త వివాదాస్పదం కావడంతో న్యాయస్థానం ఆ ఉత్తర్వులను నిలిపివేసింది. ఈ క్రమంలోనే తాజాగా ట్రంప్ దీనిపై స్పందించారు. బానిసల పిల్లల కోసమే తొలినాళ్లలో జన్మతఃపౌరసత్వాన్ని తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. 'ఒకసారి గతాన్ని గుర్తు చేసుకుంటే బానిసల పిల్లలకు హక్కులు కల్పించాలనే ప్రాథమిక ఉద్దేశంతో జన్మతఃపౌరసత్వాన్ని అప్పట్లో ఆమోదించారు. అంతేకగానీ ప్రపంచ జనాభా మొత్తం వచ్చి అమెరికాలో పోగుపడటం కోసం ఆ చట్టాన్ని తీసుకురాలేదు. చాలామంది మన దేశానికి వస్తున్నారు. అర్హత లేని వ్యక్తులు ఈ చట్టాన్ని ఉపయోగించుకుంటున్నారు. దీంతో అర్హత లేని పిల్లలకు పౌరసత్వం లభిస్తోంది. ఈ చట్టం అందుకోసం కాదు. చాలా గొప్ప ఉద్దేశంతో బానిసల పిల్లల కోసం తీసుకొచ్చినది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై తాను సుప్రీంకోర్టుకు వెళ్తానని చెప్పారు. అక్కడ తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని వంద శాతం విశ్వాసంతో ఉన్నట్లు పేర్కొన్నారు. అమెరికా రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం తల్లిదండ్రుల వలసస్థితితో సంబంధం లేకుండా అమెరికాలో జన్మించిన వారందరికీ పౌరసత్వం లభించే విధానం అమల్లో ఉంది. ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజునే జన్మతః పౌరసత్వం లభించే హక్కును రద్దు చేసేలా కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. దీనిపై డెమొక్రాట్లు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాలు 5 దావాలు వేశాయి.

అందులో ఒక దానిపై ఇటీవల సియాటిల్‌లోని ఫెడరల్ కోర్టు తీర్పు వెలు వరించింది. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని దాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తు న్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.

# కిన్నెర అఖాడా నుంచి మమతా కుల్‌కర్ణి బహిష్కరణ

## ఇటీవలే దీక్ష తీసుకొన్న కుల్‌కర్ణి



**ప్రయాగ్‌రాజ్, జనవరి 31:** మహాకుంభమేళా ప్రారంభంలో ప్రాపంచిక జీవనాన్ని పరిత్యజించి, సన్యాసినిగా మారిన ప్రముఖ బాలీవుడ్ నటి మమతాకులకర్ణి (52), కిన్నర అఖాడా నుంచి బహిష్కరణకు గురయ్యారు. మహామండలేశ్వర్‌గా ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేశారు. పలువురు మతపెద్దలు, అఖాడాల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖాడాలు వెల్లడించారు. అంతేకాదు ఆమెను అఖాడాలో చేర్పించిన కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని సైతం అఖాడా నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. కిన్నెర అఖాడాలో కులకర్ణి చేరిక తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు చెలరేగాయి. అఖాడాలో చేరిన మొదట్లోనే ఆమె అత్యున్నత స్థానమైన మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి మహామండేశ్వర్ హోదాను పొందడాన్ని పలువురు వ్యతిరేకించారు. మహా కుంభమేళా పవిత్రమైన ఆధ్యాత్మిక కార్యక్రమమని, కానీ కొందరు వ్యక్తులు ఇందులో అసభ్యతను ప్రోత్సహిస్తున్నారంటూ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ మండిపడ్డారు. ఇప్పటివరకు ప్రాపంచిక సుఖాల్లో మునిగిపోయిన వ్యక్తులు ఒక్కసారిగా సన్యాసులుగా మారిపోయి మహామండలేశ్వర్ వంటి బిరుదులను కూడా పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అఖాడా వ్యవస్థాపకులు అజయ్ దాస్, కులకర్ణి గురువు లక్ష్మీనారాయణ్ త్రిపాఠి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి. అజయ్‌దాస్ అఖాడా నుంచి బయటకు వెళ్లి, తన కుటుంబంతో నివసిస్తున్నారని, కిన్నెర అఖాడా నియమాల ప్రకారం కుటుంబంతో ఉన్నవారికి ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అధికారం లేదని త్రిపాఠి పేర్కొన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమెపై బహిష్కరణ వేటు వేసినట్లు తెలుస్తోంది. 90వ దశకంలో బాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న నటి మమతాకులకర్ణి 2003 తర్వాత సినిమాల నుంచి తప్పుకొని, విదేశాలకు వెళ్లిపోయారు. ఈ క్రమంలోనే డ్రగ్స్ రాకెట్‌లో ఆమె పేరు వినిపించింది. పోలీసులు నోటీసులు సైతం పంపారు. ఇన్నేళ్ల తర్వాత కుంభమేళ సందర్భంగా భారత్‌కు వచ్చిన ఆమె అందరినీ ఆశ్చర్యపరుస్తూ కిన్నెర అఖాడాలో చేరి తన పేరును 'మాయీ మమతానంద్ గిరి'గా మార్చుకున్న విషయం తెలిసిందే.

# రాష్ట్రపతి ఎంతో అలిసిపోయారు..

## సోనియా వ్యాఖ్యలపై బిజెపి, విపక్షాల మధ్య దుమారం



**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంపై సోనియా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రాష్ట్రపతి హోదాను విస్మరించి ప్రథమ మహిళను కించపరిచేటట్లు ఉన్నాయని, సోనియా రాహుల్, ప్రియాంక వంటి నాయకులకు ఇలాంటి వ్యాఖ్యలు తగదని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన సోనియాను మీడియా పలకరించింది. దీనితో ఆమె మాట్లాడుతూ ప్రసంగం చదువుతూ రాష్ట్రపతి బాగా అలిసిపోయారు. అందువల్లనే పూర్తి స్థాయిలో చదవలేకపోయారని పేర్కొన్నారు. ప్రసంగం ఆసాంతం స్పష్టంగా చదవలేకపోయారని సోనియా అన్నారు. దీనితో ఒక్కసారిగా బిజెపి సభ్యులు ధ్వజమెత్తారు. అభ్యంతరకర వ్యాఖ్యలని వెంటనే క్షమాపణలుచెప్పాలని డిమాండ్‌చేసారు. బిజెపి సభ్యుఉరాలు సుకాంత మజుందార్ మాట్లాడుతూ సోనియా వంటి నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదని చెప్పారు. ఆదివాసి మహిళ నేడు రాష్ట్రపతిగా ఉన్నందున సామ్రాజ్యవాద స్ఫూర్తితో ఉన్న ఆ కుటుంబానికి నచ్చదని అందుకనే ఇలా అవమానకరంగా మాట్లాడుతున్నారరన్నారు. సోనియా వ్యాఖ్యలపై రాష్ట్రపతి భవన్‌నుంచి కూడా ప్రత్యేకప్రకటన వెలువడింది. ప్రసంగం ఆసాంతం రాష్ట్రపతి ఎక్కడా అలిసిపోలేదని మహిళలు, రైతులు, ఇతర అణగారిన వర్గాలపై ప్రసంగించేందుకు ఎక్కువ ఆసక్తి చూపించారన్నారు. దేశీయభాషల్లో సూక్తులు బహుశా ఈ నేతలకు తెలియకపోవచ్చని దీనివల్ల తప్పుడు ప్రభావం పడుతోందన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు దురదృష్టకరమని ఎంతమాత్రం ఆమోదనీయం కాదని రాష్ట్రపతి భవన్ ప్రకటన వెలువరించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు చేసిన వ్యాఖ్యలు ఈ అత్యున్నత భవన్ హోదాను, హుందాతనాన్ని కించపరిచినట్లుందని ప్రకటనలో వివరించారు. సోనియా వ్యాఖ్యలపై బిజెపి చీఫ్ జెపి నడ్డా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రసంగంలో చెప్పిందే చెపుతూ వచ్చారని ఎఐసిసి నాయకుడు రాహుల్ గాంధీకూడా వ్యాఖ్యలు చేసారు. పైగా సోనియా వ్యాఖ్యలపై రాహుల్ ఆమెకు మద్దతిచ్చారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ ఆదివాసీ మహిళ అయిన ముర్ము ఎంతమాత్రం తగ్గిపోరని దేశం కోసంఎంతో కృషి చేసారన్నారు.



# చిన్నారుల కోసం నిపుణ్ భారత్ ఇనీషియేటివ్

## ఆర్థిక సర్వేలో అనంత నాగేశ్వరన్ ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** కేంద్ర బడ్జెట్ నేడు ప్రవేశపెడుతున్న తరుణంలో ఆర్థికసర్వేను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. భారత్ ఆర్థికపని తీరుతోపాటు భవిష్యత్తు పరిణామాలకు ఈ నివేదిక పునాదులు వేసింది. 2026లో మూడో తరగతి పూర్తి చేసుకునే ప్రతి చిన్నారికి సమగ్ర అక్షరాస్యత కల్పించేందుకు నిపుణ్ భారత్ ఇనీషియేటివ్‌ను ఈ సర్వే ప్రధానంగా చూపింది. ఈ కార్యాచరణతో చిన్నారులకు అవగాహన పెంచడం ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యలపై పూర్తి అవగాహన కల్పించేందుకు నిర్ణయించారు. విద్యా సవాళ్లను పరిష్కరించడం, దేశవ్యాప్తంగా అభ్యాసన నైపుణ్యాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలకం అవుతుందని అన్నారు. ఆర్థిక సర్వేలోపేర్కొన్న విధంగా బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో విజయవంతమైన నిర్దిష్ట కార్యక్రమాలను సిఇఎ హైలైట్ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉండబోయే కొన్ని కీలకాంశాలు కింది విధంగా ఉంటాయని నిపుణులు అంచనావేస్తున్నారు. ఉపాధ్యాయులకు బేసిక్ నైపుణ్యాలను చిన్నారులకు అందించేందుకు సమగ్ర శిక్షణ ఇస్తారు. ప్రాథమిక దశనుంచే అక్షరాస్యత, సంఖ్యలపై నైపుణ్యత ప్రాధాన్యతను తెలిపే పాఠ్యప్రణాళికలు రూపొందించి అమలు చేయడం, పిల్లల అభ్యాసనకు మద్దతిచ్చేందుకు విద్యాప్రక్రియలో సమాజం, తల్లితండ్రులు భాగస్వాములను చేయడం, ఈ బేసిక్‌నైపుణ్యాల్లో విద్యార్థుల పురోగతిని పర్యవేక్షించేందుకు వాటిని అంచనావేయడానికి బలమైన వ్యవస్థలను ఏర్పాటుచేయడం వంటివి అవసరమని ఆర్థికసర్వేలో ప్రధాన ఆర్థికసలహాదారు అనంత నాగేశ్వరన్ ప్రస్తావించారు.

# పార్లమెంటు ఉభయసభలు నేటికి వాయిదా




**న్యూఢిల్లీ, జనవరి 31:** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం రోజున రాష్ట్రపతి ప్రసంగం అనంతరం ఉభయసభలు శనివారానికి వాయిదాపడ్డాయి. పార్లమెంటులో రాష్ట్రపతి ఉభయ సభలనుద్దేశించి తొలిరోజు ప్రసంగించారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌కు ముందు ప్రతి ఏటా ప్రవేశపెట్టే ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్‌ఓంబిర్లా ప్రకటించారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి ఆర్థికసర్వేను రాజ్యసభముందుకు తీసుకెళ్లారు. రాజ్యసభలో ప్రవేశపెట్టిన తర్వాత ఛైర్మన్ ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌కర్ సభను శనివారానికి వాయిదా వేసారు. దీనితో పార్లమెంటు ఉభయసభలు శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతాయి. అదేరోజు ఆర్థికమంత్రి 2025-26 సంవత్సర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాలు శుక్రవారంనుంచి ప్రారంభం అయిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 4వరకూ రెండు విడతల్లో బడ్జెట్ సమావేశాలు జరుగుతాయి. మొదటి విడత సమావేశాలు ఫిబ్రవరి 13వ తేదీతోముగుస్తాయి. తర్వాత మార్చి 10వ తేదీ ప్రారంభం అయి ఏప్రిల్ 4 వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాల్లోనే 16 బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. వక్ఫ్‌సవరణ బిల్లు, బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు, రైల్వే సవరణబిల్లు, విపత్తునిర్వహణ బిల్లులతోపాటు వలస, విదేశీయుల బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది.

# ఎక్కువ పనిగంటలు ఆరోగ్యానికి హానికరం

## ఆర్థిక సర్వేలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జనవరి 31:** ఆఫీసు పనిగంటల చర్చ దేశవ్యాప్తంగా నడుస్తున్న తరుణంలో ఆర్థిక సర్వే హెచ్చరించింది. వివిధ అధ్యయనాల నివేదికలను ఇందులో ప్రముఖంగా ప్రస్తావించింది. ఆర్థికసర్వే 2024-25 ప్రకారం ఆఫీసుల్లో ఎక్కువసేపు గడపడం వల్ల మానసిక





మంత్రి నిర్మలా సీతారామన్‌ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పనిగంటల ప్రస్తావన వచ్చింది. వారానికి 60 గంటలకుమించి పనిచేయడంవల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని శ్రేయస్సుకు మంచిదికాదని, రోజుకు 12, అంతకంటే ఎక్కువ గంటలు పనిచేసే వ్యక్తులు గణనీయమైన స్థాయిలో బాధ అనుభవిస్తున్నారు. వారానికి ఎక్కువ పనిచేయడం ఆరోగ్యానికి హానికరమని, ప్రపంచ ఆరోగ్యసంస్థ అంతర్జాతీయ కార్మికసంస్థ అధ్యయనాల నివేదికలు కూడా ఈ అంశాన్ని స్పష్టంచేసాయని ఆర్థికసర్వేలోప్రస్తావించారు. అనధికారికంగా ఎక్కువ పనిగంటలతో ఉత్పాదకత పెరిగినా వారానికి 55-60 గంటలమధ్య పనిచేయడం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థలు సంయుక్త నివేదికల్లో ఉటంకించినట్లు ఆర్థికసర్వే ప్రస్తావించింది. ఒకేదగ్గర ఎక్కువ పనిగంటలు చేయడంవలన మానసిక ఆరోగ్యాన్ని క్షీణింపచేస్తుందని సపెయినలాబ్స్ సెంటర్ హ్యూమన్ బ్రెయిన్ అండ్ మైండ్ స్టడీ రిపోర్టును ఎకనమిక్ సర్వే హైలైట్‌చేస్తూ ప్రస్తావించింది. పనిగంటలపై పరిమితులు విధించి ఆర్థికవృద్ధికి అవాంతరం కలిగించవచ్చని సర్వే అంచనా వేసింది. కార్మికుల సంపాదన సామర్థ్యాన్ని దెబ్బతీసే అవకాశం లేకపోలేదని తెలిపింది. సౌకర్యవంతమైన పనిగంటల విధానం భారత దేశాన్ని ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంచుతుందని ఈ చర్యలతో చిన్న మధ్య తరహా పరిశ్రమల వృద్ధికి తోడ్పడుతుందని ఆర్థికసర్వే సూచించింది.

# అమెరికాలో వీసా గడువు తీరినా తిరిగి వెళ్లని భారతీయులు 7,000 మంది

## వెల్లడించిన సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్!





**వాషింగ్టన్, జనవరి 31:** భారత్ నుంచి అమెరికాకు విద్యార్థులుగా, ఎక్స్చేంజి విజిటర్స్‌గా వచ్చి 2023లో వీసా గడువు తీరినా వెనక్కి తిరిగి వెళ్లని భారతీయులు 7,000మంది ఉన్నారని సెంటర్ ఫర్ ఇమ్మిగ్రేషన్ స్టడీస్ వెల్లడించింది. వీరితో పాటు దాదాపు 32 దేశాల విద్యార్థులు, ఎక్స్చేంజి విజిటర్స్‌లో 20 శాతానికిపైగా గడువు తీరినా అమెరికాను వదిలిపెట్టలేదంలేదని పేర్కొంది. ఎఫ్,ఎం కేటగిరీల్లో ఈ సమస్య అధికంగా ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో వలస చట్టాల్లో, హెచ్1బి వీసా విధానాల్లో సంస్కరణలు అవసరమని అమెరికా చట్టసభ కమిటీ సభ్యులకు సూచించింది. హెచ్1బి వీసాలు 75లోపే ఉండాలని సిఫార్సు చేసింది. అమెరికాలో ఇమ్మిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పునరుద్ధరణ పై సిఐఎస్ ప్రతినిధి జెస్సికా ఎం వాన్ సభా కమిటీకి వివరాలను వెల్లడించారు. అమెరికాలోని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో చదువుకోవడానికి, భాషా శిక్షణకు ఎఫ్1 వీసాలిస్తారు. వృత్తి విద్యలో శిక్షణకు, విద్యేతర శిక్షణకు, విద్యేతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు, భాషేతర అంశాల్లో శిక్షణ పొందేందుకు ఎం1 వీసాలను అందచేస్తారు. భారత్, చైనా, బ్రెజిల్, కొలంబియాల నుంచి వచ్చిన వారిలో ఒక్కోదేశం నుంచి 2,000 మందికిపైగా 2023లో వీసా గడువు తీరినా అమెరికాలోనే ఉంటున్నారు. ఇందులో భారత్ నుంచి వచ్చిన వారే అత్యధికంగా 7,000 మంది ఉన్నారు. చదువు అయిపోగానే విద్యార్థి స్వదేశానికి తిరిగివెళ్లేలా అంగీకరించే విధానం ఉండాలి అని జెస్సికా సూచించారు.

# భక్తులరద్దీతో కొన్ని ఘాట్లలో గంగాహారతి నిలిపివేత



**మహాకుంభ్‌నగర్, జనవరి 31:** ప్రయాగరాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న మహాకుంభమేళాకు భక్తులు భారీసంఖ్యలో వెల్లువలా వస్తున్నారు. రద్దీదృష్ట్యా కొన్నిరోజులపాటు ఘాట్‌లవద్ద గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. జనం రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫిబ్రవరి 5వరకూ వారణాసిలోని దశాశ్వమేధ్, శీత్లా, అస్సీ తదితర ఘాట్‌లలో నిర్వహించే గంగా హారతిని నిలిపివేస్తున్నట్లు, స్థానిక ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్లనుంచి బయటికి రావద్దని పోలీస్ కమిషనర్ మోహిత్ అగర్వాల్ విజ్ఞప్తిచేసారు. ఘాట్‌లవద్ద ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రయాగరాజ్‌కు వచ్చిన భక్తులు వారణాసికి పెద్దసంఖ్యలో వస్తుండటంతో కొందరుప్రయాణీకులు వారణాసి, బనారస్ రైల్వేస్టేషన్లలో చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు. దీనితో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగు తున్నాయని తెలిపారుమౌని అమావాస్యనుంచి కాశీలో భక్తులరద్దీపెరిగిందని, వారి సంఖ్య తగ్గేవరకూ ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని విజ్ఞప్తిచేసారు. మహాకుంభమేళాలో మౌని అమావాస్యసందర్భంగా జరిగిన తొక్కిస లాటలో 30మంది చనిపోయిన నేపథ్యంలో యుపి ప్రభుత్వం రద్దీనియంత్రణకు కీలకనిర్ణ యాలు చేపట్టింది. కుంభమేళా ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిషేధించారు. వివిఐపి, స్పెషల్‌పాస్‌లు రద్దుచేసారు. ప్రయాగ రాజ్‌కు పొరుగున ఉన్న జిల్లాలనుంచి వచ్చే వాహ నాలను సరిహద్దులవద్దనే నిలిపివేయాలని చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం వన్వే ట్రాఫిక్ వ్యవస్థను అమలుకు తెచ్చారు. ఇప్పటివరకూ 29.64 కోట్ల మందిభక్తులు కుంభమేళాలో పవిత్ర స్నానాలు చేసినట్లు యుపి ప్రభుత్వం ప్రకటించింది.

# జయలలిత ఆస్తులు ప్రభుత్వానికి అప్పగింత..

**చెన్నై, జనవరి 31:** దివంగత ముఖ్యమంత్రి జె. జయలలిత ఆస్తిని తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించేందుకు బెంగళూరులోని ప్రత్యేక న్యాయస్థానం చర్యలు చేపట్టింది. ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో వాటిని అప్పగించాలని ప్రత్యేక న్యాయస్థానంలో హెచ్.ఎ.మోహన్ అధికారులను ఆదేశించారు. జయలలితకు చెందిన 1,562ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలు, 27కిలోల బంగారు, వజ్రా భరణాలు, పదివేలకు పైగా చీరలు, 750కి పైగా జతల చెప్పులు, గడియారాలు, ఇతర వస్తు వులను కర్ణాటక ప్రభుత్వం అప్పగించనుంది. ఈ ఆస్తులు, వస్తువులు తమకు చెందాలంటూ జయలలిత వారసులుగా చెబుతున్న జె.దీపక్, జె.దీప వేసుకున్న అర్జీని ఇటీవలే కర్ణాటక హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

# రంజీలోనూ స్టార్స్ ఫెయిల్


రోహిత్ శర్మ


రిషబ్ పంత్


శ్రేయస్ అయ్యర్


కెఎల్ రాహుల్


యయశ్వి జైస్వాల్

## రాణించ లేని ప్లేయర్లు
## దేశవాళీ పట్ల నో సీరియస్

**న్యూఢిల్లీ:** బిసిసిఐ అల్టిమేటం జారీ చేయడం వల్ల టీమ్ఇండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, యశస్వీ జైస్వాల్, రవీంద్ర జడేజా, శుభ మన్ గిల్ ఇటీవల రంజీ ట్రోఫీ బరిలో నిలిచారు. ఇటీవల కాలంలో సీనియర్లు రోహిత్, విరాట్ సహా కుర్రాళ్లు సైతం ఫామ్‌కోల్పోవడం వల్ల ఆటగాళ్లంతా దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా ఆడాలని నిబంధన పెట్టింది. ఈ క్రమంలో రోహిత్ సహా పలువురు ఇప్పటికే రంజీలో ఓ మ్యాచ్ ఆడేశారు. కోహ్లీ, రాహుల్ గురువారం ఢిల్లీ తరఫున బరిలోకి దిగారు. అయితే ఇక్కడే అందరికీ ఓ ప్రశ్న తలెత్తుతోంది. రంజీలో ఆడాలని బిసిసిఐ నిబంధన మేరకు స్టార్ ప్లేయర్లంతా బరిలోకి దిగినా, ఈ టోర్నీకి వీళ్లిచ్చిన ప్రాధాన్యం ఎంత అనే ప్రశ్న తలెత్తుతోంది. వాళ్లు దీన్ని ఏమాత్రం సీరియస్‌గా తీసుకోలేదనేది ఫలితాలను బట్టి అర్థమవుతోంది. ఈ సీజన్‌లో వీళ్లంతా ఒక మ్యాచ్‌కే పరిమితం అవ్వడం, అందులోనూ పెద్దగా రాణించకపోవడం వల్ల దేశవాళీలో బరిలోకి దిగి ఏం లాభం అనే అభిప్రాయం తలెత్తుతోంది. రోహిత్, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్ గత వారం జమ్ము కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో బరిలోకి దిగారు. కానీ, ఈ ముగ్గురూ పేలవ ప్రదర్శనే చేశారు. వరుసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ 3, 28, జైస్వాల్ 4, 26, శ్రేయస్ 11, 17 పరుగులకు పరిమితమ య్యారు. మరోవైపు ఢిల్లీ తరఫున ఆడిన రిషబ్ పంత్ సైతం రెండు ఇన్నింగ్స్‌ల్లో 1, 17 పరుగులే చేశాడు. పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన శుభ్ మన్ గిల్ తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా, రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించాడు. ఇక జడేజా బౌలింగ్‌లో రాణించాడు. ఇక చానాళ్ల తర్వాత గురువారం రంజీ మ్యాచ్ బరిలోకి దిగిన రాహుల్ విఫలం అయ్యాడు. క్రీజులో సెటిల్ అయినట్లే కనిపించిన ఈ కర్నాటక బ్యాటర్ మంచి ప్రారంభాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. హర్యానా, కర్నాటక జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో రాహుల్ 37 బంతులు ఎదుర్కొన్నాడు. 4 ఫోర్ల సాయంతో 26 పరుగులు చేశాడు. అయితే ఎవరెలాంటి ప్రదర్శన చేశారన్నది పక్కన పెడితే, వీళ్లంతా ఈ సీజన్లో ఒక్క మ్యాచ్‌కే పరిమితం కావడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతోంది. మరికొన్ని రోజుల్లో ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఆ టోర్నీ ప్రాక్టీస్ శిబిరంలో పాల్గొనడం కోసం వీళ్లంతా తర్వాతి రంజీ మ్యాచ్‌కు దూరమైనట్లు చెబుతున్నారు.



## తొలి టెస్టులో పట్టుబిగిస్తున్న ఆస్ట్రేలియా
### 610 పరుగులు వెనుకబడిన శ్రీలంక

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 15 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. దీంతో లంక ఇంకా ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 610 పరుగులు వెనుకబడి ఉంది. గాలే వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో లంక బ్యాటర్లు ఒషాడోఫెర్నాండో (7), దిముత్ కరుణరత్నె (7), ఏంజెలో మాథ్యూస్ (7) అవుట్ కాగా, దినేశ్ చండీమల్ (9 బ్యాటింగ్), కమిందు మెండిస్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకు ముందు ఆస్ట్రేలియా 154 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 654 పరుగులు చేసి తమ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో రోజు ఆటలో ఆసీస్ స్టార్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ అద్భుతమైన క్యాచ్‌తో మెరిశాడు. స్టన్నింగ్ క్యాచ్‌తో శ్రీలంక వెటరన్ ఏంజెలో మాథ్యూస్‌ను హెడ్ పెవిలియన్‌కు పంపాడు. లంక ఇన్నింగ్స్ 10వ ఓవర్ వేసిన ఆసీస్ స్పిన్నర్ నాథన్ లియాన్ మూడోబంతిని మాథ్యూస్‌కు ఆఫ్ బ్రేక్ డెలివరీగా సంధించాడు. ఆ లూపీ డెలివరీని మాథ్యూస్ ఫ్రంట్ ఫుట్ డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నం చేశాడు. కానీ బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుని షార్ట్-లెగ్ ఫీల్డర్ కుడివైపునకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడేఉన్న హెడ్ తన కుడివైపునకు లాంగ్‌డైవ్ చేస్తూ సింగిల్ హ్యాండ్‌తో క్యాచ్ అందుకోవడంతో మాథ్యూస్ (7) నిరాశతో మైదానాన్ని వీడాడు. కాగా ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లలో ఓపెనర్ ఉస్మాన్ ఖ్వాజా (352 బంతుల్లో 232 పరుగులు, 16 ఫోర్లు, 1సిక్స్) కెరీర్లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకోగా, అరంగ్రేట ఆటగాడు జోస్ ఇంగ్లిస్ (94 బంతుల్లో 102 పరుగులు, 10 ఫోర్లు, 1 సిక్స్), స్టీవ్ స్మిత్ (251 బంతుల్లో 141 పరుగులు, 12 ఫోర్లు, 2సిక్సులు) సెంచరీలతో మెరిశారు. ఇక ఆస్ట్రేలియా ఇప్పటికే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.


శ్రీకాంత్


శంకర్

## థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్‌లో..
## క్వార్టర్స్‌లోకి శ్రీకాంత్, శంకర్

**న్యూఢిల్లీ:** థాయ్‌లాండ్ మాస్టర్స్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్లు కిడాంబి శ్రీకాంత్, శంకర్ ముత్తుస్వామి సుబ్రమణియన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. అలాగే ఇదే టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ రామరాజ్ క్వార్టర్ ఫైనల్ బెర్తును ఖరారు చేసుకుంది. బ్యాంకాక్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాంత్ 21-19, 21-15తో హాంకాంగ్‌కు చెందిన జేసన్ గుణవాన్‌పైన, అలాగే శంకర్ 9-21, 21-10, 21-17తో ఇండోనేసియాకు చెందిన చికో ద్వి వర్దోయోపైన, మహిళల సింగిల్స్ విభాగంలో రక్షిత శ్రీ 21-15, 21-12తో చైనీస్ తైపీకి చెందిన క్లా టాంగ్ టుంగ్‌పై గెలుపొందారు.

ఇక మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్‌కు చెందిన ప్లేయర్లు గద్దె రుతిక్వ శివాని-రోహన్ కపూర్ ద్వయం 19-21, 15-21తో థాయ్లాండ్‌కు చెందిన రచాపోల్- నాథమోన్ జంట చేతిలో ఓడిపోయింది.

### మహిళల అండర్ 19 వరల్డ్ కప్‌లో..
# టైటిల్ పోరుకు భారత్

- సెమీస్‌లో 9 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ ఓటమి
- ఫిబ్రవరి 2న ఫైనల్ పోరు



**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచ కప్-2025 టోర్నమెంట్‌లో ఇంగ్లండ్‌పై జరిగిన సెమీఫైనల్ పోరులో భారత్ ఘన విజయం సాధించింది. కౌలాలంపూర్‌లోని బేయూమాస్ ఓవల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తన జోరు కొనసాగించింది. లీగ్ దశ, సూపర్ సిక్స్ దశల్లో సత్తా చాటుతూ జైత్రయాత్ర యాత్రను కొనసాగించిన భారత్ అమ్మాయిలు సెమీ ఫైనల్లోనూ అదరగొట్టారు. ఫలితంగా వరుసగా రెండోసారి భారత్ ఈ ఐసిసి టోర్నీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. ఓపెనర్ డేవీనా పెరిన్ 45 పరుగులతో సత్తా చాటగా, మరో ఓపెనింగ్ బ్యాటర్ జెమీమా స్పెన్స్ మాత్రం 9 పరుగులకే పరిమితమైంది. ఇక కెప్టెన్ అబీ నార్‌గ్రోవ్ 30 పరుగులతో రాణించగా, లోయర్ ఆర్డర్‌లో అమూ సురేన్‌కుమార్ 14 పరుగులతో అజేయంగా నిలిచింది. మిగతా వాళ్లలో ట్రూడీ జాన్సన్ డకౌట్ కాగా, చార్లెట్ స్టబ్స్ (4), కేటీ జోన్స్ (0), ప్రిషా తానావాలా (2), చార్లెట్ లాంబర్ట్ (0) కూడా పూర్తిగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా, వైష్ణవిశర్మ ఒక్కొక్కరూ 3 వికెట్లతో చెలరేగగా, ఆయుశీ శుక్లా 2 వికెట్లు పడగొట్టింది. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు కేవలం ఒక్క వికెట్ నష్టపోయి పని పూర్తి చేసింది. ఓపెనర్ జి. కమలిని అర్ధ శతకం (50 బంతుల్లో 56 రన్స్, నాటౌట్)తో మెరవగా, గొంగడి త్రిష 29 బంతుల్లో 35 పరుగులు చేసింది. అదే సమయంలో త్రిషను ఇంగ్లండ్ బౌలర్ ఫోబే బ్రెట్ ఔవుట్ చేయగా, కమలినికి తోడుగా వన్‌డౌన్‌లో ఆడిన సనికా చాల్కె 11 పరుగులతో అజేయంగా నిలిచింది. 15వ ఓవర్లో కమలిని ఫోర్ బాదడంతో భారత్ విజయం ఖరారైంది.

### మహిళల అండర్ 19 టి20 ప్రపంచ కప్‌లో..
## ఫైనల్స్‌కు దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళ అండర్-19 టీ20 వరల్డ్ కప్-2025 టోర్నీలో సౌతాఫ్రికా ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆస్ట్రేలియా మహిళా జట్టును ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. వరల్డ్ కప్ తాజా ఈవెంట్లో ఇప్పటికే గ్రూప్1 నుంచి భారత్, ఆస్ట్రేలియా, గ్రూప్2 నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సెమీ ఫైనల్స్‌కు చేరాయి. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సౌతాఫ్రికా ఆస్ట్రేలియా మధ్య తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగింది. కౌలలంపూర్లోని బేయూమస్ ఓవల్ మైదానంలో టాస్ గెలిచిన ఆసీస్ అండర్ 19 మహిళా జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. అయితే, సౌతాఫ్రికా బౌలర్ల దెబ్బకు కంగారు జట్టు బ్యాటర్లు ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. ఓపెనర్లలో ఇనెస్ మెకియోన్ డకౌట్ కాగా, గ్రేస్ లియాన్స్ 2 పరుగులే చేసి అవుటైంది. ఇక వన్డౌన్‌లో వచ్చిన కెప్టెన్ లూసీ హామిల్టన్ 18 పరుగులు చేయగా, మిగతా వాళ్లలో ఎలియనోర్ లారోసా (7), హస్రత్ గిల్ (1), ఛ్లోయే ఐన్స్‌వర్త్ (1), లిలీ బాసింగ్ వైట్ (2), టెగాన్ విలియమ్సన్ (3) పూర్తిగా విఫలమయ్యారు.

అయితే, మిడిలార్డర్ బ్యాటర్ కాయిమే బ్రే 36 పరుగులతో రాణించగా, ఎల్లా బ్రిస్కో మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. 17 బంతుల్లో 4 ఫోర్ల సాయంతో 27 పరుగులతో అజేయంగా నిలిచింది. వీరిద్దరి కారణంగా ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 105 పరుగులు చేయగలిగింది. ఇక సౌతాఫ్రికా బౌలర్లలో ఆష్లేవాన్ విక్ 4 వికెట్లతో చెలరేగగా, ఎంతబిసెంగ్ నిని, కెప్టెన్ కైలా రెయ్‌నెకె, షేష్నీ నాయుడు ఒక్కో వికెట్ పడగొట్టారు. ఇక స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్ జెమ్మా బోతా (24 బంతుల్లో 37 రన్స్) శుభారంభం అందించగా, మరో ఓపెనర్ సిమోనే లౌరెన్స్ (5) మాత్రం నిరాశపరిచింది. వన్‌డౌన్ బ్యాటర్ ఫే కౌలింగ్ (7) కూడా విఫలం కాగా, కైలా కెప్టెన్ ఇన్నింగ్స్ బాధ్యతాయుతంగా ఆడి 26 బంతుల్లో 26 పరుగులు చేసింది.

# రికార్డుస్థాయిలో ఐఫోన్ల సేల్స్

**న్యూఢిల్లీ, జనవరి 31:** భారత్‌లో ఆపిల్ విక్రయాలు జోరందుకున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో విక్రయాలు నమోదయ్యాయి. ఈ విషయాన్ని కంపెనీ సిఇఒ టిమ్ కుక్ శుక్రవారం వెల్లడించాడు. అదే సమయంలో భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా అవతరించిందన్నారు. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఐఫోన్ రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేసిందని టిమ్ కుక్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఐ ఫోన్ రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ అని పేర్కొన్నారు. ఇక పిసిలు, ట్యాబ్లెట్లకు మూడో అతిపెద్ద మార్కెట్‌గా ఆపిల్ నిలిచిందన్నారు. భారత్‌లో అత్యధికంగా అమ్ముడైన స్మార్ట్‌ఫోన్ మోడల్‌గా ఐఫోన్ నిలవడం ఇదే తొలిసారి. భారత్‌తో పాటు అమెరికా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్ దేశాల్లో వీటి విక్రయాలు జోరందుకున్నట్లు కుక్ తెలిపారు. కౌంటర్ పాయింట్ రీసెర్చ్ ప్రకారం 2024లో విలువపరంగా ఆపిల్ 23 శాతం, శాంసంగ్ 22 శాతం మార్కెట్ వాటాతో నిలిచాయి. వివో 16శాతం, ఒప్పో 14శాతం, షావోమి 9శాతం వాటాతో తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఆపిల్ ప్రత్యేకంగా భారత్‌దేశంపై ఆసక్తిగా ఉందని టిమ్‌కుక్ తెలిపారు. ఆపిల్ ఇంటెలిజెన్స్‌ను ఇంగ్లీష్‌తో సహా మరిన్ని భాషలకు సపోర్ట్ చేసేలా తీసుకొస్తామని వెల్లడించారు. భారత్‌లో ఎంటర్‌ప్రైజ్ విభాగం నుంచి



ఆపిల్‌కు బలమైన డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2023 ఏప్రిల్‌లోనే ఢిల్లీ, ముంబైలో రెండు రిటైల్ స్టోర్లను ప్రారంభించింది. ఈ స్టోర్లకు వచ్చిన ఆదరణ నేపథ్యంలో విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే బెంగళూరు, పుణె, ఢిల్లీ-ఎన్‌సిఆర్, ముంబైలో మరో నాలుగు స్టోర్లు ప్రారంభించనున్నట్లు ప్రకటించింది.

## వినియోగం పెంచితేనే ఎకానమీకి బూస్ట్

**న్యూఢిల్లీ, జనవరి 31:** మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక పూర్తి సంవత్సరానికి ప్రవేశపెడుతున్న బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి చూపుతోంది. వృద్ధిరేటు అంచనాలు క్షీణించిన వేళ, దీన్ని తిరిగి గాడిన పెట్టేందుకు చర్యలు తీసుకోక తప్పని పరిస్థితి. ముఖ్యంగా ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం ప్రధానమైన టాస్క్ ఇందులో భాగంగానే వేతన జీవులకు ఊరటనిచ్చే అంచనాలు ఉన్నాయి. దీనితో పాటు అన్ని వర్గాల వినిమయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా నమోదు కావొచ్చని కేంద్ర గణాంక కార్యాలయం అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది 8.2 శాతంగా ఉంది. దేశీయ వృద్ధి అంచనాలు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయికి చేరిన వేళ నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వేతన జీవులకు పన్ను ఊరట కల్పించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇవ్వొచ్చని ఎక్కువ మంది ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఓ వైపు ద్రవ్యోల్బణాన్ని అదుపుచేస్తూనే వృద్ధికి చర్యలు తీసుకోవడంతో కూడిన వ్యవహారమేనని అభిప్రాయపడుతున్నారు. వినియోగ వ్యయానికి, దేశాభివృద్ధికి మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. ఈ వ్యయాలు ఎంత ఎక్కువగా పెరిగితే అభివృద్ధి అంతగా ఊపందుకుంటుంది. దాంతో పరిశ్రమలు కార్మికశక్తిని పెంచుకోవాల్సి వస్తుంది. వారి ఆదాయాలు పెరిగి జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఫలితంగా స్థూల దేశీయోత్పత్తి



పెరుగుతుంది. ఇదంతా ఒక చక్రంలా పనిచేస్తుంది. కాబట్టి దేశవినియోగంపై ఆధారపడి ఉంటుంది. ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడులు పెరగాలని ఆర్థికనిపుణులు సూచిస్తున్నారు. వృద్ధికి చర్యలు చేపడతారన్న అంచనాలతో ఈ సారి బడ్జెట్‌పై వేతనజీవులు గంపెడాశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కొత్త పన్ను విధానంలో శ్లాబుల సవరణ, రిబేట్ పెంపు, స్టాండర్డ్ డిడక్షన్ పెంపు ఉన్నాయి. ప్రస్తుతం పన్ను విధానంలో ఉన్న రూ.75 వేల స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని లక్ష రూపాయలకు పెంచాలని కొత్త పన్ను నిపుణులు కోరుతున్నారు.

## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జనవరి 31:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజు లాభాల్లో ముగిసాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాల మధ్య ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలోనే పయనించాయి. ఐటి, ఆటో రంగ షేర్లలో కొనుగోళ్లతో సూచీలు రాణించాయి. దీంతో మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 740 పాయింట్లు పెరిగి 77,500.57 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 258 పాయింట్లు పెరిగి 23,508 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.86.61 వద్ద స్థిరపడింది. ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంకు, నెస్లె ఇండియా, టైటాన్ కంపెనీ, టాటా స్టీల్,



టాటా మోటార్స్, ఐటిసి, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతి సుజుకి, ఏసియన్ పెయింట్స్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. భారతీఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్‌ఫైనాన్స్, ఐసిఐసిఐబ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.

# నేటి నుంచి మారుతున్న రూల్స్

**వాణిజ్యం**

**ముంబై, జనవరి 31:** సామాన్యులపై ప్రభావం చూపే అనేక ప్రకటనలు ఫిబ్రవరిలో ఉన్నాయి. కేంద్రాల్లోని ప్రకటనలతో పాటు ఆర్బీఐ బడ్జెట్ రేట్లపై నిర్ణయాలు, యూపీఐ నిబంధనల్లో కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి. వీటితో పాటు అంశాలు ఫిబ్రవరిలో చోటు చేసుకుంటున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న బడ్జెట్ (యూనియన్ బడ్జెట్ 2024) ప్రవేశపెట్టనున్నారు. ఇందులో ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయోనని దేశ ప్రజలు ఎంతో ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు ఊరట, నిరుద్యోగులకు భరోసా, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు వంటి అంచనాలు ఉన్నాయి. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోనుందో తెలియాలంటే గంటలు ఆగాల్సిందే. 2023 ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తూనే ఉంది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడంతో ఫిబ్రవరి 7న నిర్వహించే ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపిసి) ప్రకటన వడ్డీ రేట్ల తగ్గింపు ఉండే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. అంచనాల కంటే వృద్ధి నెమ్మదించడం, కమిటీలో కొత్త సభ్యులు చేరికల కారణంగా ఈ సారి వడ్డీ రేట్ల కోతనే ఆశలు మళ్లీ చిగురించాయి. డిజిటల్ చెల్లింపులకు మరింత భద్రతపెంచే దిశగా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ముందడుగు వేసింది. ఇందులో భాగంగా యూపీఐ లావాదేవీలకు సంబంధించి కొత్త నిబంధనను తీసుకొచ్చింది. యూపీఐ లావాదేవీ ఐడీ కచ్చితంగా ఆల్ఫానమరికా ఉండేలా చూడాలని పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లకు సూచించింది. ఐడీలో అంకెలు,అక్షరాలు మాత్రమే ఉండాలని, స్పెషల్ క్యారెక్టర్లుఉంటే లావాదేవీలను అనుమతించబోమని ప్రకటించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది. దాదాపు అన్ని ప్లాట్‌ఫామ్‌లు ఇప్పటికే ఈ నిబంధనలను పాటిస్తున్నాయి. ఒకవేళ పాటించకపోతే మీ లావాదేవీ ఆగిపోయే అవకాశం ఉంది. కాబట్టి మీ యాప్‌ను అప్‌డేట్ చేయండి. మరిన్ని వివరాలకు మీ కస్టమర్‌లను సంప్రదించండి. దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ కార్లధరల పెంపును తాజాగా ప్రకటించింది. ఫిబ్రవరి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి వచ్చింది. సెలెరియా, ఇన్విక్టో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, ఎసయూవీ బ్రెజా, విటారా, ఆల్టో, ఎక్స్‌ప్రెసో, బాలెనో, కాంపాక్ట్ ఎస్యూవీ, డిజైర్




ఇలా అన్ని మోడళ్లపై ధరలు పెంపు ఉంటాయి. కారు మోడల్ ఆధారంగా అత్యధికంగా రూ.32,500 వరకు పెంపు ఉన్నట్లు ఇటీవలే ప్రకటించింది. ప్రతి నెలా ఒకటో తేదీన చమురు సంస్థలు ఎల్పీజీ సిలిండర్ ధరలను సవరిస్తుంటాయి. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లతో పాటు వాణిజ్య సిలిండర్ ధరలను అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా సవరిస్తుంటాయి. ఈ సారి ఎలాంటి మార్పులు చేస్తారో చూడాలి.

## కరెంటు ఛార్జీల భారం ఇబ్బందికరం: సిఇఎ అనంత నాగేశ్వరన్

**ముంబై, జనవరి 31:** రాష్ట్రాలు వ్యాపార రంగంలోని సంస్థలపై కరెంటు ఛార్జీలను భారీ మోపుతున్నాయని చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. ఆర్థిక సర్వే 2025 విడుదల అనంతరం ఆయన విలేకర్లతో సమావేశమయ్యారు. మారుతున్న భౌగోళిక రాజకీయ సమీకరణలు చాలా కీలకమని పేర్కొన్నారు. మార్పులో గ్లోబలైజేషన్ శక్తిగా ఆయన.. ప్రపంచ స్థాయిలో జీవన ప్రమాణాలను, అనుసంధానతను పెంచింది. వ్యయాలను తగ్గించిందని అభివర్ణించారు. ప్రపంచ స్థాయిలో చైనా అత్యంత వేగంగా ఎదుగుతోందని నాగేశ్వరన్. కేవలం 10 ఏళ్ల కాలంలోనే ప్రపంచంలోనే 70 శాతం సౌరశక్తి ఆధారిత విద్యుత్తు తయారీ కేంద్రంగా మారింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమలపై నియంత్రణలను తగ్గించాలని ఆయన అభిప్రాయపడ్డారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్కరణలను చేసి.. చిన్న, మధ్యతరగతి సంస్థలు వ్యయ నియంత్రణలతో, పోటీగా నిర్వహించేలా తయారు చేయాలి అని పేర్కొన్నారు. ప్రధాన భారత్‌లో చాలా రాష్ట్రాల వ్యాపారాలపై అత్యధిక కరెంటు ఛార్జీల భారం మోపుతోంది. ఈ వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాలతో మనం పోటీ పడే పరిస్థితి లేకుండా పోతుంది. వియత్నాంలో పరిశ్రమలకు అనుకూలమైన ఈ ఛార్జీలుఉన్నాయి. వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి ఉంది. ఈ రంగంలో బలమైన వృద్ధి నమోదైతే, జీడీపీ వృద్ధిరేటులో 0.75 శాతం నుంచి 1 శాతం వరకు ఉంటుంది. 2026 నాటికి ప్రతి పిల్లవాడికి ప్రాథమిక అక్షరాస్యత, గణితం వచ్చేలా చేయాలన్న లక్ష్యంతో నైపుణ్యం భారత్ కార్యక్రమంపై దృష్టిపెట్టారు. దీని వల్ల బిహార్, గుజరాత్ వంటి చోట్ల సానుకూల ఫలితాలు వచ్చాయి. భారత్‌లో గత పదేళ్లకు పైగా మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టిసారించడం సానుకూలఫలితాలను ఇచ్చింది. సరికొత్త రైళ్లు, ఎయిర్ పోర్టు, ఓడరేవులు అందుబాటులోకి రావడంతో టర్న్ అరౌండ్ టైం 4 గంటల నుంచి 30 గంటలకు తగ్గింది. విద్యుత్తు రంగంలో ఉత్పత్తి పెరుగుదల, డేటా వ్యయం తగ్గింపు, టెలికాంఫ్రా ఇన్‌స్కాషన్‌లో కీలక విజయాలు. తప్పుడు వాణిజ్య ప్రకటనలు, సెలబ్రిటీల ఎండార్స్‌మెంట్‌లు, అస్పష్టమైన లేబులింగ్‌లు ఆందోళనకరం. ముఖ్యంగా అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌ను ఈ విధానాలలో అమ్మడం వినియోగదారుల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ముప్పు ఉంది. కేన్సర్లు, శ్వాస సంబంధ సమస్యలు, గుండెజబ్బులు, జీర్ణకోశ సమస్యల ముప్పు పొంచి ఉంది. ఈ యేడాది తొలి అర్థ భాగంలో ఆర్థిక వృద్ధి 6శాతం ఉంది. ద్వితీయార్థంలో మరింత బలపడినట్లు అంచనా వేస్తున్నాం.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.